RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 18.05.2025 | సంపుటి :11 సంచిక : 299 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



## భారత్ దాడుల్లో తీవ్రంగా నష్టపోయాం

### ఎట్టకేలకు పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అంగీకారం

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** భారత్ దాడులపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇన్ని రోజులు బుకాయించిన పాక్.. భారత్ దాడులు చేసిందని ఒప్పుకుంది. శుక్రవారం ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాక్ ప్రధాని షరీఫ్ ప్రసంగిస్తూ.. నూర్ ఖాన్‌తోపాటు- పలు వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని అంగీకరించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారత్ ఖచ్చితమైన దాడులు జరిపినట్లు మిగతా 2లో..

## ఐఎస్ఐ ఏజెంట్ జ్యోతి మల్హోత్ర అరెస్టు

- యూ ట్యూబర్‌గా పాక్‌కు గూఢచర్యం
- దేశానికి చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఐదురోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై హరియాణాలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒక మహిళా యూట్యూబర్ కూడా ఉన్నారని శనివారం వెల్లడించారు. మిగతా 2లో..

## త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ సీఎం మర్యాదపూర్వకంగా భేటీ**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రె డ్డితో ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.ఈ బోర్డులో భాగస్వామ్యం కావాలని అభిజిత్ బెనర్జీని కోరగా.. అందుకు మిగతా 2లో..



## మహిళాశక్తిని ఇందిర ప్రపంచానికి చాటారు

### మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే మా లక్ష్యం

- అప్పుడే రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకుంటుంది
- తెలంగాణ మహిళలందరికీ యూనిక్ ఐడి కార్డు అందిస్తాం
- వారి ఆరోగ్యం, సంపాదన వివరాలన్నీ అందులో పొందుపరుస్తాం
- మహిళలు ఆర్థిక శిక్షణ పొటిస్తున్నారు
- ఆడబిడ్డలను ప్రోత్సహించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- మహిళలకు రూ.500కే సిలిండర్ అందిస్తున్నాం
- అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను వారికే అప్పగించాం
- 21న ఇందిరా మహిళ స్టాళ్లను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శిస్తారు
- 'వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** మహిళలే దేశానికి ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు- చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..కోటిమంది మహిళలు కోటీశ్వరులు అయితే, ఆర్థికంగా రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళా శక్తిని ప్రపంచానికి ఇందిరాగాంధీ చూపించారు. రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే కోటి మిగతా 2లో..

## గచ్చిబౌలి స్టేడియంలో అందాల భామల ఆటలు

మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు స్పోర్ట్స్ డే ఈవెంట్ నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పలు క్రీడల్లో కంటెస్టెంట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.మొత్తం పది స్పోర్ట్స్ ఈవెంట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు

## ప్రపంచానికే తెలంగాణ రోల్‌మోడల్

### డ్రగ్స్ కట్టడిలో అగ్రస్థానంలో రాష్ట్రం

### పోలీసులకు సీఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్(జనంసాక్షి):** డ్రగ్స్ కట్టడిలో ప్రపంచంలోనే తెలంగాణ అగ్రస్థానం సాధించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 138 దేశాలతో పోటీపడి ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ మిగతా 2లో..

## మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట

### భూ సేకరణ పోరాట కేసు కొట్టివేత

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ అంశంలో మంత్రి శ్రీధర్‌బాబుపై సహా 13 మందిపై నమోదైన కేసును నాంపల్లి కోర్టు కొట్టివేసింది. 2017లో శ్రీధర్ బాబుతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.కేసును కోర్టు కొట్టివేసిన అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. మిగతా 2లో..

## త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తాం

### మెట్రో ఛార్జీల పెంపును పరిశీలిస్తాం

### హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్షించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు త్వరలో పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అలాగే, మెట్రో టికెట్ ధరల పెంపుపై కూడా తన దృష్టికి వచ్చిందని అన్నారు. వయబుల్ కాని కారణంగా మెట్రో ఛార్జీలు పెంచినట్లుగా వారు చెబుతున్నారు.. దానిపై ప్రభుత్వం సమీక్ష చేస్తుంది.. హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రిగా తాను కూడా ఛార్జీలు తగ్గించమని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేస్తాను అని వెల్లడించారు. నగర అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ సమీక్ష సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి పనులపై చర్చించాం అని తెలిపారు. ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాను.. వర్షాకాలంలో వచ్చే సమస్యలను తగ్గించేలా క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.. ఇక, నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేస్తాం.. స్ట్రీట్ లైట్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం.. అలాగే, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మిగతా 2లో..

## దౌత్య యుద్ధం

- పాక్ దుర్నీతిని విదేశాలకు వివరించేందుకు రంగం సిద్ధం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఏడుగురు ఎంపీలతో ఏడు బృందాల ఏర్పాటు
- శశిథరూర్, కనిమోళి, సుప్రియా సూలెలకు చోటు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతోన్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కొందరిని ఎంపిక చేసింది. వీరంతా వివిధ దేశాలకు వెళ్లి పాక్ ఉగ్ర కుట్రలను వివరిస్తారు. ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం కేంద్రం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ - ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసే)లు ఉన్నారు. వీరంతా విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన

## ట్యాంక్‌బండ్‌పై 'తిరంగా ర్యాలీ'

### పాల్గొన్న ప్రముఖులు

**హైదరాబాద్(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకొని, మన దేశ సైనికులకు సంఘీభావంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న డాక్టర్. బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన 'తిరంగా ర్యాలీ'.. సచివాలయం జంక్షన్ మీదుగా సైనిక ట్యాంక్ వరకు కొనసాగింది.

## గడువు దాటితే వేటు తప్పదు

### నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని వారికి అమెరికా హెచ్చరిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. బహిష్కరణ ముప్పు తప్పదని, అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఎంబసీ పోస్టు పెట్టింది.పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే.. భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తివ్యక్తిగత అవకాశా లపై గణనీయమైన ప్రభావం చూపనుంది నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఏవైనా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బందులు ఏర్పడితే.. చట్టపరమై న పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.కాగా.. అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. "అమెరికాలో 30 రోజులకు నిబంధనలకు మించి నివసిస్తున్న వారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు.అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి" అని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే.ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే మిగతా 2లో..

## ట్రంప్ నోట.. మళ్లీ పాత పాట

మా వస్తువులపై 100% టారిఫ్‌లను తగ్గించడానికి భారత్ అంగీకరించిందని వ్యాఖ్యలు

**వాషింగ్టన్(జనంసాక్షి):** జీరో టారిఫ్‌ల విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే చాలారకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని మరోసారి పునరుద్ఘాటించారు.భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో ట్రంప్ మిగతా 2లో..

## కోర్టు తీర్పుతో అమెరికన్లకు హాని

వలసలదారుల బహిష్కరణకు వ్యతిరేకంగా ధర్నాసనం తీర్పుపై తీవ్రంగా స్పందించిన ట్రంప్

వార్త 2లో

## భారత్, పాక్ శాంతి చర్చలు పునఃప్రారంభించాలి

### ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం: రష్యా



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఇరుదే శాలు పరస్పర చర్చలు జరపాలని ఇప్పటికే అమెరికా, చైనాలు భారత్‌కు సూచించాయి.తాజాగా రష్యా సైతం ఇదే సలహాను ఇచ్చిం ది. "ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలపై భారత్ -పాక్ ప్రత్యక్ష శాంతి ఒప్పంద చర్చలు జరపాలని ఆశిస్తున్నాం. ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం" అని రష్యన్ ఫెడరేషన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు.ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా స్పందిస్తూ..భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించింది. భారత్, పాక్ సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతి మార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్, పాక్ ప్రత్యక్ష చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మిగతా 9లో..

## ముంబైలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల పట్టివేత

### ఛత్రపతి విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ..కాశ్మీర్‌లో కొనసాగుతున్న మిలిటెంట్ల వేట

**ముంబై(జనంసాక్షి):** పహల్గాం ఘటన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది.తాజాగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. ఇండోనేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన ఐసిస్ సభ్యులు అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మిగతా 2లో..

## హైదరాబాద్ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

### ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** పార్టీలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర మంత్రి మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18.05.2025

# ఐఎస్ఐ ఏజెంట్ జ్యోతి మల్హోత్ర అరెస్టు

వీరంతా పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకు చెందినవారితో తరచూ సంప్రదింపులు జరుపుతున్నారని, శత్రుదేశానికి సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారని తెలిపారు ఆ ఆరుగురిని హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి అదుపులోకి తీసుకున్నారు. హిస్సార్ ప్రాంతం నుంచి అరెస్టయిన మహిళా యూట్యూబర్ పేరు జ్యోతి మల్హోత్రా అని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం న్యాయస్థానం ఆమెకు ఐదురోజుల పోలీసు రిమాండ్ విధించింది. ఆమె ఒక ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్. ఆమె పాక్‌లో పలుమార్లు పర్యటించారు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో పాక్ వ్యక్తులతో దేశ భద్రతకు ముప్పు తెచ్చే సమాచారాన్ని చేరవేసిందని అధికారులు ఆరోపించారు. 2023లో పాక్‌కు వెళ్లిన బృందంలో తనను కూడా ఎంపిక చేశారని, అప్పుడు అహ్సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను కలిశానని విచారణలో అంగీకరించినట్లు చెప్పారు. భారత్‌కు వచ్చిన తర్వాత అతడితో సంప్రదింపులు కొనసాగించింది. అహ్సాన్ సూచన మేరకు ఆమె.. అలీ అహ్సాన్ అనే వ్యక్తిని కలుసుకుంది. పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను ఆమెకు అతడు పరిచయం చేశాడని సమాచారం. ఎవరి కంటాపడకుండా ఉండేందుకు తన పాకిస్థానీ కాంటాక్ట్‌ల వివరాలను ఇతర పేర్లతో సేవ్ చేశానని ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమె నిరంతర సంబంధాలు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుందని పోలీసులు వెల్లడించారు. ఆమె పంపిన సమాచారం, ఇతరుల ప్రమేయం గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా.. అరెస్టయిన వారిలో పటియాలలోని ఖల్సా కళాశాలలో చదువుతోన్న దేవేంద్ర సింగ్ ధిల్లాన్ కూడా ఉన్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్‌కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడని తెలుస్తోంది.

# భారత్ దాడులతో తీవ్రంగానే నష్టపోయాం

ధృవీకరించారు. భారత ఆపరేషన్ ప్రారంభమైన కొన్ని క్షణాల తర్వాత, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తనను తెల్లవారుజామున 2.30 గంటలకు నిద్రలేపారని షరీఫ్ అన్నారు. జనరల్ మునీర్.. నాకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి దాడుల గురించి తెలియజేశారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే క్షణం. ఆ సమయంలో మా వైమానిక దళం స్థానిక సాంకేతిక పరిజ్ఞానం, చైనీస్ యుద్ధ విమానాలను వినియోగించిందని షరీఫ్ చెప్పారు. కాగా, బిజెపి జాతీయ ఐటీ- విభాగం చీఫ్ అమిత్ మాల్వియా.. పాక్ ప్రధాని మాట్లాడిన వీడియో ఎక్స్ లో పోస్ట్ చేస్తూ.. ఇది ఆపరేషన్ సిందూర్.. ధైర్యం, సామర్థ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. సిందూర్‌తో ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' తో పాక్ పై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆ దేశంలోని ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడితో తోకముడిచిన దాయాది.. చివరికి కాళ్లబేరానికి వచ్చింది. అయితే, ఇన్నాళ్లూ తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ వస్తోన్న పాక్.. తాజాగా దాన్ని అంగీకరించింది. తమ కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ వైమానికి దాడులు జరిపిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మీడియా సాక్షిగా ఒప్పుకున్నారు. మే 10 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారతదేశం జరిపిన ఖచ్చితమైన దాడులను ధ్రువీకరించారు.

# భారత్, పాక్ శాంతి చర్చలు పునఃప్రారంభించాలి

విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు కోరుకుంటున్నారని తెలిపింది.భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు తమ మద్దతు పాక్‌కే అని తెగేసి చెప్పిన చైనా ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణను మాత్రం సమర్థిస్తున్నట్లు పేర్కొంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ఈ విషయంపై భారత్ స్పందిస్తూ..పాకిస్థాన్‌తో చర్చలు ద్వైపాక్షికంగానే జరుగుతాయని, ఉగ్రవాదంపై మాత్రమే చర్చలుంటాయని స్పష్టం చేసింది. మరో వైపు భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. శాంతి కోసం దీనిని ప్రతిపాదిస్తున్నామని, అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పారు.

## తెలంగాణ సింహగర్జనకు

# సరిగ్గా 24 ఏళ్లు

### కరీంనగర్ వేదికగా కెసిఆర్ ఉద్యమ పిలుపు: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**దశాబ్దాలపాటు- దగాపడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది వేసిన తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కరీంనగర్ వేదికగా ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆనాడు పూరించిన సమరశంఖం ఢిల్లీ వరకూ ప్రతిధ్వనించిన అపూర్వ సందర్భమది అని పేర్కొన్నారు. తెలంగాణ నలువైపుల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ఆ జనప్రవాహం.. ఓ సముద్రాన్నే తలపించిన చారిత్రక సన్నివేశమది. తెలంగాణ వచ్చేదా సచ్చేదా అని ఎంతో మంది అడుగడుగునా అవమానించినా, రకరకాలుగా అవహేళన చేసినా వెన్నుచూపని ఆ ధీరోదాత్తుడి సంకల్పం ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే ఓ చెరగని సంతకం. ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, ఒక్కరితో మొదలైన ఆనాటి ప్రయాణం అనుకున్న గమ్యాన్ని ముద్దాడటమే ఒక చారిత్రక విజయమైతే.. ఇక ఉద్యమ నాయకుడే ఉత్తమ పాలకుడై, సాధించిన తెలంగాణను పదేళ్లలోనే దేశానికే దారిచూపి దీపస్తంభంలా తీర్చిదిద్దిన ఆ దార్శనికత.. ప్రతి తెలంగాణ బిడ్డకు ఎప్పటికీ గర్వకారణం అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అని కేటీఆర్ వివరించారు.

# భారత్ సైన్యానికి పాక్‌లో చేరుకోలేని ప్రాంతం ఏదీ లేదు

### జమ్ముకశ్మీర్ ఎల్‌జీ మనోజ్ సిన్హా

**శ్రీనగర్(జనంసాక్షి):**భారత సాయుధ దళాలకు పాకిస్థాన్‌లో చేరుకోలేని ప్రాంతం అంటూ ఏదీ లేదని జమ్ముకశ్మీర్ ఎల్‌జీ మనోజ్ సిన్హా అన్నారు. శనివారం నియంత్రణ రేఖ వెంబడి ఉన్న తంగ్?ధర్ సెక్టార్‌లో సైనిక సిబ్బందితో ఎల్‌జీ మనోజ్ సిన్హా మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడంపై పాకిస్థాన్?కు వార్నింగ్ ఇచ్చారు.'భారత సాయుధ దళాల ధైర్యాన్ని యావత్ ప్రపంచం చూసింది. ఆ తర్వాత వాళ్లు (పాకిస్థాన్) ఎప్పుడూ యుద్ధానికి అనుకూలంగా లేమని, శాంతియుతంగా జీవించాలనుకుంటున్నామని ప్రపంచ మొత్తానికి విజ్ఞప్తి చేయడం ప్రారంభించారు. ప్రపంచంలోనే మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం. మరికొన్ని రోజుల్లో నాలుగో స్థానానికి ఎదగాలని అనుకుంటున్నాం. అభివృద్ధి చెందిన భారత్ అనే కలను నిజం చేసుకునేందుకు మనం ముందుకు సాగుతున్నాం. కానీ పాకిస్థాన్ మాత్రం రుణం అనే బలంతో మానవత్వాన్ని నాశనం చేయాలనే ప్రయత్నంలో ఉంది. మనం ఇచ్చిన ప్రతిస్పందనతో పాక్? గుణపాఠం నేర్చుకుందని నేను అనుకుంటున్నా. భారత సైన్యానికి పాకిస్థాన్?లో ఏ ప్రాంతాన్ని అయినా టార్గెట్ చేయగలదు. ధైర్యం, సామర్థ్యం, దేశం పట్ల ఉన్న మీ అంకితభావానికి సెల్యూట్ చేస్తున్నా. అలాంటి సంక్షోభం వచ్చినప్పుడల్లా, మన దేశం మీలాంటి వీరుల చేతుల్లో సురక్షితంగా ఉందని ప్రజలు తెలుసుకోవాలి' అని మనోజ్ సిన్హా అన్నారు.

# మహిళాశక్తిని ఇందిర ప్రపంచానికి చాటారు

మంది మహిళలు కోటీశ్వరులు కావాలి. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తీసుకొచ్చాం. ఆడబిడ్డలకు రూ.500కే సిలిండర్ అందిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించాం. ఈ నెల 21న ఇందిరా మహిళ స్టాళ్లను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చాలి. కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇస్తే తీసుకొని పలువురు దేశం విడిచి పారిపోతున్నారు. మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయి వడ్డీతో సహా చెల్లిస్తున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు- చేసిన స్టాళ్లను పరిశీలించారు. మహిళలే దేశానికి ఆదర్శం అని అన్నారు. మహిళలు కోటీశ్వరులు కావాలని, మహిళలకు అండగా నిలబడతానని, ఆర్థికంగా ఎదగండని రేవంత్ రెడ్డి సూచించారు. మహిళలు ఆర్థిక శిక్షణ పాటిస్తున్నారని, ఆడబిడ్డలను ప్రోత్సహించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఆడబిడ్డలు వ్యాపారంలో నిలదొక్కుకుంటే.. కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఒక యూనిక్ ఐడి కార్డు ఇస్తామని, మహిళల ఆరోగ్యం నుంచి సంపాదన వివరాలన్నీ తెలిపేలా యూనిక్ ఐడి కార్డు లభిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు

ఆయన అంగీకరించారు. ఫ్యూచర్ సిటిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని సలహా ఇచ్చారు.

## ప్రపంచానికే తెలంగాణ రోల్‌మోడల్‌గా ఉండాలి

నగర సీపీ సీవీ ఆనంద్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటామన్నారు. ప్రపంచానికే తెలంగాణ రోల్ మోడల్ గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

# ముంబైలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల పట్టివేత

శుక్రవారం రాత్రి విమానాశ్రయంలోని టెర్మినల్ 2 వద్ద వీరు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఇమిగ్రేషన్ బ్యూరో అధికారులు అడ్డుకున్నారు. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు- గుర్తించామన్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో స్థానిక పోలీసులు ఇప్పటికే వీరిని గాలిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో వీరు భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అదే ప్రదేశంలో స్లీపర్ సెల్స్‌కు బాంబు తయారీ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు. వారిని పట్టుకోవడానికి సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు- తెలుస్తోంది. గత రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు- తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడం కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ఏజెన్సీ చేస్తున్న ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ప్రధాన ముందడుగని తెలిపారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ బృందాలు ఉగ్రవాదుల జాడ కోసం జమ్మూకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. శనివారం స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గందర్‌బాల్, బారా ముల్లా సహా 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టినట్లు- అధికారులు పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్‌లోని బబ్బర్ ఖల్సా ఉగ్రవాద సంస్థకు చెందిన 15 ప్రదేశాలపై ఎన్ఐఏ బృందాలు దాడులు చేశాయి.

## గడువు దాటితే వేటు తప్పదు

దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్క రోజు అధి కంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని. వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా ప్రవేశం లభించదని చెప్పింది.

# త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేస్తాం

లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇంటిని ఆక్యూపై చేసుకొని వారి విషయంలో ఏం చేయాలనే అంశంలో ఆలోచిస్తున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలో కొత్త టెక్నాలజీ అనుసంధానం చేస్తూ కోటి రేషన్ కార్డులన్నింటిని ఎటిఎం తరహా స్మార్ట్(చిప్) కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పం మరింత జాప్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. రేషన్ పక్రియను మరింత సులభతరం చేసే చర్యల్లో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై గత కొన్ని నెలలుగా ఎంతో కసరత్తు చేసింది. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పలు రాష్ట్రాల్లో అమలు అవుతున్న తీరుతెన్నులను పరిశీలించింది. దాంతో వాటి కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే మెరుగైన పరిస్థితులు ఉన్నాయన్న అభిప్రాయానికి వచ్చారు. దాంతో పటిష్టమైన నిబంధనలతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పక్రియకు శ్రీకారం చుట్టారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల తయారీ ఏజెన్సీల ఖరారుకు ప్రభుత్వం - టెండర్లను పిలిచింది. పౌరసరఫరాల శాఖ ఇచ్చిన టెండర్ లో స్మార్ట్ కార్డు క్వాలిటీ నిబంధనలు నిర్దేశిరచారు. అంతే కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణకు వీలుగా -టె-ండర్‌లో పాల్గొనే సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన కార్యాలయం లేదా బ్రాంచ్ ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. గతంలో అనుభవాలను దృష్టిలో పెట్టు-కుని ఏదైన న్యాయపరమైన వివాదాలకు తలెత్తినప్పుడు సదరు ఏజెన్సీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్పష్టంగా ఆ నిబంధనను పెట్టింది.రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ కార్డులు 90.42 లక్షలు ఉన్నాయి. వీటి ద్వారా 285.98 లక్షల మంది లబ్దిపొందుతున్నారు. ఇంకా అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉండడంతో పేదలు కొత్త రేషన్ కార్డుల కోసం ధరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ విధంగా ప్రజా పాలన కార్యక్రమంలో, మీ సేవ కేంద్రాల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కువ సంఖ్యలో ధరఖాస్తులు అందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15లక్షల మేరకు కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన పేదలు ధరఖాస్తులు చేసుకున్నారు. వారంతా ప్రజాపాలన గ్రామసభలలో, మీ సేవ కేంద్రాల్లో ధరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో 19,34,464 ధరఖాస్తులు అందాయి. వాటిలో 1,97.450 ధరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇంకా 17,37,014 ధరఖాస్తులను పరిశీలన దశలో ఉన్నాయి. రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాల్లో 12,56,719 ధరఖాస్తులు రేషన్ కార్డుల కోసం వచ్చాయి. వాటిల్లో 7,71,053 ధరఖాస్తులను పరిశీలించారు. ఇంకా

## మంత్రి శ్రీధర్ బాబుకు

# ఊరట

భూ ములు కోల్పోతున్న రైతుల తరఫున పోరాడితే కేసులు పె ట్టారని, చివరికి న్యాయమే గెలి చిందని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కరీం నగర్ జిల్లాలో ప్రజా విచారణ చేస్తున్న సందర్భంగా రైతుల హక్కులను కాపాడేందుకు వినతిపత్రాన్ని ఇవ్వాలని వెళ్లాము. అధికారం అండతో మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎనిమిదేళ్లపాటు ఈ కేసు నడిచింది. తాజాగా న్యాయస్థానం కొట్టివేసింది. ఇది ప్రజా విజయం. రైతుల విజయం. పేద రైతు ఘోషను న్యాయస్థానం విన్నది. అధికారం ఉందని నాడు కేసులు పెట్టారు. పోలీసులను అడ్డగోలుగా వినియోగించుకున్నారు. కానీ, ఇవాళ ప్రజాస్వామ్యం ఉంది. చట్టాలను నమ్ముతూ మేం ముందుకు వెళ్తున్నాం. మాకు అధికారం ఉందని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదు. భారాస ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూడా నిలవలేదు. దానిపైనా విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందే" అని అన్నారు.

## హైదరాబాద్ అభివృద్ధికి

# కలిసికట్టుగా పనిచేయాలి

కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్: పార్టీలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే పదవులు, రాజకీయ పార్టీలు శాశ్వతం కాదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎస్పీఆర్ హిల్స్‌లో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన రిజర్వాయర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం చెబుతోందన్నారు. మెట్రో డీపీఆర్‌ను పూర్తిస్థాయిలో కేంద్రానికి పంపలేదని.. సమగ్రంగా పంపిస్తే ఆలోచిస్తుందని చెప్పారు. ప్రజలకు ఎలా మేలు చేస్తున్నామనేది నేతలు ఆలోచించాలని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు

# దౌత్య యుద్ధం

మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఈ బృందాలు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించ నున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు, పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరించడం, భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వనున్నారు. అలాగే ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం చేస్తారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును కూడా ఈ సందర్భంగా వివరించడం జరుగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక వివరణ ఇచ్చింది. ఆ ప్రతినిధుల బృందాలకు ఏడుగురు ఎంపీలు నాయకత్వం వహిస్తుండగా.. వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ కూడా ఉన్నారు. అయితే కాంగ్రెస్ పంపిన జాబితాలో అసలు థరూర్ పేరు లేకపోవడం గమనార్హం. పాక్‌ను ఎండగట్టేందుకు పంపే బృందం కోసం పేర్లు పంపాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మే 16న కాంగ్రెస్‌ను కోరగా, అదేరోజున కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నాలుగు పేర్లు పంపారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, రాజ్యసభ ఎంపీ డాక్టర్ సయ్యద్ నజీర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్, మరో నేత గౌరవ్ గొగొయ్ ఉన్నారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ జాబితాలో థరూర్ పేరు లేదు. అయితే శనివారం కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో అయితే శనివారం కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో వారి పేర్లేవీ లేవు. కానీ తిరువనం తపురం ఎంపీ శశిథరూర్‌కు మాత్రం అనూహ్యంగా చోటు- దక్కింది. ఇటీవలి పరిణామాలపై దేశం విధానాన్ని వివిధ దేశాలకు వివరించేందుకు వెళ్తున్న బృందానికి నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ప్రయోజనాలతో ముడిపడిన సందర్భాల్లో అక్కడ నా అవసరం ఉంటే.. నేను అందుబాటులో ఉంటా. జైహింద్ అని థరూర్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# కోర్టు తీర్పుతో అమెరికన్లకు హాని

### వలసలదారుల బహిష్కరణకు వ్యతిరేకంగా ధర్మాసనం తీర్పుపై తీవ్రంగా స్పందించిన ట్రంప్

**న్యూయార్క్(జనంసాక్షి):**

వలసదారుల బహిష్కరణ కేసులో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. దేశంలో అక్రమంగా ఉంటున్న వెనెజులాకు చెందిన గ్యాంగ్‌ను బహిష్కరిం చేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు సుప్రీంకోర్టు అడ్డుతగలడంపై ఆయన తీవ్రంగా స్పందించారు.ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్ వేదికగా ఒక పోస్టు పెట్టారు.'మన దేశంలోకి చట్టవిరుద్ధంగా వచ్చిన వారిని బలవంతంగా పంపడాన్ని అనుమతించమని సుప్రీం కోర్టు ఇప్పుడే తీర్పునిచ్చింది. వారిలో అనేకమంది హంతకులు, మాదకద్రవ్యాల వ్యాపారులు, నేరస్థులు ఉన్నారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో వారిని చట్టబద్ధంగా దేశం నుంచి పంపించేందుకు చాలా సంవత్సరాలు పడుతోంది. ఈలోపు వారు దేశంలో అనేక నేరాలకు పాల్పడతారు. ఇది అమెరికన్లకు హాని కలిగిస్తోంది. కోర్టు తీర్పు మరింతమంది నేరస్థులను మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించడానికి ప్రోత్సహిస్తున్నట్లే అవుతోంది. వారు ఇక్కడికి వచ్చి విధ్వంసం సృష్టిస్తారు. గత అధ్యక్షుడు జో బైడెన్ లక్షలాది మంది క్రిమినల్స్‌ను అక్రమంగా మన దేశంలోకి రావడానికి అనుమతించారు. వారిని బయటకు పంపిచేందుకు మాత్రం మనం సుదీర్ఘమైన చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలి. మన దేశాన్ని రక్షించడానికి ప్రయత్నించిన జస్టిస్ అలిటో, జస్టిస్ థామస్‌లకు కృతజ్ఞతలు. ఇది అమెరికాకు చెడ్డ, ప్రమాదకరమైన రోజు' అని ట్రంప్ పేర్కొన్నారు.1798 నాటి ఏలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను వినియోగించి అమెరికాలో ఉంటున్న వెనెజులాకు చెందిన గ్యాంగ్‌ను బహిష్కరించాలని ట్రంప్ ప్రయత్నించారు. ఈ చర్యలకు అక్కడి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. వారి బహిష్కరణను చట్టబద్ధంగా సవాలు చేయడానికి వారికి తగినంత సమయం ఇవ్వాలని సుప్రీం తీర్పునిచ్చింది. దీనిపైనే ట్రంప్ తాజాగా స్పందించారు.

# కాశ్మీర్ అంశమే పాక్ జీవనాడి

### అది లేకుంటే అక్కడ ఆర్మీ లేదు

### భారత ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్

**న్యూఢిల్లీ(జనం

# పుష్కరాలకు మూడోరోజు పెరిగిన రద్దీ

- జనసందోహంతో సరస్వతి నదికి కళ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సరస్వతి పుష్కరాలకు మూడో రోజైన శనివారం భక్తుల రద్దీ పెరిగింది.. భక్తజనసందోహంతో సరస్వతీ నది తీర ప్రాంతం కళకళ లాడింది.. కాళేశ్వరం ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి.. అనేక ఇబ్బందుల మధ్య భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించి వెను దిరుగుతున్నారు.. కాళేశ్వరం ఆర్టీసీ పాయింట్ నుండి సరస్వతి ఘాటు వరకు దూరం ఎక్కువగా ఉండడంతో కాలినడకన వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు రాకపోకలు పెరుగుతుంది. మూడో రోజైనా శనివారం సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా భక్తులు భారీగా తరలి వచ్చారు. దీనితో కాళేశ్వరం ప్రాంతం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ముందుగా భక్తులు సరస్వతి ఘాటు వద్ద గల త్రివేణి సంగమంకు చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించి గోదావరి మాతకు పసుపు కుంకుమ, చీరే, సారె, గాజులు,పూలతో వాయినం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం ఘాట్ వద్ద ఉన్న జ్ఞాన సరస్వతి మాతను దర్శించుకుని అక్కడి నుండి శ్రీ కాళేశ్వర ముక్తిశ్వర స్వామి, శు భానంద సరస్వతి అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా తరలి రావడంతో క్యూ లైన్లు కిటకిట లాడాయి. గోదావరి, ప్రాణహిత, సరస్వతితో కూడిన త్రివేణి సంగమ తీరం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తజనంతో పులకించిపోయింది. అంతర్వాహినిగా ఉన్న త్రివేణి సంగమం వద్ద భక్తులు భక్తిశద్ధలతో స్నానాలు ఆచరించి మొక్కుకున్నారు. సరస్వతీ ఏక శిల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మరి కొంతమంది నదీ తీరంలో పితృపూజలు, పిండ ప్రదానాలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సింగరేణితోపాటు పలు సంస్థలు కాళేశ్వరం బస్టాండ్ నుంచి ఘాట్ వరకూ ఉచితంగా మినీ బస్సులు నడుపుతున్నారు. పుష్కరాల సందర్భాన్ని పురస్కరించుకుని మూడో రోజు పీఠాధిపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కష్టాలు, ఇబ్బందులు తొలగిపోవడానికి ఈ పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భక్తులు పాల్గొని పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. పుష్కర ఘాట్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు హెూమం వద్దకు వెళ్లారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులు సమయానుకూలంగా లేకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. ఓవైపు ఎండ వేడిమి మరోవైపు గంటల తరబడి నిరీక్షణ చేశారు. కాళేశ్వరం లో ఆర్టీసీ పాయింట్ నుండి సరస్వతి నది వరకు దూరం ఎక్కువగా ఉండడంతో భక్తులు కాలినడకన వెళ్తూ ఇబ్బందులు పడ్డారు వేసవి తాపం భరించలేక భక్తులు నానా తంటాలు పడ్డారు.

## 'ఇందిరమ్మ' ఇండ్ల కోసం
# ఆశల పల్లకిలో నిరుపేదలు

- ఇళ్ల కేటాయింపులోనైనా న్యాయం జరిగేనా?

**ఖానాపూర్ మే 17 (జనం సాక్షి) :** నియోజకవర్గ కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలోని నిరుపేద లబ్ధిదారులు ఆకాశమే హద్దుగా ప్రభుత్వం గూడు కల్పిస్తారని ఆశతో ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పాలనలోనైనా తమకు న్యాయం చేకూరుతుందేమోనని ఆశిస్తున్నారు. గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ల పేరుతో నిరుపేద లబ్ధిదారులను పక్కనపెట్టి స్థానికులు, స్థానికేతరులు అనే భేదం లేకుండా డబ్బులు ఎర చూపిన వారికే డబల్ బెడ్ రూములు దక్కాయనే ఆరోపణలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ గ్రామ గ్రామంలో కాంగ్రెస్ బాధ్యులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు సైతం నిరుపేద లబ్ధిదారుల దరికే ఇందిరమ్మ గూడు చేరాలని ఆకాంక్షిస్తున్నట్లు ప్రభుత్వ పట్టుదలను ఆయన నిస్సంకోచంగా స్పష్టం చేస్తూనే వస్తున్నారు. ఇప్పటివరకు బాగానే ఉంది కానీ కేటాయింపుల సమయంలో స్థానిక నాయకులు, అధికారులు ప్రలోభాలకు తావిస్తూ పథకాన్ని పక్కదారి పట్టిస్తారేమోనని పలువురు నిరుపేద కుటుంబీకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజా ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేకూరుతుందేమోనని ఆశపడుతున్నారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం కేటాయించిన డబల్ బెడ్ రూములలో పదుల సంఖ్యలో స్థానికంగా ఉండకపోవడం, తాళాలకే పరిమితం కావడం శోచనీయం. అట్టి డబల్ బెడ్ రూమ్ కేటాయింపుల వలె ఇందిరమ్మ ఇండ్లు కూడా కేటాయిస్తారేమోనని స్థానికంగా రచ్చబండ చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ బాధ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పై ప్రత్యేక దృష్టి సారించవలసిన అవసరాన్ని వారు గుర్తెరగాలి అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పథకాలు బాగానే ఉన్నాయి కానీ గత పాలకుల లాగా ప్రలోభాలకు తావిస్తూ పక్కదారి పట్టించకూడదని నిరుపేద లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

# అమ్మను మించిన దైవం లేదు

- మాతృదేవోభవ అనే మాటకు నిలువెత్తు నిదర్శనం అమ్మ
- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమ్మను మించిన దైవం లేదని, మాతృదేవోభవ అనే మాటకు నిలువెత్తు నిదర్శనం అమ్మ అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏవీఓపీఏ మహిళ విభాగ్ ఆధ్వర్యంలో పద్మరాగ గ్రూప్ ఆఫ్ హెూటల్స్ కేపీహెచ్‌బీలో టీఎస్ ఏవీఓపీఏ మహిళ విభాగం అధ్యక్షురాలు శిల్పా అధ్వర్యంలో జరిగిన వేద ఆశీర్వాదం మరియు పాద పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ఆటల్లో గెలుపొందిన మహిళ సోదరీమణులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవీఓపీఏ రాష్ట్ర కార్యదర్శి మలిపెద్ది శంకర్, ఆర్గనైజర్ కార్యదర్శి కట్ట రవి కుమార్ గుప్త, ఐవీఎఫ్ బాచుపల్లి ప్రెసిడెంట్ నవీన్, ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్, పృథ్వీ రాఘువంశీ, పువ్వాడ హారిక ప్రోగ్రాం చైర్మెన్ టీఎస్ ఏవీఓపీఏ ప్రధాన కార్యదర్శి ప్రియాంక, కోశాధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# 29 నుంచి దేశవ్యాప్తంగా వ్యవసాయ సంకల్ప్ అభియాన్

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన కృషి సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని సెంట్రల్ డ్రైలాండ్ వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా) డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 12 వరకు దేశవ్యాప్తంగా 700కి పైగా జిల్లాల్లో కొనసాగుతుందని కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగిన సమావేశంలో ప్రకటించారని ఆయన తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, మంత్రిత్వ శాఖ అధికారులు, ఉద్యోగులు, స్థానిక కార్మిక సంఘాలతో బృందాలుగా ఏర్పాటు చేసి ప్రతిరోజు వివిధ గ్రామాలను సందర్శిస్తారని ఆయన తెలిపారు. రైతులతో నేరుగా సంభాషించి వ్యవసాయం గురించి అవగాహన కల్పించి, తగిన సలహాలను ఇస్తారని అన్నారు. ప్రయోగశాల నుంచి భూమికి అనే మంత్రాన్ని సహకారం చేసుకునేందుకు జరుగుతున్న ఈ అభియాన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆధునిక, ఆదర్శ వ్యవసాయంతో పాటు ఒక దేశం, ఒక వ్యవసాయం, ఒక బృందం అనే నినాదంతో దేశవ్యాప్తంగా 731 ఖుషి విజ్ఞాన కేంద్రాలు 100కు పైగా ఐసీఏఆర్ కేంద్రాలకు చెందిన అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని రైతుల వద్దకు నేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో అధికారులు వివిధ అంశాలపై చర్చించి సలహాలు ఇస్తారని, రైతుల సందేహాలను పూర్తి చేస్తారని నివృత్తి చేస్తారని పేర్కొన్నారు.

## జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం

- ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఆస్పత్రి సీజ్

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** అనుమతులకు విరుద్ధంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిర్మించిన డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రి భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు ముషీరాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ సర్కిల్ ఏసీపీ దేవేందర్ మాట్లాడుతూ.. ఆస్పత్రి భవనానికి జీహెచ్ఎంసీ సెల్లార్ ప్లస్ నాలుగంతస్తుల అనుమతి ఇవ్వడం జరిగిందని చెప్పారు. అదనంగా సెల్లార్‌తో పాటు మరో రెండు అదనపు అంతస్తులు అక్రమంగా నిర్మించారని తెలిపారు. స్థానికులు నిర్మాణంపై కోర్టుకు వెళ్లారని, కోర్టు ఆదేశాల మేరకు ఆ భవనంలో ఐదారంతస్తులు, సెల్లార్ సీజ్ చేశామని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- రూ.6.5 లక్షలకు టోకరా వేసిన కిలాడి లేడీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ హైకోర్టులో రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.6.5 లక్షలకు టోకరా వేసింది ఆ కిలాడి లేడీ. హైకోర్టులో తాను న్యాయవాదినని.. జడ్జీలతో తనకు పరిచయాలు ఉన్నాయని.. రూ.15 లక్షలు ఇస్తే రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికింది. అడ్వాన్స్‌గా రూ.6.5 లక్షలు తీసుకుని ఉడాయించింది ఆ మాయలాడి. ఎస్సై శివ శంకర్ కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీలో నివాసం ఉండే ఎస్.జీవన్ విజేందర్(35) 2022లో ఉద్యోగాన్వేషణలో ఉన్నప్పుడు టైలరింగ్ షాపు నిర్వహించే తన అత్త ఉర్మిలాదేవి ద్వారా అంబర్‌పేటకు చెందిన బి. ప్రసన్నరెడ్డి అనే మహిళ పరిచయమైంది. తనకు తాను హైకోర్టు అడ్వకేట్ అని గొప్పలు చెప్పుకుని పరిచయం చేసుకుంది. తనకు చాలా మంది హైకోర్టు న్యాయమూర్తులతో పరిచయాలు ఉన్నాయని బడాయి మాటలు చెప్పింది. రూ.15 లక్షలు ఇస్తే తెలంగాణ హైకోర్టులో రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మి 2023 ఆగస్టు నెలలో రూ.6.5 లక్షలు ముట్టచెప్పారు. రోజులు గడుస్తున్నా ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో గట్టిగా నిలదీశారు. ఉద్యోగం ఇంకా ప్రాసెస్‌లో ఉందని చెప్పింది. వారిని నమ్మించి మిగతా రూ.8.5 లక్షలు వసూలు చేయాలని పథకం వేసింది. ఈ క్రమంలో శైలజారెడ్డి అనే మహిళను హైకోర్టు న్యాయమూర్తి అని చెప్పి పరిచయం చేసింది. అతని అసిస్టెంట్ ఫిరోజ్ ఖాన్ అని చెప్పి వారిద్దర్నీ పరిచయం చేసింది. త్వరలోనే ఉద్యోగం వస్తుందని చెప్పి మరో ఆరు నెలల సమయం తీసుకున్నారు. ఈ క్రమంలో రవి అనే వ్యక్తి ఫోన్ చేసి తాను ప్రసన్న రెడ్డి చేతిలో తాను మోసపోయనని.. తాను కూడా ఉద్యోగం కోసం ఆమెకు రూ.4.5 లక్షలు ఇచ్చినట్లు ఆ వ్యక్తి తెలిపాడు. ఆ మాయలేడి ప్రసన్నరెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించిగా.. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో అంబర్‌పేటలోని ప్రసన్నరెడ్డి నివాసానికి వెళ్లగా అక్కడ ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు శు క్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏడుగురు కాశీ పండితులచే నవరత్న హారతులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వారణాసి కాశీలోని గంగా హారతిలు ఇచ్చే ఏడుగురు కాశీ పండితులచే శనివారం కాళేశ్వరం సరస్వతి నవరత్న హారతుల కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 45 నిమిషాలు జరిగిన 9 సరస్వతి నవరత్న హారతులు వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు జయ హారతులు ఇవే అంటూ భక్తి పారవస్యంతో మైమరచి పోయారు. 'హర హర మహాదేవ శంభో శంకర' ఓమ్ నమో శివయా, అంటూ భక్తి పారవశ్యంతో మైమరచిపోయారు. సరస్వతి నవరత్నమాల స్తోత్రంతో తొమ్మిది హారతుల్లో 'ఓంకార హారతి' సర్వ దోష నివారిణి, 'నాగ హారతి' సర్పదోషాన్ని పోగొట్టి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది, 'పంచ హారతి' దీర్ఘాయుష్షుకు, 'సూర్య హారతి' రోగాలను మాపి ఆరోగ్యాన్ని ఇస్తుంది, 'చంద్ర హారతి' పాడి పంటలను, మన:శాంతినిస్తుంది, 'నంది హారతి' ధర్మ బుద్ధిని, కీర్తిని శక్తిని, విద్యా వినయాలను ఇస్తుంది, 'సింహ హారతి' నాయకత్వాన్ని, ధైర్యాన్ని, సాహసం, విజయాన్ని ఇస్తుంది, 'కుంభా హారతి' సంపదను, సంతృష్టిని ఇచ్చి కోటి సుభములను అందిస్తుంది, 'నక్షత్ర హారతి' నిర్మలమైన మనస్సును, సౌందర్యాన్ని, కీర్తిని అందిస్తుంది. అందుకే ఈ నవరత్న హారతుల కార్యక్రమం నిర్వహించారు.

# సంస్థాగత ఎన్నికల్లో ఆధిపత్యం కోసం ఆరాటం

- పోటా పోటీగా ఒకే గ్రామంలో రెండు కమిటీలు
- పార్టీ పరువును బజారుకీడుస్తున్న వైనం
- ఎమ్మెల్యే గండ్ర స్పందించకపోతే మండలంలో పార్టీ రెండుగా చీలిపోయే ప్రమాదం

**చిట్యాల/ మొగుళ్లపల్లి (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కాంగ్రెస్ లో నాయకుల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఏఐసీసీ, టీపీసీసీ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలకు సిద్ధమైంది. ఈ క్రమంలో భూపాలపల్లి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు మండలాల వారిగా, గ్రామాల వారిగా అధిష్టానం ఇన్చార్జీలను నియమించింది. కాగా ఆయా మండలాలకు, గ్రామాలకు నియమించిన ఇన్చార్జీలు గ్రామ కమిటీలను ఎంపిక చేసిన అనంతరం మండల కమిటీ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పార్టీని భూపాలపల్లి నియోజకవర్గంలో సంస్థగతంగా బలోపేతం చేసేందుకు పార్టీలో అనుభవం కలిగిన నేతలను గుర్తించాల్సిందిగా పార్టీ నేతలను ఆదేశిస్తే..ఇదే అదునుగా భావించిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. ఈ క్రమంలో మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, రాష్ట్ర నాయకుడు కటంగూరి రాంనర్సింహారెడ్డిల నేతృత్వంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఇదే క్రమంలో శనివారం మధ్యాహ్నం చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్ నేతృత్వంలో ఇదే గ్రామంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకోవడంతో మండలంలోని కాంగ్రెస్ పార్టీలో ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. ఒక ప్రక్క అభివృద్ధి ఎజెండాతో..మరోపక్క పార్టీని బలోపేతం చేయడంలో రోజుకు 18 గంటల పాటు నిర్విరామంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఏలుబడిలో పార్టీలో విభేదాలు ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దృష్టి సారించి పార్టీ క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకొని పార్టీకి నష్టం కలగకుండా చూసుకోవాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

# కాళేశ్వరంలో భారీగా ట్రాఫిక్ జామ్

- 8గంటల పాటు ఇబ్బందులు పడిన భక్తులు..
- ఎండవేడిమి, ఉక్కపోతతో మహిళలు, వృద్ధుల పాట్లు..
- 10 కిలోమీటర్లు ప్రయాణికుల కాలినడక..
- ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు కలెక్టర్, ఎస్పీ తిప్పలు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరం వచ్చే భక్తులు శనివారం ట్రాఫిక్ లో ఇరుక్కొని నానా ఇబ్బందులు పడ్డారు.. కాళేశ్వరం నుండి మహాదేవపూర్ ప్రధాన రహదారిపై 10 కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.. దీంతో సుమారు 8గంటలపాటు ప్రయాణికులు భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.. కొంతమంది బస్సులో ఒక్క పోత భరించలేక, మండుటెండలో కాలినడకన సరస్వతి నది వద్దకు వెళ్లారు.. త్రాగు నీరు దొరక్క అల్లాడిపోయారు.. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరేలు ద్విచక్ర వాహనం పై వెళ్లి ట్రాఫిక్ క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతి నది పుష్కరాలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. కాగా శనివారం ఉదయం నుండే కాళేశ్వరం కు భక్తుల రాక పెరిగింది. వివిధ ప్రాంతాల నుండి భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకున్న భక్తులు కాళేశ్వరం వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కాళేశ్వరం వెళ్లే బస్సులను ఇక్కడ సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సమయానుకూలంగా కాకుండా ఎప్పుడో ఒక బస్సు వేస్తుండడంతో భక్తులు ఎగబడుతూ వచ్చే బస్సులకు ఎదురెళ్లి ఎక్కారు. అయినా సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడడంతో అనేక మంది భక్తులు కిక్కిరిసిన బస్సుల్లో నిలబడి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

### 10కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్..

భూపాలపల్లి వైపు నుండి కాళేశ్వరం వస్తున్న క్రమంలో మహాదేవపూర్ శివారు నుండి ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు 10కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు గంటల తరబడి కదలక పోవడంతో ఉక్కపోతతో నరకయాతన అనుభవించారు. కొంతమంది ప్రయాణీకులు ఉక్కపోత భరించలేక గంటల తరబడి నిరిక్షించలేక కాలినడకన కాళేశ్వరం చేరుకున్నారు. మండుటెండలో కాలినడకన వచ్చినప్పటికి మార్గమధ్యంలో ఎలాంటి త్రాగునీటి సౌకర్యం లేకపోవడంతో, గొంతెండుకపోతున్నా, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గమ్యస్థానానికి చేరుకున్నారు.

### ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు కలెక్టర్, ఎస్పీ ప్రయత్నం..

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో మూడో రోజున కాళేశ్వరానికి భక్తుల రద్దీ తీవ్రంగా పెరిగింది. వీకెండ్స్ కావడంతో వాహనాల్లో భారీగా భక్తులు కాళేశ్వరం చేరుకున్నారు. దీంతో మహదేవపూర్, కాళేశ్వరం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు బైకుపై తిరుగుతూ వాహనాలను పంపించే పనిలో నిమగ్నం అయ్యారు. శనివారం వేకువ జాము నుండే పెద్ద సంఖ్యలో వాహనాలు కాళేశ్వరం చేరుకున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈదురు గాలులు రావడంతో పుష్కర ఘాట్ తో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతులను పునరుద్ధరించే పనిలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు నిమగ్నం అయ్యారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ అధికారులు తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరా అందించారు. అర్ధరాత్రి వచ్చిన ఈదురు గాలుల కారణంగా టెంట్లు నేలకూలిపోగా వాటిని సవరించే పనులను అర్ధరాత్రి నుండి ప్రత్యక్ష్యంగా కలెక్టర్, ఎస్పీలు దగ్గరుండి చేయించారు. ఈ క్రమంలోనే కాళేశ్వరం రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయన్న సమాచారం అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరు తమ కాన్వాయిలను పక్కన పెట్టి బైకుపై తిరుగుతూ ట్రాఫిక్ సమస్యలను తొలగించే ప్రయత్నం చేశారు. శని, ఆది వారాల్లో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంటుందని అంచనా వేసి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 మే 2025
తెలంగాణ

# మధ్యలో ట్రంప్ ఎవరు?

### భారత ప్రజలు, విపక్షాల మండిపాటు

కశ్మీర్ సమస్య పరిష్కారానికి ట్రంప్ ను ఎవరు ఆహ్వానించారు? ఎవరూ పిలవనిదే" భారత్, పాకిస్థాన్ దేశాలతో కలిసి పనిచే స్తామని" అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏలా అన గలిగాడు.? ఇరు దేశాల మధ్య సమస్యలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించు కోవాలని ఒప్పందంలో ఉంది. ప్రస్తుతం ఇరు దేశాలు యుద్ధంలో ఉండగా "కాల్పుల విరమణకు సయోధ్య కుదిర్చామని" శనివారం ట్రంప్ ఏలా చెప్పగలిగాడు? దానికి తగ్గట్టు గానే అమెరికా తరువాత పాకిస్తాన్, వెనువెంటనే భారత్ యుద్ధానికి విరామం ప్రకటించారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు "కశ్మీర్ సమస్య పరిష్కారానికి ఇరు దేశాలతో కలిసి పనిచేస్తామని" ట్రంప్ అంటున్నారు.

ఈ విషయాన్ని తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' ద్వారా ఆయనే స్వయంగా వెల్లడించారు. 'వేయి సంవత్స రాల తర్వాత కశ్మీర్ సమస్యకు ఒక పరి ష్కారం లభిస్తుందేమో చూసేందుకు మీ ఇద్దరితో కలిసి పనిచేస్తాను.ఈ గొప్ప పని చేసి నందుకు భారత్, పాక్ నాయకత్వాలకు దేవుడి ఆశీస్సులు ఉండాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే లక్షలమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయి ఉండేవారని ఈ "మానవతా వాది" అంటున్నారు. ఇరు దేశాల నేతలు తెలివైన నిర్ణయం తీసుకున్నారని కూడా ట్రంప్ ప్రశంసించారు అంటే ఇరు దేశాలు తమ జుట్టును ట్రంప్ కు స్వచ్ఛందంగా అప్పగించారనే తెలుస్తోంది. ట్రంప్ ప్రకటనను ఇటు భారత్ కానీ,అటు పాకిస్తాన్ కానీ ఖండించి లేదు. పాకిస్తాన్ కు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే నేషనల్ కమాండ్ అథారిటీతో సమావేశానికి ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సిద్ధమైన నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. అయితే, పాక్ రక్షణ మంత్రి భావాజా ఆసిఫ్ మాత్రం ఇలాంటి సమా వేశమేదీ జరగలేదని తేల్చి చెప్పారు. భారత్, పాకిస్థాన్ దేశాలు బలమైన, అచంచల నాయకత్వ పటిమకు తాను గర్విస్తున్నానని, ఎంతోమంది మరణానికి, విధ్వంసానికి దారితీసే ప్రస్తుత దూకుడుకు పుల్స్టాప్ పెట్టాల్సిన సమయం ఇదే నని ఇరు దేశాలు గ్రహించాయని అన్నారు. 'మీ ధైర్యవంతమైన చర్యలతో మీ వారసత్వం ఎంతగానో పెరిగింది. చారిత్రక, వీరోచిత నిర్ణయానికి "అమెరికా సాయం" చేసినందుకు గర్వంగా ఉంది' అని ట్రంప్ వి/అంటున్నారు. పైగా కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తానన్న ట్రంప్ ప్రకటనను పాకిస్థాన్ స్వాగతించింది.అంతే కాదు దక్షిణాసియా, దాని ఆవల శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న దీర్ఘకాల సమస్య అయిన జమ్ముకశ్మీర్ వివాద పరిష్కారానికి ట్రంప్ తన సంసిద్ధతను వ్యక్తం చేయడాన్ని తాము అభినందిస్తున్నట్టు గా కూడా పేర్కొంది. జమ్ముకశ్మీర్ వివాదానికి న్యాయమైన, శాశ్వత పరిష్కారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా ఉండాలని, కశ్మీరీ ప్రజల ప్రాథమిక హక్కులు, వారి స్వయం నిర్ణయాధి కార హక్కును కూడా సాధించేలా చూడాలని పాక్ నొక్కి చెప్పింది. ప్రపంచ శాంతికి ట్రంప్ మార్గదర్శక నాయకత్వం, నిబద్ధత, దక్షిణాసియాకు శాశ్వత శాంతిని తీసుకురా వడంలో గొప్ప పాత్ర పోషించాలనే ట్రంప్ అత్యంత విలువైన ప్రతిపాదనకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్టు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. 'ద శాబ్దాలుగా పాక్, అమెరికా దేశాలు పరస్పర ప్రయోజనాలను రక్షించుకునేందుకు, ప్రపంచంలోని కీలక ప్రాంతాల్లో శాంతి, భద్రత కోసం భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ధరించగల, పాకిస్థాన్-యూఎస్ సంబంధాలను బలోపేతం చేయగల గొప్ప భాగస్వామి ని పాక్ కనుగొంది. వాణిజ్యం, పెట్టుబడిలో మాత్రమే కాకుండా సహకారాని కి సంబంధించి అన్ని రంగాల్లో కూడా' అని షెహబాజ్ ట్వీట్ చేశారు.

**మోదీ సర్కారుపై ప్రతిపక్షాల ఘాటైన విమర్శలు:**

భారత్ ఈ విషయం లో ట్రంప్ పోకడలను, పాకిస్తాన్ దాసోహ ప్రకటనపై ఇప్పటి వరకు ఏలాంటి ఖండనను మోదీ విడుదల చేయలేదు. ఇలా భారత్ విదేశాంగ విధానంలో ట్రంప్ జోక్యాన్ని ఎదిరించక పోతే మన దేశ సార్వభౌమాధికారాన్ని అమెరి కా చేతికి అప్పగించినట్లు కాదా? అని భారత ప్రజలు, విపక్షాలు మోదీని నిలదీస్తున్నాయి. భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం చేస్తామంటూ అమెరికా ప్రకటించడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికార బీజేపీని నిలదీశాయి. పాకిస్తాన్ తో యుద్ధంలో గెలిచే అవకాశం పరిస్థితి లో హఠాత్తుగా ఎవరితో నూ సం ప్రదించకుండా పాకిస్తాన్ తో యుద్ధానికి స్వస్తి పలికి కాల్పుల విరమణ ప్రకటించడానికి కారణమేమిటో ఈ దేశ ప్రజలకు చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. ఇరు దేశాల సమస్యలపై ద్వైపాక్షికంగానే చర్చలు జరపా లంటూ గతంలో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పం దాన్ని మోదీ ప్రభుత్వం ఎందుకు వదిలేసింది? మూడో దేశం జోక్యానికి ఎందుకు తలుపులు బార్లా తెరిచింది? అని ప్రశ్నించాయి.

**వెంటనే పార్లమెంట్ను సమావేశ పర్చాలి**

పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో చర్చలు జరిపేం దుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయా లని, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తు న్నట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కాల్పుల విరమణపై వాషిం గ్టన్ తొలి ప్రకటన చేయడం, తర్వాతే భారత్, పాకిస్థాన్లు స్పందించడం తదితర విషయా లను కూలంకషంగా చర్చించాలన్నారు. కాగా, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు మల్లిఖా ర్జున ఖర్గే (రాజ్యసభ), రాహుల్ గాంధీ (లో కసభ) ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాశారు. భారత్, పాక్ మధ్య చర్చలకు తటస్థ వేదిక అంశాన్ని యూఎస్ విదేశాంగ కార్యదర్శి ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ గుర్తు చేస్తూ ఆయన చేసిన ప్రకటన పలు ప్రశ్నలు, అను మానాలను రేకెత్తిస్తున్నదని పేర్కొంది. 'అంటే

**ఇది భారత దేశానికే అవమానం:**

మోదీ చర్య దేశానికే పెద్ద అవమానమని శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మీకే కనుక ధైర్యం ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, దానికి ప్రధాని మోదీ కచ్చితంగా హాజరు కావాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రంప్ జోక్యం కారణంగా యుద్ధాన్ని ఆపేసినట్టు ప్రభుత్వం చెబుతున్నదని, అలాంటప్పుడు ఎన్నాళ్ల నుంచో జరుగుతున్న ఇజ్రాయెల్-గాజా యుద్ధాన్ని ట్రంప్ ఎందుకు ఆపలేదని ఆయన ప్రశ్నిం చారు. ట్రంప్ జోక్యం మన దేశ సార్వభౌమత్వం పై దాడేనని, ఇది మన ప్రభుత్వ బలహీనతను చూపుతున్నదని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య వివాదంలో మూడో దేశం జోక్యం సహించరానిదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కె ఝా అన్నారు. ప్రాంతీయ వివాదంలో బాహ్యశక్తుల జోక్యాన్ని ఎంతమాత్రం సహించ కూడదని ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జీ దేవరాజన్ పేర్కొన్నారు.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఇంటర్నెట్ యుగంలో సత్తా చాటుతున్న పుస్తకం

చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ మంచి పుస్తకాన్ని కొనుక్కో అన్నాడు కందుకూరి వీరేశలింగంనేను నా గ్రంథాలయంలోకి వెళ్లానంటే ప్రపంచ చరిత్ర అంతా నా కళ్ళ ముందు కనిపిస్తుంది అన్నాడు అలెగ్జాండర్ స్మిత్ ఇటువంటి సూక్తులు ఎన్నో పుస్తకాలు ప్రాముఖ్యతను వివరిస్తున్నాయి. తరతరాల విజ్ఞాన సంపదను అందించేవే గ్రంథాలయాలు. అటువంటి గ్రంథాలు గల ప్రదేశాన్ని గ్రంథాలయం అంటారు. ఇందులో ప్రజల ఉపయోగం కోసం జ్ఞాన సమాచార సామాగ్రిని క్రోడీకరించడమే గ్రంథాల యం ప్రత్యేకత. ప్రజలను విజ్ఞానవంతులని చేసి చైతన్య వంతులను చేసేందుకు గ్రంథాలయ ఉద్యమం ఉపయోగ పడింది. గ్రంథాలయ ఉద్యమం పితామహునుగా పేరొందిన అయ్యంకి వెంకటరమణయ్య ఉద్యమాన్ని ప్రారంభించారు.

గ్రంథాలయ ఉద్యమం ప్రజలను చైతన్యవంతులనుల్ని చేయ డం ద్వారా భారత స్వాతంత్ర, తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమాలలో భాగం వహిం చింది. ఆధునిక పద్ధతుల్లో ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటైన తొలి గ్రంథాలయం విశాఖపట్నంలో ఏర్పాటు చేశారని పరిశోధ కులు భావిస్తున్నా రు. 1886 లో విశాఖపట్నంలో మంతిన సూర్యనారాయణ మూర్తి ఈ పౌర గ్రంథాలయాన్ని నెలకొల్పారు. ఆంగ్లభాష సంస్కృతులు ప్రభావం ఇతర దేశాల్లోని గ్రంథాలయాల గురించిన సమాచారం ప్రజలకు లేకపోయినా స్వంత ప్రేరణ పై ఆయన గ్రంథాలయాల్ని ప్రారంభించారు. 1905 నాటికి 20 గ్రంథాలయాలు స్థాపించబడినట్లు లెక్కకు వచ్చాయి. పలు ఉద్యమాలు సాహిత్య సృష్టి వంటి కారణాలతో 1913 నాటికి వీటి సంఖ్య 123 కి పెరిగింది. ఆపైన గ్రంథాలయోద్యమం ప్రారంభమై ఇతర ఉద్యమాలకు చేయూతనివ్వడమే కాక పలు రంగాల్లో తెలుగువారిని చైతన్యానికి చేయూత నిచ్చింది.

1911లో రామమోహన గ్రంథాలయాన్ని అయ్యంకి వెంకటరమణయ్య స్థాపించారు. ఆయన 1914లో విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ గ్రంథ బాండా గార ప్రతినిధులతో గ్రంథాలయ మహాసభను నిర్వహించారు. 1915లో భారత దేశంలోనే తొలి గ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం తరఫున ఇండియన్ లైబ్రరీ జర్నలను ప్రారంభించారు. ఊరూర గ్రంథాల యాలు ఏర్పాటు చేయడం ప్రజలకు అక్షర జ్ఞానం కల్పించి కల్పించడం వంటివి ఇందులో భాగం. తప్పుడు గ్రంథాలయాలు సేకరణను నిర్మిస్తాయి, మంచి గ్రంథాలయాలు సేవలను నిర్మిస్తాయి, గొప్ప గ్రంథాల యాలు సమాజాలను నిర్మిస్తాయి. గ్రంథాలయాలు పిల్లలకు ప్రపంచం గురించి ప్రశ్నలు అడగడానికి మరియు సమాధానాలు కనుగొండానికి సహాయపడ తాయి. ఒకసారి ఒక చిన్నారి గ్రంథాలయాన్ని ఉపయోగించడం నేర్చు కుంటే అభ్యాసం కోసం కు తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. బ్రిటిష్ దాస్యశృంకలాల నుంచి విముక్తి కలిగించి కలిగించి దేశానికి స్వాతంత్రం సిద్ధించేందుకు చైతన్యం రగిలించిన గ్రంథాలయ ఉద్యమం. స్వాతంత్ర ఉద్యమ సమయంలో వట్టికోట ఆల్వార్ స్వామి లాంటి ఎందరో మహానుభావులు గ్రంథాలయ స్థాపన కోసం ఉద్యమించారు.

**గుండ్రాంపల్లి గ్రంథాలయం**

ఈ స్ఫూర్తి తో అనేక గ్రంథాలయాల స్థాపన జరిగింది. అందులో భాగంగా విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా గూండ్రా ంపల్లి లోని ఉన్న గుండ్రాంపల్లి గ్రామంలో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య చేతుల మీదుగా 14/04 2006వ సంవత్సరంలో ప్రారంభోత్స వం జరిగింది. 24 వేల పైగా పుస్తకాలను సేకరించిన ఈ గ్రంథాలయం 24 మంది యువకులు కమిటీగా ఏర్పడి గ్రంథాలయాన్ని ముందుకు తీసుకెళు న్నారు. గ్రంథాలయం లో పుస్తకా లతో పాటు నాలుగు తెలుగు, ఒక ఇంగ్లీషు పత్రికను, 25 వార, పక్ష, మాస, త్రై మాసిక పత్రికలు అందుబాటు లో ఉన్నాయి. ఈ గ్రంథాలయం ద్వారా విజ్ఞానాన్ని అర్జించి చాలామంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొంది తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. కేవలం యువతీ యువకులకే కాకుండా పిల్లలకు వేసవి సెలవుల్లో వారి సృజనాత్మకతను పెంచే విధంగా చిన్నారులకు చిత్రలేఖనం, పెయింటింగ్, ఇండోర్ గేమ్స్ లలో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఈ గ్రంథాలయ సేవలను ఉపయోగించుకొని 25 మంది పైగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అదేవిధంగా పలువురు విద్యార్థులు ఉన్నత విద్య ను అభ్యాస నం చేస్తున్నారు. ఈ గ్రంథాలయ స్ఫూర్తితో ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, కడప జిల్లాలలో గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. ఒక రంకంగా మలిదశ గ్రంథాలయోద్యమం మొదలైందని భావించవచ్చు ప్రతి పౌర్ణమికి గ్రంథాలయానికి కావలసిన పుస్తకాలను దాతల వద్ద నుండి సేకరించడం ఈ గ్రంథాలయం ప్రత్యేకత. ఇట్టి గ్రంథాలయానికి వివిధ పత్రిక యాజమాన్యాలు కూడా తమ పత్రికలను ఉచితంగా పంపడం విశేషం.

**గుండ్రాంపల్లి చరిత్ర**

త్రేతా యుగంలో శ్రీరాముడు నడచిన ప్రదేశాలంటూ యావత్ భారతదేశం మంతటా అనేక ప్రాంతాలు స్థల ప్రాశస్త్యం పొందాయి. అలాగే శ్రీరాముడు స్వయంగా సంచరించిన ప్రదేశాల్లో గుండ్రాంపల్లి గుట్ట కూడా ఒకటి, రామాయణ, మహాభారత అమర్త్య భూమిగా బ్రహ్మాండ పురాణంలో కొనియాడబడింది రాంపల్లిగా పిలవబడే ఊరు నడిగడ్డ గుండ్రాంపల్లి. "గుం" అంటే సంస్కృతంలో నేల "రామ్" అంటే శ్రీరాములు పల్లి అంటే చిన్న గ్రామం శ్రీరాముడు నడిచిన నేల కనుక గుండ్రాంపల్లి అని నేటి పిలవబడుతుంది. వెట్టి విధానాన్ని ధ్వంసం చేసి, ప్రజలను విముక్తులుగా చేసి, తరతరాలకు మంచిని అందించే ప్రాణ త్యాగాలు చేసిన, త్యాగాల చరిత్ర గుండ్రాంపల్లి చరిత్ర. రాష్ట్రంలో నైజామును ఎదిరించి నెత్తుటితో తడిసిన త్యాగాల నేలే ఈ రాంపల్లి.

సంఘ సంస్కరణలకు పునాది అయ్యింది గుండ్రాంపల్లి, పోరాడే నేతలను గుండె దాచింది గుండ్రాంపల్లి, సాయిధ పోరాటంలో గన్నులు పట్టింది గుండ్రాంపల్లి, నెత్తురులో ఊరు ఎర్ర బారింది గుండ్రాంపల్లి, అమరుల వీరులందరికీ త్యాగాలకు గుర్తుగా మిగిలిందే గ్రంథాలయాలను స్ఫూర్తినిచ్చింది గుండ్రాంపల్లి, విజ్ఞాన బాండాగరాం అయ్యింది గుండ్రాంపల్లి, యువతకు ఆదర్శంగా నిలిచింది గుండ్రాంపల్లి.

గుండ్రాంపల్లి గ్రంథాలయం 20 వసంతం లోకి అడిగిడిన సందర్భంగా గ్రంథాలయ ఆవశ్యకతను సమాజానికి తెలిపే ఉద్దేశంతో, చదివే అలవాటును ప్రోత్సహించాలనే సదుద్దేశం తో దాతల సహకారం తో గ్రంథాలయ భవనం పై పుస్తకాలు, గ్రంథాలయ వైతాళికులు వట్టికోట ఆళ్వార్ స్వామి, గ్రంథాలయ శాస్త్ర పితామహులు ఎస్ ఆర్ రంగానాథన్ ల ఫోటోలు గ్రంథాలయ గోడల పై వేయించడం జరిగింది. పాఠకులను ఆకర్షించడం కోసం పుస్తకం తో కూడిన సెల్ఫి పాయింట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామం తో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ గ్రంథాలయ సందర్శన కోసం రావడం పుస్తకంతో సెల్ఫి తీసుకోవడం విశేషంగా చెప్పుకోవచ్చు.

డాక్టర్ మందడి భరత్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్, 9052116339

# ఏది సత్యం? ఏదసత్యం!?

'జంగ్ ఔర్ మొహబ్బత్ మే సబ్ జాయజ్ హెూతా హై' అనేది ఒక హిందీ సామెత. అంటే దీనర్థం యుద్ధం, ప్రేమలో ప్రతీది సమంజసమే. దీన్ని నరనరాన ఒంటబట్టించుకున్న ఇండియా, పాకిస్తాన్ కు చెందిన మీడియా చానళ్లు.. యుద్ధ సమయంలో ఇష్టానుసారంగా వ్యవహరించాయి. సమాజం పట్ల తమకు సైతం ఒక నైతిక బాధ్యత ఉంటుందని మరిచి.. ఫేక్ న్యూస్ ను ప్రసారం చేశాయి. సోషల్ మీడియాలోనూ జోరుగా అసత్య ప్రచారం వైరల్ అయింది. దీంతో ప్రజల్లో భయాందోళనలు, మానసిక ఒత్తిడి రెకెత్తింది. అయితే ఇండియాలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్, ఆల్ట్ న్యూస్, పాకిస్తాన్ లో మీడియా మ్యాటర్స్ ఫర్ డెమోక్రసీ వంటి సంస్థలు ఫ్యాక్ట్ చెక్ చేసి అనేక అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తెచ్చాయి. ఆ తర్వాత కొన్ని చానళ్లు క్షమాపణలు కోరినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు దేశాల మీడియా చానళ్లపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత తగ్గిపోయింది. మరోవైపు ఆయా దేశాల ప్రజలకు మీడియా వ్యవహరిస్తున్న తీరు తెలిసొచ్చింది.

భారత్, పాకిస్తాన్ కు చెందిన న్యూస్ చానళ్లు, సోషల్ మీడియా అకౌంట్లు యుద్ధ సమయంలో చేసిన అనేక క్లెయిమ్స్ ఫేక్ అని ఆ తర్వాత నిర్ధారించబడ్డాయి.

తప్పుడు, అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తేవడానికి ఫ్యాక్ట్ చెకింగ్ తప్పనిసరిగా మారింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైందని, భారత పైలట్ శివానీ సింగ్‌ను పాకిస్తాన్ అదుపులోకి తీసుకున్నదని, ఇలాంటి 60కి పైగా జరిగిన అసత్య క్లెయిమ్ లను పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించి వాస్తవాలను ప్రజల ముందుంచింది. పాకిస్తానీ జర్నలిస్టులు పాత ఘటనలను సంబంధించిన చిత్రాలను షేర్ చేస్తున్నట్లు ఆల్ట్ న్యూస్ సహ-స్థాపకుడు ప్రతీక్ సిన్హా గుర్తించి ప్రజల ముందుకు తెచ్చారు. పాకిస్తాన్‌లోని మీడియా మ్యాటర్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అక్కడి స్థానిక మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని గుర్తించి రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా ఫ్యాక్ట్ చెక్ చేసి వాస్తవాలను ప్రజల ముందుకు తెచ్చింది.

ఇండియాకు చెందిన కొన్ని న్యూస్ చానల్స్ లైవ్ రిపోర్టింగ్ చేస్తున్నట్లు నటించాయి. ఫలానా చోటి నుంచి సైనికులు బయలుదేరారని, ఎయిర్ క్రాఫ్ట్ లు బయలుదేరాయని చెప్పాయి. దీని ద్వారా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు భారత్‌లో 70% విద్యుత్ గ్రిడ్ సైబర్ దాడి వల్ల కుప్పకూలిందని, పాకిస్తాన్ మిస్సైల్ దాడులు చేసిందని వంటి కొన్ని తప్పుడు క్లెయిమ్ లు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. అసత్య సమాచారం వల్ల ప్రజల్లో ఆందోళన, భయం, ఒత్తిడి పెరిగింది. నన్కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడి చేసిందని పాకిస్తానీ ఖాతాలు చేసిన తప్పుడు క్లెయిమ్స్ తో భారత్‌లో సిక్కు సమాజంలో కల్లోలాన్ని రేకెత్తించే ఉద్దేశ్యంతో ఉందని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ గుర్తించింది. అయితే తప్పుడు క్లెయిమ్స్ ఆయా దేశాల మీడియా ఖ్యాతిని అంతర్జాతీయంగా దెబ్బతీశాయి. మీడియా సంస్థలు విశ్వాసాన్ని కోల్పోయాయి. ప్రస్తుత ఏఐ, డిజిటల్ యుగంలో న్యూస్ చానల్స్, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని మొదటిసారే విశ్వసించకుండా క్రాస్ చెక్ చేసుకోవడం మంచిది. ఇలాంటి ప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ సైతం తమ అల్గారిథమ్ లో మార్పులు చేయాల్సిన అవసరముంది. న్యూస్ చానల్స్ కూడా బాధ్యతగా వ్యవహరించి వాస్తవాలను మాత్రమే ప్రసారం చేయాలి.

**ప్రపంచాన్ని భయపెట్టిన రేడియేషన్ లీక్**

పాకిస్తాన్‌లోని కిరానా హిల్స్ వద్ద ఉన్న అణు స్థావరాలపై భారత్ దాడి చేసిందని, దీని వల్ల న్యూక్లియర్ రేడియేషన్ లీక్ అవుతోందని ఒక పత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు ఏఐ ద్వారా ఈ పత్రాన్ని క్రియేట్ చేశారు. స్థానిక ప్రజలు వాంతులు, తలనొప్పి, వికారం వంటి లక్షణాలతో బాధపడుతున్నారని, ఇది రేడియేషన్ లీక్‌కు సంకేతమని అందులో పేర్కొన్నారు. భారత సైనిక దాడులు సర్గోధా, నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నాయని, కిరానా హిల్స్ సమీపంలో జరిగిన దాడుల వల్ల రేడియేషన్ లీక్ జరిగిందని ఇందులో పేర్కొన్నారు. దీన్ని 'ఎక్స్'లో కొన్ని లక్షల సార్లు షేర్ చేశారు. దీంతో పాకిస్తాన్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొన్నది. ఒక సందర్భంలో ఇది భారత్-పాకిస్తాన్ మధ్య అణు యుద్ధ భయాన్ని సైతం రేకెత్తించింది. అయితే ఇది నకిలీదని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో ఎటువంటి న్యూక్లియర్ రేడియేషన్ లీక్ కాలేదని చెప్పింది. ఈ పత్రంలో అనేక తప్పులు ఉన్నాయని పేర్కొంది. భారత్ చర్యలు సంప్రదాయ ఆయుధాల పరిధిలోనే ఉన్నాయని, అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కూడా స్పష్టం చేశారు.

ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

# అల్లూరికి అండగా నిలిచిన ఆంగ్లేయ అధికారి ఫజులుల్లాహ్ ఖాన్

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న పలువురు యోధుల చరిత్ర ప్రజాదరణ పొందిన చరిత్ర గ్రంథాలలో చోటు చేసుకోక పోవడం వలన ఆ యోధుల త్యాగాలు, సాహసోపేత చరిత్రలు ప్రజా బాహుళ్యానికి అందకుండా పోయాయి. అలాంటి అలనాటి అజ్ఞాతయోధులలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఫజులుల్లా ఖాన్ ఒకరు. భారతదేశంలో సహాయ నిరాకరణ, ఖిలాఫత్, శాసనోల్లంఘన ఉద్యమాల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో "మన్య విప్లవం" (1922-24) జరిగింది.

ఆ సమయంలో అల్లూరి సీతారామరాజు తండ్రి వెంకట్రామరాజుకు సహాధ్యాయి, మిత్రుడు ఫజులుల్లా ఖాన్ బ్రిటీష్ ప్రభుత్వంలో అధికారిగా ఉన్నారు. ఆ చారిత్రక మన్యం పోరాట / మన్యం పితూరి సమయంలో మన్యం ప్రాంతంలో ఆంగ్లేయ ప్రభుత్వంలో ఫజులుల్లాహ్ ఖాన్ పోలవరం డిప్యూటీ కలెక్టర్ / పోలవరం డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన ఆంగ్లేయ ప్రభుత్వంలో అధికారిగా నియమితులైనప్పటికీ చారిత్రక మన్యం పోరాట సమయంలో అల్లూరి సీతారామరాజుకు పూర్తి స్థాయిలో తోడ్పాటునిచ్చారు.

ఈ విషయాన్ని స్వాతంత్ర్య సమరయోధులు, చారిత్రక పరిశోధకులు శ్రీ పొన్నలూరి రాధాకృష్ణమూర్తి 1935లో రాసిన "మన్యంలో విప్లవం -అల్లూరి సీతారామరాజు" గ్రంథం ద్వారా వెల్లడ్కెంది. బ్రిటీష్ ప్రభుత్వం చేత నిషేధానికి గురైన ఆ గ్రంథంలో అల్లూరి సీతారామరాజును ఫజులుల్లాహ్ ఖాన్ తన నివాసానికి పిలిపించు కుని విప్లవోద్యమం గురించి చర్చిస్తూ, వేదాంత చర్చల చాటున అడవిబిడ్డల విరీద అధికారుల జులుం, ఆ సమస్యల పరిష్కార మార్గాలు, ఆ మార్గాల ద్వారా సత్ఫలితాలు రాబట్టేందుకు రూపొంది ంచాల్సిన పథకాల గురించి ఆలోచనలు చేశారు. ఆ చర్చల పర్యవసానంగా ఏర్పడిన పునాదుల విరీద మన్యం విప్లవోద్యమం / మన్యం పితూరి సాగింది. మన్యం పితూరి ఆలోచనలను ఆచరణలో పెడుతూ అల్లూరికి అడ్డతీగల సవిరీపంలో 60 ఎకరాల భూమిని ఫజులుల్లాహ్ ఖాన్ మంజూరు చేయించటమే కాకుండా, ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా పోలీసుల నుండి రాజుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆయన మన్యంలో స్వేచ్ఛగా సంచరిస్తూ తన కార్యకలాపా లను సాగించే అవకాశాన్ని ఫజులుల్లాహ్ ఖాన్ కల్పించారు.

ఈ విధంగా బ్రిటీష్ ఉన్నతాధికారులెన్న ఆంగ్లేయులకు ఎటువంటి అనుమానం కలుగకుండా రామరాజుకు ఫజులుల్లా అండగా నిలి చారు. ఈ విషయమ్మె పొన్నలూరి రాస్తూ 'కృష్ణదేవి పేటలో అలజడి యారంభమ్మెనపుడే రాజును స్థానభ్రష్టుని జేయక, అతనికి భూములిప్పించి, మన్యములోనే నిల్పిన ఖాన్‌గారి చర్యలు ఈ పితూరికి పూర్తి సహాయమ్మెనటుల తెల్ల ఉద్యోగులు తమ విశ్వాసము ను ప్రకటించిరి' అన్నారు.

మన్యం విప్లవానికి రామరాజు నాయకుడ్కెతే, ఆ నాయకుని రథసారథిగా ఫజులుల్లాహ్ ఖాన్‌ను పొన్నలూరి అభివర్ణించారు. అత్యంత ప్రాధాన్యతగల ఈ అంశాన్ని ఆయన మరితంగా వివరిస్తూ 'రామరాజు ప్రవేశించినంతనే, విపదాంధకారయుతమగు మన్యలోక మున విప్లవ భానుడుదయించి నటులయ్యెను. కానీ యా భానుని (రాజు) తీవ్ర గమనమునకు రథ సారథ్యమును వహించవ లసిన శ్రీయుత ఫజులుల్లా ఖాను గారు మృత్యు శయ్యపై నున్నారు. ఫజులుల్లా గారు గొప్ప వ్యాధిగ్రస్తులెర్కోయిరి. పిదప అనతి కాలం లో ఖాను గారు స్వర్గస్తులెర్కెరి' అని ఆనాటి పరిస్థితిని వివరించారు. ఈ వాఖ్యానాలు, అందిన సమాచారం బట్టి అల్లూరి విప్లవోద్యమం / మన్యం పితూరి ఆవిర్భావంలో డిప్యూటీ కలక్టరు ఫజులుల్లాఖాన్ ఎంతటి గొప్ప పాత్ర నిర్

## ఆపరేషన్ సింధూర్‌లో భారత సైనికుల విరోచిత పోరాటం

**వికారాబాద్, మే 17 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు ఆపరేషన్ సింధూర్ యుద్ధ ఆవశ్యకతను భారత సైనికుల త్యాగాలను గ్రామ గ్రామాన సామాన్య ప్రజలకు కూడా తెలియపరచాలనే ఉద్దేశంతో శనివారం నాడు ఉదయం వికారాబాద్ మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న రైతు కూలీల వద్దకు వెళ్లి పాకిస్తాన్ పై భారత్ యొక్క గెలుపును వివరించిన వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్ భారతదేశం పైన ప్రత్యక్ష దాడి చేయలేక తీవ్రవాద స్థావరాలు ఏర్పాటు చేసుకొని అనేకమంది పర్యాటకులు మరియు సైనికుల యొక్క ప్రాణాలను బలితీసుకుందని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని వారికి తగిన గుణపాఠం నేర్పించిందని, ప్రతీ పౌరుడు గర్వించేలా భారత ప్రభుత్వం ఎదుర్కొని సవాల్ విసిరిందని, ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరి పటిష్టమైన రక్షణ కల్పిస్తుందన్నారు, ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఫల పరిశోధన కేంద్రంలో 280 రకాల మామిడి పండ్లు

- కలెక్టర్ క్రాంతి వల్లూరి

**సంగారెడ్డి ప్రతినిధి, మే 17 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పద పరిశోధన కేంద్రంలో 250 రకాల మామిడిపండ్లు ఉండడం జిల్లాకు గర్వకారణం అని కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ,సంగారెడ్డి లోని ఫల పరిశోధన కేంద్రంలో రెండు రోజులుగా మామిడి రకాల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది . శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేసి 280 రకాల మామిడి పండ్లను వీక్షించారు. కలెక్టర్ గారు మాట్లాడుతూ జిల్లాలో ఇంత మంచి పండ్ల పరిశోధన కేంద్రం ఉండడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం ఇంకా మరెన్నో పరిశోధనలు చేసి మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సైంటిస్టులకు సూచించారు. అనంతరం కలెక్టర్ యూనివర్సిటీలో చదువుతున్న ఎంఎస్సీ, పిహెచ్డి విద్యార్థులతో కోర్సుకి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫల పరిశోధన స్థానం హెడ్ సుచిత్ర, సైంటిస్ట్ హరికాంత్, నితీష్, హార్టికల్చర్ విద్యార్థులు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రైతులు ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధిపై దృష్టి సాధించాలి

- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్
- అరిస్టాటిల్ పీజీ కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

**మొయినాబాద్, మే 17 (జనంసాక్షి) :** సుస్థిర అభివృద్ధి అంశాలపై విద్యార్థులు దృష్టి సాదించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీ రామ్ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారము మున్సిపల్ పరిధిలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పునాత ఉద్యమండాలి కార్యదర్శి శ్రీరామ వెంకటేష్ పాల్గొని సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బిజినెస్ విద్యలో ఆది తీరాలని విద్యార్థులకు సూచించారు. సుస్థిర వ్యవస్థలో ముందుకు సాగినప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని కొనియాడారు. ప్రపంచ నలుమూలల నుంచి వివిధ శాస్త్రవేత్తలు ప్రముఖులు నిపుణులు పాల్గొని సలాలు సూచనలు తెలపడంతో పాటు ఎంబీఏ విద్యపై అవగాహన కల్పించడం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జాంగిర్, చెన్నప్ప, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్ తనిఖీ

**నంగునూరు, మే 17 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో శనివారం సాయంత్రం రాజగోపాలపేట పోలీసుల ఆధ్వర్యంలో నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి నిర్మూలన లో భాగంగా డాగ్ స్క్వాడ్ టీంల తో తనిఖీలు నిర్వహించారు. రెండు డాగ్ స్క్వాడ్ టీములు నంగునూరులోని అన్ని కిరణా షాపులు, హెూటళ్ళు, దాబాలు, స్కూళ్లు, కాలేజీల పరిసర ప్రాంతాలను నంగునూరు చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టాయి. రాజగోపాల్ పేట ఎస్ఐ ఎం.డి.ఆసిఫ్, ప్రొబేషనరీ ఎస్సై బి.సౌజన్య ఇతర పోలీస్ సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాలపేట ఎస్సై ఎం.డి.ఆసిఫ్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనిని నివారించి యువతను సన్మార్గంలో నడిపేందుకు డ్రగ్స్ మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఎవరైనా డ్రగ్స్ మత్తు పదార్థాలు అమ్మవద్దని అలా అమ్మడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, వాటిని అమ్మినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# జనాభా గణనతో హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

- వర్షాకాలం ముందు డ్రైనేజీ సమస్యలపై ముందస్తు ప్రణాళికలు
- ట్రాఫిక్ ఇబ్బందుల నివారణకు ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కావాల్సిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో కలిసి మంత్రి సమీక్షించారు. నగరంలో వివిధ పథకాల ద్వారా మౌలిక వసతులు చేపట్టిన రోడ్లు, ఫ్లై ఓవర్, ముంపు నివారణకు చేస్తున ఎస్ఎన్ డిపి, ఎస్ఆర్ డిపి, హెచ్ సిటీ, వీధి లైట్లు, శానిటేషన్, సాలిడ్ వెస్ట్ నిర్వహణ పై మంత్రి సమీక్షించారు. ఎస్.ఆర్.డి.పి లో చేపట్టిన అసంపూర్తి పనులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఫలక్ నూమా ఆర్ ఓ బి పనులను జులై వరకు, శాస్త్రి పురం ఆర్ ఓ బి ఆగస్టు వరకు పూర్తి చేయాలని ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు. శిల్ప లే ఔట్ రెండో దశ పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉందని ప్రాజెక్టు సి ఈ భాస్కర్ రెడ్డి మంత్రికి వివరించారు. హెచ్ సిటీ ద్వారా మంజూరైన పనులు యుద్ధ ప్రతిపాదన పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియ అగ్రిమెంట్ పూర్తయిన వెంటనే పనులు చేపట్టాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. పూడిక తీత పనులు వెనువెంటనే చేపట్టి వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. జవహర్ నగర్ డంప్ యార్డ్‌పై భారం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ డంప్ యార్డు ఏర్పాటుకు స్థలాలు అవసరమని శానిటేషన్ అడిషనల్ కమీషనర్ మంత్రిని కోరగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ లకు త్రిబుల్ ఆర్‌కు స్థల సేకరణ చేస్తున్న నేపథ్యంలో డంప్ యార్డు కోసం స్థల సేకరణ కు చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని లేఖ ప్రత్యేకంగా పంపించిన తనకు తెలియజేస్తే ప్రభుత్వం ద్వారా కృషిచేస్తానన్నారు. తెలంగాణ జనాభాలో సుమారు 30 శాతం మంది హైదరాబాద్ నగరంలో నివసిస్తున్నందున, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు మంత్రి. ఈ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్.వి కర్ణన్, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, ప్రాజెక్టు సిఈ భాస్కర్ రెడ్డి, మెయింటేన్స్ సి ఈ సహదేవ్ రత్నాకర్, సి సి పి శ్రీనివాస్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రామ్ నాయక్, ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి, ప్రాజక్టు మెయింటేన్ ఎస్ ఈ లు, ఈ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# మన కుటుంబం సినిమాను ఆదరించండి

- పల్లెటూరు నేపథ్యంలో తెరపైకెక్కిన సినిమా
- సినీ నిర్మాత కలకొండ నరసింహులు, హీరో రవివర్మ
- పూజలో పాల్గొని సినిమాను తిలకించిన బీజేపీ నేత, జాతీయ మాజీ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి

**వెల్దండ, మే 17 (జనంసాక్షి) :** పల్లెటూరి నేపథ్యంలో తెరపై కొచ్చిన మన కుటుంబం సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సినీ నిర్మాత కలకొండ నరసింహులు, సినీ హీరో రవివర్మలు కోరారు.. శనివారం నాగర్‌కర్నూలు జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, ఆమనగల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర సినిమా థియేటర్లో మొదటి రోజు పూజా కార్యక్రమానికి నిర్మాత నరసింహులు, హీరో రవి వర్మ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేద , మధ్యతరగతి కుటుంబాల జీవన స్థితిగతులు, పల్లెటూరి నేపథ్య కోణంలో సినిమాను తెరకెక్కించినట్లు వారు తెలిపారు.. మూడు గంటల సినిమా ప్రజలను వినోదం, ప్రేమ, కుటుంబ నేపథ్యంలో 4 పాటలు,3 ఫైటింగ్ లతో ఎంతో ఆకట్టుకుంటుందని వారు తెలిపారు.. సినిమాలో సినీ హీరో సుమన్, అన్నపూర్ణమ్మ, మురళీధర్ గౌడ్ ముఖ్యపాత్రలో నటించిన తెలిపారు. సినిమా హీరో హీరోయిన్లను ఏకతాటి పైకి వచ్చి సినిమాకు చక్కని సందేశాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు.. ప్రస్తుతం ఆమనగల్లు,అచ్చంపేట, కర్మన్ గట్టు, కూకట్పల్లి, మల్కాజ్గిరి, ఉప్పల్, అత్తాపూర్, శాలిబండ, బంజారాహిల్స్, కాచిగూడ, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, ముసరాంబాగ్, ఎర్రమంజలి, తదితర థియేటర్లో మన కుటుంబం సినిమా ప్రదర్శింపబడుతుందని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. అంతకుముందు జాతీయ బిసి మాజీ కమిషన్ నెంబర్ తల్లోజు ఆచారి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, అజిలాపూర్ మొగులయ్య, కాంగ్రెస్ నేత మల్లెపల్లి జగన్, యాదగిరి, జర్నలిస్టులు నూకం శ్రీనివాసు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ముఖ్యం

- టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

**తుర్కయంజాల్, మే 17 (జనం సాక్షి) :** రైతు శ్రేయస్సే లక్ష్యంగా తుర్కయంజాల్ సహకార బ్యాంక్ ముందుకెళ్తోందని టెస్కాబ్ వైస్ చైర్మన్, జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్ సహకార బ్యాంకు కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ సమావేశం జరిగింది. 11మందిని నూతన సభ్యులుగా చేర్చుకున్నారు. అలాగే 9మంది రైతులకు రూ.1.25కోట్ల రుణాలు మంజూరు చేశారు. 2024- 25 ఆర్థిక సంవత్సర ముగింపు లెక్కలను ఆమోదించారు. 2025-2026 ఆర్థిక సంవత్సర ఏప్రిల్ నెల జమ ఖర్చులను ఆమోదించారు. సంఘం సంక్షేమం కోసం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేయుటకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులకు రుణాలతో పాటు సబ్సిడీలో వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చెక్క లక్ష్మమ్మ, కుతాడి నర్సింగరావు,చాపల యాదగిరి, శీలం లక్ష్మి, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, సహకార బ్యాంకు మేనేజర్ వై.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జీవన సమృద్ధి సాధ్యం

**శేరిలింగంపల్లి, మే 17 (జనంసాక్షి) :** ప్రతి మనిషి జీవనగమనంలో ఎన్నో అంశాల దృష్టి కోణం తన పాత్రను పోషిస్తుందని, అయితే ఇందులో అత్యంత ప్రభావితం కలిగిన అంశంగా ఆధ్యాత్మిక చింతన నిలుస్తుందని హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధి జవహర్ నగర్ కాలనీలో గల రేణుక ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధి పనుల నిమిత్తం శనివారం ఫౌండేషన్ తరపున 36వేల రూపాయల నగదును అందజేశారు. ఈ మేరకు బిగ్ బాస్ రియాల్టీ షో ఫేమ్ జెస్సీ జస్వంత్ చేతుల మీదుగా రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయ కమిటీ సభ్యులకు సదరు చెక్కులు కొండా విజయ్ కుమార్ అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో వ్యక్తిగత అంశాలు ఎన్నో ముడిపడి ఉంటాయని, ప్రతి వ్యక్తి జీవితం పై ప్రభావవంతమైన ముద్రను చూపించేది మాత్రం ఆ వ్యక్తుల యొక్క ఆధ్యాత్మిక చింతననేనని విజయ్ కుమార్ వివరించారు. చందానగర్ డివిజన్ పరిధి జవహర్ నగర్ కాలనీలో రేణుక ఎల్లమ్మ దేవాలయం ఏర్పాటు ఒక గొప్ప విషయమని, తప్పకుండా ఒక మంచి కార్యక్రమానికి ఓ ఫౌండేషన్ ద్వారా కొంత సహకారాన్ని అందించగలిగామన్న సంతృప్తి తమకు లభించిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని సఫలీకృతం చేసుకోవడానికి వార అనుసరించే ఆధ్యాత్మిక మార్గం ఎంతో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతల ద్వారా వ్యక్తిగత జీవితాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకతను ఎత్తిచూపారు. ఇందులో భాగంగా బిగ్బాస్ ఫేమ్ జస్వంత్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి పరిధిలో హెూప్ ఫౌండేషన్ ఎన్నో గొప్ప సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తాను తెలుసుకున్నానని, ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం తమ వంతు బాధ్యతను నిర్వహించడం ద్వారా సమాజ ఉన్నతికి తోడ్పాటునందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుర్ర, హెూప్ ఫౌండేషన్ సభ్యులు రవికుమార్, అపర్ణ, ఆలయ కమిటీ సభ్యులు అనంత రామ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉన్నతాధికారుల వద్దకు ఆసుపత్రుల నివేదిక

**సూర్యాపేట, మే 17 (జనంసాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం డాక్టర్ రాథోడ్ పర్సనల్ డైరెక్టర్, డాక్టర్ సుమిత్రా రాణి డిప్యూటీ సిఎస్ పిసిపి ఎన్డిటి, శ్వేతా మోహన్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ కార్యాలయం వారు ఆకస్మికంగా సందర్శించారు. గత వారం రోజులుగా సూర్యాపేటలో పలు ఆసుపత్రులపై వస్తున్న ఆరోపణను పరిశీలనకై వచ్చి ఆసుపత్రుల పర్మిషన్‌కు సంబంధించిన అర్హత పత్రులను వైద్యాధికారుల పర్మిషన్ సర్టిఫికెట్స్ పరిశీలించింది. ఈ ప్రతులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పరిశీలనమితమై నాలుగు ఆసుపత్రులకు సంబంధించిన అన్ని వివరాలను సర్టిఫికెట్స్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం సేకరించింది. ఈ రిపోర్ట్స్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవిచంద్రనాయక్ సమర్పించనున్నట్టు, అక్కడ పరిశీలన అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ తదుపరి చర్యల నిమిత్తమై పంపనున్నట్టు రాష్ట్ర బృందం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సీబీఎస్ఈ 10, 12 ఫలితాల్లో ప్రీమియా అకాడమీ ప్రభంజనం

**ఖైరతాబాద్, మే 17 (జనం సాక్షి) :** నిబద్ధత, బాధ్య త, విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమతో కూడిన ప్రముఖ విద్యా సంస్థ ప్రీమియా అకాడమీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వ హించిన 10, 12వ తరగతుల పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రీమియా అకాడమీ ఫౌండర్, ఎండీ సింధూరి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల కేవలం విద్యాపరమైన అత్యున్నత ప్రమా ణాలకే కాకుండా, విద్యార్థులలో విలువలు, జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడం, వారి భవిష్యత్తు వృద్ధికి అద్భుతమైన అవకాశాలను సృ ష్టించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ప్రీమి యా అకాడమీ 11వ తరగతిలో ప్రవేశించగోరు విద్యార్థుల కొరకు మే 17, 24, 31 తేదీలలో ఉప కార వేతన పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష సైన్స్ విభాగానికి(ఎంపీసీ, బైపీసీ) వర్తిస్తుందన్నారు. ప్రీమియా అకాడమీ ప్రాంగణంలో పరీక్ష నిర్వహించ బడుతుందన్నారు. ప్రిన్సిపల్ తృప్తి రావు, హెడ్ మిస్ట్రెస్ సునీత సరిపల్లి విద్యా ర్థులను అభినందించారు.

# క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి

- బొంపల్లి గ్రామస్తులు

**దోమ, మే 17 (జనం సాక్షి) :** క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలను పెంచుతాయని బొంపల్లి గ్రామస్తులు అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గత 20 రోజులుగా జరుగుతున్న బిపిఎల్ క్రికెట్ లీగ్ టి20 టోర్నమెంట్ నేటి(శనివారం)తో ముగిసింది. ఈ మేరకు గెలిచిన జట్లకు గ్రామస్తులు మెమోంటోలు,నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బిపిఎల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ లో మొత్తం ఆరు టీంలు పాల్గొనగా ప్రతి రోజు రెండు టీంలు నిర్వాహకులు నిర్వహించారు. అందులో శనివారం ఫైనల్ మ్యాచ్ జరుగగా, బిపిఎల్ రైజర్స్ టీమ్ మొదటి విజేతగా నిలువుగా, రెండవ విజేతగా బొంపల్లి వారియర్స్ విజయం సాధించింది.దీంతో మొదటి విజేతకు రూ.10 వేలను గ్రామనికి చెందిన ఆర్.అంతిరెడ్డి నగదు బహుమతి అందించగా, రెండవ టీంకు గ్రామానికి చెందిన గుడిసె రాములు ముదిరాజ్ రూ.5 వేల నగదు బహుమతి అందించారు. అలాగే క్రీడాకారులకు రూ.15 వేలతో మోమేంటోలను గ్రామానికి చెందిన బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అందించారు. ఫైనల్‌లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రావడంతో నిర్వాహకులు గ్రామ మాజీ ఎంపిటిసి రాములు, కానిస్టేబుల్ సురేష్ సహకారంతో అన్నదానం చేశారు.ప్రతి టీంలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో తమ ప్రతిభను కనబరచారన్నారు. స్నేహపూర్వకంగా క్రీడలను ఆడుకోవాలి తప్ప గెలిచిన వారు ఓడిన వారిని హేళన చేయకూడదన్నారు. క్రీడాస్ఫూర్తితో మెలిగి ఇతర గ్రామస్తులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇరవై రోజులుగా సజావుగా నిర్వహించిన నిర్వాహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, క్రిడాభిమానులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 మే 2025

# ఫ్రెండ్లీ పోలీస్‌గా వనపర్తి జిల్లాను రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచాలి

● స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి

**వనపర్తి బ్యూరో, మే 17 (జనంసాక్షి) :** శాంతి భద్రతలు, ఫ్రెండ్లీ పోలీస్‌గా వనపర్తి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచేందుకు పోలీస్ శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్తానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్ వద్ద పాత భవనానికి రెన్యువేషన్ చేసిన సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయానికి జిల కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు బాగుండాలంటే పోలీస్ శాఖకు మౌలిక సదుపాయాలు బాగుండాలని అందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. శాంతి భద్రతలు, ఫ్రెండ్లీ పోలీస్ విషయంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వనపర్తి జిల్లాను అగ్రస్థానంలో ఉంచాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందని అన్నారు. ప్రజలకు రక్షణ కల్పించే పోలీస్ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో డీఎస్పీ కార్యాలయాన్ని రెనోవేషన్ చేయించి ఈరోజు పునఃప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. భవనం రెనోవేషన్‌కు నిధులు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. వనపర్తి పట్టణానికి, మండలాలకు పోలీస్ శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలు

సమకూర్చుకునేందుకు తన స్వంత నిధుల నుండి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో కొత్తగా మూడు మండలాల్లో కొత్త తహసిల్దార్ కార్యాలయాలు ఒక్కోటి రూ. 32 లక్షల వ్యయంతో నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, సంబంధిత మండలాల్లో స్టేషన్ హౌస్ ఆఫీస్‌లు సైతం కొత్త భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో ఒక సర్కిల్ కార్యాలయం, మరో ఎస్.హెచ్.ఒ మంజూరుకు సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయం పట్టణంలో ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుందని, జిల్లా ఎస్పీ, డీఎస్పీ చొరవ చూపడం వల్ల నిధులు మంజూరు చేయడంతో రెనోవేషన్ అనంతరం నేడు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, ప్రభుత్వం నుండి అద్దె చెల్లించే బాధ కూడా తప్పిందని అన్నారు. అదేవిధంగా పోలీస్ శాఖకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ పోలీస్ శాఖ జిల్లా యంత్రాంగం, రాజకీయ నాయకులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ప్రజలకు శాంతి భద్రతల విషయంలో రాజీలేని కృషి చేస్తున్నామని అన్నారు. ఇక ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి వనపర్తి జిల్లాకు మంచిపేరు తెస్తామని హామీనిచ్చారు. ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతి భద్రతల విషయంలో తన పోలీస్ అధికారులు ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తారని కొనియాడారు. పోలీస్ శాఖకు అండగా నిలుస్తున్న జిల్లా కలెక్టర్, శాసన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి డీఎస్పీ వెంకటేశ్వర రావును గౌరవ ప్రదంగా తన కుర్చీలో కూర్చోబెట్టారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర రావు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ రమేష్ రెడ్డి, సిఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కాలనీకి రక్షిత తాగునీరు

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, మే 17 (జనంసాక్షి) :** నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు రక్షిత మంచి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్మెంట్ వాసుల కోసం 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న పైపులైన్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి మంచినీరు అందించాలని లక్ష్యంతో నూతన రిజర్వాయర్లు, పంపు హౌస్ లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని.. వాటిలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షులు అమరేందర్, ప్రధాన కార్యదర్శి మాణిక్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**చిలప్‌చెడ్, మే 17 (జనంసాక్షి) :** మండలంలో పనిచేస్తున్న అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మండల అధ్యక్షులు బాల్ రాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి స్పందిస్తూ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా చూస్తామన్నారు. ఇందులో భాగంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, మంత్రిగారితో స్థానిక విలేకరులకు తప్పనిసరిగా ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా చూడాలని మంత్రిగారికి తెలియజేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలప్ చెడ్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాల్ రాజ్, ఉపాధ్యక్షులు దుర్గాచలం, అనిల్, ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, గౌరవ అధ్యక్షులు యాదగిరి, కార్యదర్శులు శ్రీకాంత్ గౌడ్,ప్రవీణ్ గౌడ్, కోశాధికారి శ్రీనివాస్,సభ్యులు శంకర్, పోచయ్య,జర్నలిస్టులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

● ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే చింత

**సదాశివపేట, మే 17 (జనం సాక్షి) :** మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటాచల దివ్య క్షేత్ర ఆలయంలో శ్రీ పద్మావతి గోదా సమేత అద్భుత వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల నుండి ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ

వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ ప్రతిష్టాపన చార్యులు జై శ్రీ మన్నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జ్యోతిష్య రత్న డాక్టర్ కందంట్లె వరదాచార్య స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ పద్మావతి గోదా సమేత అద్భుత వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందరి పైన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతాగోపాల్,నాయకులు శివరాజ్ పాటిల్, కోడూరు అంజయ్య, నరేష్ గౌడ్, నగేశ్, వెంకటేశం, రాజు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# జంబ్లింగ్ పద్ధతిలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

● పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
● అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
● ఈ నెల 22 నుండి 28 వరకు పరీక్షలు
● ఇన్విజిలేటర్లకు, విద్యార్థులకు సెల్‌ఫోన్ అనుమతి లేదు
● జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి ప్రతినిధి, మే 17 (జనం సాక్షి) :** ఈ నెల 22 నుండి 28 వరకు జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరెట్ లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్ మీడియట్ అధికారులు, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య శాఖ, పోస్టల్ శాఖ,ఇతర సంబందిత శాఖల అధికారులతో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా మండలాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలు పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 28 పరీక్షా దాలు యెర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహణకు అన్ని యెర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షలో జంబ్లింగ్ సిస్టం ఉండడంవల్ల పరీక్ష కేంద్రాలను విద్యార్థులు ముందే తెలుసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందే రావాలన్నారు. ఒకరోజు ముందే పరీక్షా కేంద్రం చిరునామా తెలుసుకొని ఉండాలని విద్యార్థులకు

సూచించారు. ఆదివారం కూడా పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల మొబైల్ ఫోన్లో భద్రపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

ఇన్విజిలేటర్‌లకు కూడా సెల్ఫోన్ అనుమతి లేదన్నారు. చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంటల్ అధికారులు ఈ విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాలకు, విద్యుత్, సానిటేషన్ ఇతర మౌలిక వస్తువులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఇఒ గోవింద రావు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు రశీదు ఇవ్వండి

**వనపర్తి బ్యూరో, మే 17 (జనంసాక్షి) :** వరి కొనుగోలు కేంద్రంలో తూకం చేసినప్పుడే తాలు, తరుగుతో కలుపుకొని ఎన్ని క్వింటాళ్ల ధాన్యం తూకం చేశారో రైతుకు రశీదు ఇవ్వాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. శనివారం సాయంత్రం వనపర్తి పట్టణంలోని కల్యాణ సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అధ్యక్షతన వరి కొనుగోలు, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ గత రబీ సీజన్‌లో 90 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం రబీలో 3.90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి అయినట్లు తెలిపారు. అత్యధిక స్థాయిలో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు డబ్బులు ఇవ్వడంలో ట్రాన్స్పోర్ట్, మిల్లర్ల సమస్య ఉన్నట్లు స్పష్టమవుతుందని అన్నారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ గత సంవత్సరం రబీ సీజన్ లో కొన్న ధాన్యం కంటే ఈసారి రెండు మూడింతలు ఎక్కువ ధాన్యం కొన్నప్పటికి ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే అని అందుకు కారణం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం లారీలు పెట్టకపోవడమే అని అదే విధంగా మిల్లర్లు తరుగు పేరుతో వడ్లు దించుకోకపోవడమే అని మండిపడ్డారు. స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ కొంతమంది మిల్లర్లు కావాలని తరుగు పేరుతో రైతులకు ఇబ్బందులు పెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. దేవరకద్ర శాసన సభ్యులు జి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వరి కొనుగోలు సజావుగా జరిగి రైతులకు న్యాయం చేసేందుకు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొంతమంది మిల్లర్లు మాత్రమే తరుగు పేరుతో ధాన్యం త్వరగా దించుకోవడం లేదని ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 1.76 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన వడ్లకు రూ. 274 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మరో 80 నుంచి లక్ష టన్నుల వడ్లు మార్కెట్ కు వచ్చే అవకాశం ఉందన్నారు. ట్రాన్స్పోర్ట్ అధికారి సహకారంతో 500 లారీలు ధాన్యం సరఫరాకు పెట్టుకోవడం జరిగిందని, రాబోయే 8 రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. అనంతరం రాజీవ్ యువ వికాసంపై బ్యాంకర్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లతో రాజీవ్ యువ వికాసం పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో డి.సి. సి బి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోదిని, మాదాపూర్, కొత్తకోట మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్‌లు, డీఆర్డిఓ ఉమాదేవి, హౌసింగ్ పి.డి పర్వతాలు, తహసిల్దార్, ఎంపీడీఓలు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, మిల్లర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రులకు గురుపీఠం ఆహ్వానాలు

**శివ్వంపేట, మే 17 (జనంసాక్షి) :** మాజీ మంత్రి హరీష్ రావు ను నగరం లోని ఆయన నివాసంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ అటవీ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి లను శనివారం శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ శివకుమార్ గౌడ్, ట్రస్టు సభ్యులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమణ గౌడ్, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు రమాకాంత్ రెడ్డి, నాయకులు గొర్రె వెంకట్ రెడ్డి లతో కలిసి వెళ్లి జూన్ 3 నుంచి 5 వరకు శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గురుపీఠంలో జరిగే శ్రీదత్తాత్రేయ స్వామి, షిరిడి సాయిబాబా దేవత మూర్తుల ప్రాణ, యంత్ర ప్రతిష్ట, ఇతర పూజది కతృవు లకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు హరీశ్ రావు గారు స్పందిస్తూ, తప్పకుండా వస్తామని చెప్పారన్నారు. ఆ తర్వాత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మరో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కు కూడా గురు పీఠం ఆహ్వాన పత్రాలను ట్రస్టు ఫౌండర్ చైర్మన్ శివ కుమార్ గౌడ్ అందజేసి కార్యక్రమాలకు రావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## వరి ధాన్యం తూకాలు ప్రారంభం

● పరిశీలించిన జిల్లా అధికారులు

**బషీరాబాద్, మే 17 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నావంద్గీ ఆధ్వర్యంలో నావంద్గీ,మైల్వార్,దామర్ చెడ్,గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద శని వారం తూకాలు ప్రారంభించారు. డిస్టిక్ సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు,జిల్లా సహకార అధికారి నాగార్జున సిబ్బందితో కలిసి తూకాలను,రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ తూకాలు ఆలస్యం కావడానికి హమాలీ కొరత అన్ని చెప్పారు. తేమ 17శాతం లోపు ఉండాలి,తాలు శాతం ఎక్కువగా ఉండటం వల్ల తుఖం బస్తాకు రెండు కిలోలు అదనంగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులకు సరిపడా గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వెంకటయ్య,సెంటర్ ఇన్చార్జి ఫారుక్,బందప్ప తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

● శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**అచ్చంపేట, మే 17 (జనం సాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిపుత్రుల సంక్షేమం కోసం ప్రారంభించనున్న ఇందిర సౌరగిరి జల వికాస పథకం యొక్క ఏర్పాట్లను అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, జిల్లా అటవీ అధికారి రోహిత్ గోపిడి లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పర్యవేక్షించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం, అమ్రాబాద్ మండలం, మాచారం గ్రామంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మే 19 న ఇందిర సౌరగిరి జల వికాస పథకాన్ని ప్రారంభిస్తున్నారని, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, జిల్లా అటవీ అధికారి రోహిత్ గోపిడి లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, బహిరంగ సభ, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు, ఇందిర సౌరగిరి జల

వికాస పథకం లబ్ధిదారులైన రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం ఏర్పాట్లను, హెలిపాడునిర్మాణ పనులను, మీడియా పాయింట్ ఏర్పాట్లు, బారీ కెడింగ్, బందోబస్తు వంటి అంశాలను పరిశీలించారు. మాచారం గ్రామం నుండి ఇందిరా సౌర గిరి జల వికాస పథకాన్ని ప్రారంభించే వరకు గల రహదారి, బారీ కెడింగ్ పనులను, పైలెట్ ప్రాజెక్టు యొక్క పైలాన్ నిర్మాణ పనులను, పథకాన్ని ప్రారంభించే వేదిక పనులను సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అత్యంత పకడ్బందీగా బందోబస్తును నిర్వహించాలని, ఏర్పాట్లలో ఎక్కడ లోటు లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గిరిజనుల జీవితాల్లో ఆనందం నింపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కుటుంబాలలో ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు అనేక పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోంది. గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచేందుకు రైతులకోసం భూసంవృద్ధి, ఉద్యానవన అభివృద్ధి, సాగునీటి సదుపాయాలు, సాగులో ఆధునిక పద్ధతుల ప్రవేశపెట్టడం వంటి కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందిర సౌరగిరి జల వికాస పథకం భాగంగా భూములను లబ్ధిదారులకు మంజూరు చేయడం, ఆ భూముల్లో వాణిజ్య పంటలుగా పండే పండ్ల మొక్కలు నాటడం, డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థల ఏర్పాటు వంటివి అమలవుతున్నాయి. ఈ చర్యల ద్వారా గిరిజన రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉండటంతో పాటు, వ్యవసాయ రంగంలో వారి జీవన ప్రమాణాలు ఆర్థికంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతోనే ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. మాచారం గ్రామంలోని 50 ఎకరాల విస్తీర్ణంలోగల ఆర్ఓఎఫ్ఆర్ భూములుగల 27 మంది లబ్ధిదారులకు వాణిజ్య పంటలైనా అయిన పండ్ల మొక్కలు అవగాడో, మామిడి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, వెదురు మొక్కలను ఉద్యానవన శాఖ నిబంధనల మేరకు నాటడం పూర్తి అయ్యిందని, దానికి అనుబంధం పనులైన డ్రిప్పు పైపులు అమర్చుడం, స్ప్రింకర్ ఏర్పాటు తదితర పనులన్నీ పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జడ్జి హేమలత

**శివ్వంపేట, మే 17 (జనంసాక్షి) :** బాల్య వివాహాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని జూనియర్ సివిల్ జడ్జి హేమలత హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో న్యాయ

విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత హాజరై గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో ఆమె మాట్లాడుతూ ప్రజలు కల్తీకల్లు, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించి అధిక దిగుబాడులు సాధించి, మంచి లాభాలు పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, రైతులు ధైర్యంగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు జరిగిన లీగల్ సర్వీస్ కమిటీనీ సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, ఏఎస్ఐ సాయిలు, నర్సాపూర్ అసోసియేషన్ అధ్యక్షులు జిన్నారం శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మదుశ్రీ, స్వరూప, ప్రకాష్, లీగల్ సర్వీస్ సిబ్బంది, ఏఈవో మౌనిక, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, రైతులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అకాల వర్షంతో ఇబ్బందులు పడిన జనం

- విద్యుత్‌కు అంతరాయం
- కాళేశ్వరంలో పరిస్థితులను చక్కదిద్దిన కలెక్టర్, ఎస్పీ..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి జనం ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో రాత్రిపూట విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. మరికొన్ని మండలాల్లో వరి ధాన్యం తడిసి ముద్ద అయింది. రాత్రి కురిసిన అకాల వర్షం నేపథ్యంలో మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఏర్పడిన పరిస్థితులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే లు స్వయంగా పర్యవేక్షించారు. రాత్రి నుండే సరస్వతి ఘాట్, టెంట్ సిటీ, స్టాల్స్ వంటి ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. వర్షం కారణంగా విద్యుత్తులో తాత్కాలిక అంతరాయం ఏర్పడిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టి మళ్లీ విద్యుత్ సరఫరా కొనసాగించారు.

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు అవసరమైన సహాయ చర్యలు అందించాయి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత సిబ్బందికి సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు.

**పార్కింగ్ టోల్ రద్దు: కలెక్టర్..**

సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం విచ్చేసే భక్తుల వాహనాలకు పార్కింగ్ టోల్ రద్దు చేసినట్లు శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భక్తుల వాహనాలకు కాళేశ్వరంలో ఎలాంటి పన్ను వసూలు చేయొద్దని ఆయన ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు కాళేశ్వరంలో టోల్ చెల్లించొద్దని సూచించారు. వాహనాల రద్దీ నియంత్రణకు టోల్ గేట్ రద్దు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

**జిల్లాలో 104.0 మి.మీ వర్షపాతం నమోదు..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 104.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని మహదేవ్‌పూర్ లో 7.6 మిమీ, పలిమెలలో 8.4, మహాముత్తారంలో 2.2, కాటారంలో 21.8, మల్హార్ లో 6.4, చిట్యాలలో 1.2, టేకుమట్లలో 4.0, మొగుళ్లపల్లిలో 4.4, రేగొండ 23.4, గణపురం 6.2, భూపాలపల్లిలో 18.4 మిమీ వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 9.4 మి.మీ కాగా, జిల్లా మొత్తంగా 104.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

## పుష్కరాల్లో డిప్యూటీ సీఎం పిండ ప్రదానం

**కాళేశ్వరం, మే 17 (జనం సాక్షి) :** సరస్వతీ పుష్కరాల్లో భాగంగా శనివారం ఉదయం కాళేశ్వరంలో సరస్వతి ఘాట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు ప్రసాద్ తో కలిసి పెద్దలకు పిండప్రదానం నిర్వహించారు. అనంతరం పుష్కర ఘాట్‌లో స్నానమాచరించి కాళేశ్వర శివాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి శ్రీధర్ బాబు శాసన సభ్యులు మక్కన్ సింగ్, గండ్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వేటగాళ్ల చేతిలో పులి హతం

**పెంచికల్‌పేట్, మే 17 (జనంసాక్షి) :** పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ బిట్ పరిధిలో రెండు రోజుల, క్రితం కరెంట్ తిగలకు తగిలి పులి చనిపోయిన ఘటన చోటు చేసుకుంది. వివరాలకు వెళ్తే పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలో కే8, పెద్దపులి కొన్ని సంవత్సరాలుగా సంచరిస్తూ కరెంట్ ఉచ్చు తీగలకు తగిలి చనిపోవడంతో అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన జరిగిందని అన్నారు. రెవిన్యూఏరియాలో ఉన్న కరెంటు, అటవీ ప్రాంతంనికి అనుకోని ఉన్నందున వేటగాళ్లకు అవసంగా మారందండనికి ఆస్కారం లేదు. నిత్యం అదే ఏరియాలో ఎన్నో అడవిజంతువును హతమార్చిన, ఫారెస్ట్ అధికారుల నిఘా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చనిపోయిన పులి వెళ్ళాను, గొర్లను సైతం నరికి వేటగాళ్ళు, తీసుకోని పోయారని జిల్లా ఫారెస్టు అధికారి, నీరజ్ కుమార్ తొబ్రే వాల్ అన్నారు. కరెంట్ ఉచ్చుల పెట్టిన వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, నిందితులని పట్టుకొని కఠిన శిక్షలు పడేలా చేస్తామని తెలిపారు. చనిపోయిన పులి శవాన్ని పోస్టుమార్టం చేసి పంచనామా చేశారు.

## పట్టణంలో వరద ముప్పు నివారణకు శాశ్వత చర్యలు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ బ్యూరో, మే 17 (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలోని జిఎన్ఆర్ కాలనీలో వర్షాకాలంలో ఏర్పడే వరద ముప్పును నివారించేందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, విపత్తు నిర్వహణ విభాగం డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ లతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో ముఖాముఖీగా మాట్లాడి వరదల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరంగా అధికారులు తెలుసుకున్నారు. గత కొంతకాలంగా ప్రతి ఏటా వర్షాకాలంలో తీవ్రంగా వరదలు సంభవిస్తున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నివాసితులు పేర్కొన్నారు. అధిక వర్షపాతం కారణంగా వరద ముప్పు తలెత్తుతుందని, పరివాహక ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యామ్ వల్ల నీటి ప్రవాహం వరదనీరు కాలనిలో చేరుతుందని కలెక్టర్ తెలిపారు. చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గించేందుకు అనుమతులు లభించాయని, తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు జిల్లా పర్యటన కు వచ్చిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కి స్థానిక ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో కలెక్టర్ పూలమొక్క ను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి, మే 17(జనంసాక్షి) :** ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జి తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తాగునీటి వసతి, విద్యుత్, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశ్నపత్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఓపెన్ చేసి ఎలాంటి పొరపాటు జరగకుండా చూడాలని అన్నారు. ఫ్లయింగ్ స్క్వా ర్డ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఏర్పరిచి పర్యవేక్షణ చేయాలని, అందరు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డి చంద్రకళ, డిఐఈఓ, ఎన్ వీరేందర్, డిఇసి-1(5), బి శ్రీనివాస్ డిఇసి-2, చంద్రశేఖర్, డీఎంఎచ్ఓ, నాగేశ్వర రావు, డిఇ, టీజీఎన్పి డి సిఎల్, డి సురేష్, సిఐ, దయానంద్, ఇన్స్పెక్టర్ పోస్టల్ డిపార్ట్మెంట్, ఆయ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ హాల్ స్విమ్మింగ్ పూల్ పనులను వేగవంతంగా పూర్తి చేయండి

- కమిషనర్‌తో కలిసి క్షేత్ర స్థాయి లో పనుల పురోగతిని పరిశీలించిన మేయర్

**వరంగల్ ఎంజీఎం, మే 17(జనంసాక్షి):** కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ పనులతో పాటు స్విమ్మింగ్ పూల్ పనులను వేగ వంతం గా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులతో పాటు ఇండోర్ స్టేడియం సమీపం లో నిర్మిత మౌతున్న స్విమ్మింగ్ పూల్ పనులను కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే తో కలిసి మేయర్ శనివారం క్షేత్ర స్థాయి లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భం గా కౌన్సిల్ హాల్ నిర్మిత పనులను పరిశీలించి కొనసాగుతున్న పనులు పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని హాల్ లో ఏర్పాటు చేయనున్న టైల్స్ నమూనాల డిజైన్ లను పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు అధికారులకు మేయర్, మరియు కమిషనర్లు తగు సూచనలు చేశారు. స్విమ్మింగ్ పూల్ వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించి ఆక్వా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడిన మేయర్ వేగవంతం గా పనులను పూర్తి చేసి వెంటనే స్విమ్మింగ్ పూల్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులను వేగవంతం గా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ జోనా, ఈ ఈ లు రవికుమార్, మాధవి లత, డి ఈ కార్తీక్ రెడ్డి, ఏ ఈ లు రాగి శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణ

**కాళేశ్వరం, మే 17 (జనం సాక్షి) :** సరస్వతి పుష్కరాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులు సౌకర్యార్థం 55 స్టాళ్లు ఏర్పాటు చేసి వివిధ రకాల చేనేత ఉత్పత్తులు అలాగే జైళ్లు శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారు చేసిన చేనేత ఉత్పత్తులు వివిధ రకాల గృహ అవసరాలకు ఉపయోగపడే వస్తువులను విక్రయిస్తున్నారు. ముక్యంగా మహిళలు తయారు చేసిన పిండి వంటలు, చేనేత వస్త్రాలు, వాటర్ అండ్ కూల్ డ్రింక్స్, పూజా సామాగ్రి, కిరాణం మరియు బెడ్ కవర్స్ మహిళా క్లాత్, ఫ్యాన్సీ స్టోర్స్, తెలంగాణ పిండివంటలు కేరళ, డ్రైఫ్రూట్స్, హల్వా తదితర వివిధ రకాల తిను బండారాలు, చేనేత బట్టలు విక్రయిస్తున్నారు. చేనేత శాఖ ఆధ్వర్యంలో 13 రకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. స్టాళ్ళు పర్యవేక్షణకు డిఆర్డీఓ నరేష్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ పర్యవేక్షణ అధికారులుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నియమించారు. ఇద్దరు ప్రత్యేక అధికారులు నిరంతరం స్టాళ్లు పర్యవేక్షణ చేస్తున్నారు. పుష్కరాలు జరిగే అన్ని రోజులు ఈ స్టాళ్ళు అందుబాటులో ఉంటాయని ప్రజలు కొనుగోలు చేసేందుకు వివిధ రకాల చేనేత ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్టాళ్లు సందర్శించి గృహోపా అవసరాలకు ఉపయోగించే వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని పర్యవేక్షణ ప్రత్యేక అధికారి నరేష్ తెలిపారు.

## 11 కెవి విద్యుత్ వైర్ తగిలి ఐదు గేదెలు మృతి

**భూపాలపల్లి, మే 17 (జనం సాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ గడ్డ వద్ద పంట పొలాల్లో దారుణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్ళితే రోజులాగే పంట పొలాల్లోకి మీదకు వెళుతున్న పాడి గేదెలు దురదృష్టవశాత్తు పంట పొలాల్లో 11 కెవి విద్యుత్ వైర్ తెగిపడి కొడారి ఓదెలు, బోయిని రమేష్‌కు చెందిన ఐదు పాడి గేదెలు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు ఐదు లక్షల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు చనిపోయిన గేదెలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, గేదెలే జీవనోపాధిగా జీవిస్తున్న తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## సీపీ ఆనంద్‌కు సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కొటిక్స్ అవార్డును అందుకున్న సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసారు. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోలీస్ సమ్మిట్‌లో అవార్డు అందుకున్న సీపీ దానిని సిఎంకు వివరించారు.. 138 దేశాలతో పోటీ-పడి ప్రపంచంలోనే తెలంగాణ నంబర్ వన్ గా నిలవడంపై సీవీ ఆనంద్ ను సిఎం రేవంత్ అభినందించారు. ఈ సందర్భంగా నగర పోలీసులను సిఎం అభినందించారు. ఇలాగే ముందుకు సాగాలన్నారు.

## కాంగ్రెస్ బహిష్కృతునికి ఎమ్మెల్యేను విమర్శించే హక్కు లేదు

- అప్పుడు గుర్తుకురాని పౌరసత్వం ఇప్పుడు గుర్తుకు వస్తుందా
- కృష్ణమూర్తి చిల్లర రాజకీయాలు మానుకో
- పాలకుర్తి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మంజుల నాయక్

**పాలకుర్తి, మే 17 (జనంసాక్షి) :** కాంగ్రెస్ బహిష్కృతునికి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రెడ్డిలను విమర్శించే నైతిక హక్కు లేదని, ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ లావుడియా మంజుల నాయక్ స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్ లతో కలిసి మంజుల నాయక్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా, పాలకుర్తి ప్రాంతానికి సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో అగ్రరాజ్యం అమెరికాను వదిలేసి పాలకుర్తి కి వచ్చి 2023 ఎన్నికల్లో విజయం సాధించి ప్రజా సంక్షేమానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు పాటు పడుతున్నారని తెలిపారు. 2023 ఎన్నికల వరకు పెద్ది కృష్ణమూర్తి దేవరుప్పుల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా పనిచేశాడని, చిల్లర రాజకీయాలు చేయడం వల్లనే పార్టీ సస్పెండ్ చేసిందని తెలిపారు. 2023 ఎన్నికలప్పుడు గుర్తుకురాని వారసత్వం ఇప్పుడెలా గుర్తుకు వస్తుందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం పెరుగుతుంటే జీర్ణించుకోలేక ప్రతిపక్షాల మైకంలో పడి పెద్ది కృష్ణమూర్తి చిల్లర రాజకీయాలు చేస్తూ విమర్శలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు తప్పక లభిస్తుందని తెలిపారు. దిగజారుడు రాజకీయాలు మానుకొని, తప్పులను సరిదిద్దుకొని పార్టీకి కట్టుబడి పని చేయాలని ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి కోరినప్పటికీ పెద్ది కృష్ణమూర్తి లో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పై, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి పై విమర్శలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మహిళలే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో మంచి భవిష్యత్తు ఉన్న యువత పెద్ద కృష్ణమూర్తి మాయమాటలకు పక్కదారి పడుతూ విమర్శలకు దిగుతున్నారని వారి తీరు మార్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, కొడకండ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారావత్ సురేష్ నాయక్, జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, అడ్డూరి రవీందర్ రావు, పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్ వీరమనేని యాకాంతరావు, పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి మదర్, కొడకండ్ల మండలం మహిళా విభాగం అధ్యక్షురాలు అందే శ్రీ వర్ధ, నాయకులు బిక్షపతి, ఎండి సలీం, అందేయాకయ్య, పెనుగొండ రమేష్, బెల్లి దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్పూర్, మే 17 (జనంసాక్షి) :** నూతనంగా ఏర్పడిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశా రు. ఈ సందర్భంగా ఇటీవల మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిపై సీఎంతో చర్చించారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన, కార్యాల యాల నిర్మాణం, అభివృద్ధి పనులకు సంబంధించి 87 కోట్ల ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి అందజేశారు. స్మశాన వాటికల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణకు డంపింగ్ యార్డ్, మున్సిపల్ కార్యాలయం, మీటింగ్ హాల్, టౌన్ హాల్, గెస్ట్ హౌస్, సమీకృత మార్కెట్ నిర్మాణం, థీమ్ పార్కుల ఏర్పాటు, ప్రధాన కూడళ్ళ అభివృద్ధి, విద్యుద్దీకరణ పనులకు సంబంధించిన 87 కోట్ల విలువైన ప్రతిపాదనలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యమంత్రికి అందజేశారు. అలాగే మున్సిపా లిటీలో త్రాగు నీటి అవసరాలకు సంబందించి వాటర్ ట్యాంక్ ల నిర్మాణం, అంతర్గత పైప్ లైన్ ఏర్పాటు వంటిపనులకు 20కోట్లవిలువైన ప్రతిపాదనలను సీఎం కి అందజేసి అమృత్ 2.0 పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. పై విషయాలపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్యే అందజేసిన ప్రతిపాధనలను పరిశీలించి వీలై నంత తొందరలో మంజూరు ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంట ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఉన్నారు.

# 'మధు గురు అక్షర యజ్ఞం'ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**కాళేశ్వరం , మే 17,( జనం సాక్షి) :** కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల సందర్భంగా శుక్రవారం వీఐపీ స్టాల్లో "మధుగురు అక్షర యజ్ఞం" ప్రచార సంచికను రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ అక్షర యజ్ఞం నిర్వహకులు రౌతు. మధూకర్ పిల్లలకు ఉన్న చదువులు -పెద్దలకు ఉపాధి మార్గాలు అందించాలనీ తెలిపారు. అక్షర యజ్ఞంలో భాగంగా మధుగురు ఇన్నోవేషన్ కేంద్రాలలో యువత, మహిళలకు ఉద్యోగానికి కావాల్సిన విషయ పరిజ్ఞానాలు, నైపుణ్యాలను పెంపొందించడం, వ్యాపారానికి కావాల్సిన వనరులు అందించబడునని పూర్తి వివరాలకు 9441226834, 9491504405 లో సంప్రదించ గలరని రౌతు.మధూకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలేక్టర్ రాహుల్ శర్మ, గోదావరిఖని మాజీచైర్మన్, తానిపర్తి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 మే 2025

# పిచ్చి తుగ్లక్ పాలన చేస్తున్న రాజగోపాల్ రెడ్డి

- అందాల రాశుల చుట్టూ ప్రభుత్వం
- ధాన్యపు రాశుల వద్ద అవస్థలు పడుతున్న రైతులు
- స్థానిక సంస్థల ఎన్నికల కోసం కోట్లు వసూలు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**చౌటుప్పల్, మే 17 (జనం సాక్షి) :** గతంలో పిచ్చి తుగ్లక్ పాలన అంటే విన్నాం కానీ నేడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తుగ్లక్ పాలనను చూపిస్తున్నాడని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు కుప్పలుగా పోసిన ధాన్యపు రాశులను శనివారం కూసుకుంట్ల సందర్శించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం తూకాలు జరుగుతున్నాయా, వెంటనే లిఫ్టింగ్ చేస్తున్నారా, రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి బస్టాండ్ ఆవరణలో సర్వీస్ రోడ్డు నుంచి చిన్న కొండూరు రోడ్డు వరకు ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి వెంట రెండు వైపులా నిర్మించిన సర్వీస్ రోడ్లను పరిశీలించారు. నాణ్యత లేకుండా నిర్మించిన మోరీలను, మూరీలపై అక్కడక్కడ వేసిన నాణ్యతలేని పైకప్పులు కూలిపోవడాన్ని ఆయన పరిశీలించి నాణ్యత లేకుండా పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన నేతలు కమిషన్ల కోసం కక్కుర్తి పడి రోడ్డు మోరీలల్ నిర్మాణంలో నాణ్యతను పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా చిన్న కొండూరు రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా నిర్మాణం కావడంతో ప్రజలు, తోపుడుబండ్ల వ్యాపారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. కెసిఆర్ నాయకత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో వచ్చిన నిధులే ఇంకా ఖర్చు పెట్టడం లేదని ఆరోపించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి 18నెలలు గడుస్తున్న ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయించలేదని, తన హయాంలో చేపట్టిన పనులకు పోటీపడి శంకుస్థాపనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పాత నిధులు ఖర్చు చేయలేని స్థితిలో ప్రస్తుత ఎమ్మెల్యే ఉన్నారని ఆరోపించారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస మునుగోడు ప్రాంత అభివృద్ధిపై లేదని ఆరోపించారు. ఎప్పుడు వర్షం వస్తుందో అర్థం కాని పరిస్థితిలో రైతన్నలు ఆగమాగం అవుతుంటే, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి 20రోజులు గడిచిన ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చౌటుప్పల్ మున్సిపల్ వ్యాప్తంగా నీటిని అందించామని, ప్రస్తుతం ప్రజలకు నీరు అందించడంలో విఫలమై, టాంకర్ల ద్వారా నీటిని పోయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కమిషన్ల ప్రభుత్వమని, 30శాతం కమిషన్ ఇస్తేనే పనులు చేస్తున్నారని, భజన చేసే వాళ్ళకే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాలు కాంగ్రెస్ కార్యాలయాలుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో శిక్ష అనుభవించక తప్పదన్నారు. కాలుకు ముల్లు విరిగితే నోటితో తీసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమని, కెసిఆర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని, నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, నాయకులు పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, కొత్త పర్వతాలు యాదవ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, ఉడుగు మల్లేష్ గౌడ్, తూర్పునూరి నరసింహ గౌడ్, తాడూరి పరమేష్, ఢిల్లీ మాధవరెడ్డి, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, ఎం దయాకరాచారి, అల్మాస్పేట కృష్ణ సుర్వి మల్లేష్ గౌడ్, బాతరాజు యాదయ్య, చేవగోని మహేష్ తదితర బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ

**వెల్దండ, మే 17 (జనంసాక్షి) :** వెల్దండ మండల కేంద్రంలోని కరాటే మాస్టర్ చందు ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు ర్యాలీ భారత సైనికులారా మేమంతా మీ వెంటే ఉంటామని కరాటే విద్యార్థులను ఉంటాము భారత్ పాకిస్థాన్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులు మురళి నాయక్, సచిన్ యాదవ్‌లకు వెల్దండ మండల కేంద్రంలో కరాటే విద్యార్థులు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతీయ జెండాలతో పార్టీలకు అతీతంగా భారీ ర్యాలీ నిర్వహించి సైనికులకు తాము ఉన్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ కరాటే మాస్టర్ చందు మాట్లాడుతూ.. యుద్ధ సమయంలో భారతీయులంతా సైనికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో సరైన బుద్ధి చెబుతుందని అన్నారు. పాకిస్తాన్ లో టెర్రరిస్ట్ లు చనిపోతే పాకిస్తాన్ ప్రభుత్వం వాళ్ల సైన్యం ఉగ్రవాదులకు లాంచనప్రాయంగా అంత్యక్రియలు నిర్వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల కంటే టెర్రరిస్టులకే ఎక్కువ ప్రధాన్యత ఇస్తుందని అన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ క్షమాపణ చెప్పి వెనకడుగు వేయకపోతే భారత్ చేతిలో కుక్కచావు చావడం ఖాయం అని అన్నారు. భారతదేశం ఎవరి జోలికి వెళ్ళదని తన జోలికి ఎవ్వరు వచ్చిన వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలిపారు. యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్, సచిన్ యాదవుల మరణం వృధా కానివ్వమనీ దానికి ప్రతి కారం కచ్చితంగా భారత సైన్యం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ తిరుపతయ్య గుద్దేటి కిష్టాల్ సడమోని గోపాల్ మట్ట రఘు గౌడు దేవేందర్ రెడ్డి మట్ట భరత్ గౌడ్ శిరసనగండ్ల శేఖర్ బిట్టు సైదులు కుప్పగండ్ల మల్లేష్ యాదయ్య కరాటే విద్యార్థులు కిషోర్ వంశీ ప్రవీణ్ రామ్ లక్ష్మణ్ సుధాకర్ పూజ కీర్తి స్నేహ రాఘవేందర్ ప్రఖ్యాంతు దత్తు అంజలి నాగరాజ్ దాసరి అఖిల్ శివ నాని తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్‌లోనే శేరిలింగంపల్లిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా...

**శేరిలింగంపల్లి, మే 17 (జనం సాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్దడంద్వారా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ భరోసాను వ్యక్తం చేశారు. ఈ మేరకు మియాపూర్ డివిజన్ పరిధి గాయత్రి నగర్ కాలనీ నుండి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు 1.50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన వరద నీటి(స్ట్రామ్ వాటర్ డ్రెయిన్) కాలువల పనులను శనివారం మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుటకు మౌలిక వసతుల కల్పనకై కోట్ల రూపాయల నిధులు వెచ్చించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంసంసిద్ధంగా ఉందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి విభాగం డిఈ దుర్గాప్రసాద్, ఇన్స్పెక్టర్ నవీన్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మర్రపు గంగాధర్ రావు, తిరుపతి, శ్రీనివాస్ చౌదరి, నరేష్ నాయక్, శివ ముదిరాజ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు రైతులకు సూచనలు చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

**భువనగిరి కలెక్టరేట్, మే 17 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలోఅధికారులు అప్రమత్తంగా ఉండి, రైతులకు సూచనలు చేయాలని, కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం వలిగొండ మండలంలోని ప్రొద్దుటూరు, ఏదులగూడెం, సహకార సంఘం , నాతాళ్ల గూడెం ఐకెపి దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, నిర్వహణ తీరును పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణం తరలించాలి అన్నారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాలలో ఉంచ కూడదని వెంటనే తరలించాలని ,కలెక్టర్ అధికారుల ఆదేశించారు. రైతుల ధాన్యం తడిసి పోకుండా ముందస్తుగా టార్పాలిన్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్యాడి క్లీనర్ ల తో ధాన్యాన్ని శుభ్రపరిచి నాణ్యత గల ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు సూచించారు. రైతు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించాలని, సదరు రైతు వివరాలతో రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ట్రక్ షీట్ కట్ చేయడం ఓ పి ఎం ఎస్ లో నమోదు చేయటం వెంట వెంటనే జరిగి పోవాలని ఏమాత్రం అశ్రద్ధ తగదు అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది రైతులు తదితరులు ఉన్నారు.

## పగలు రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- లింగగిరి గ్రామంలో ఇసుకాసురులు
- జిల్లా కలెక్టర్ హెచ్చరికలు బేఖాతరు ఇసుక దందాకు అండగా ఉన్న అధికారులెవ్వరు..?

**హుజూర్‌నగర్ రూరల్, మే 17 (జనం సాక్షి) :** జిల్లాలో ఇసుక అక్రమంగా రవాణా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని,గుర్తించిన ఇసుక రీచ్ ద్వారా మాత్రమే ఇసుక రవాణా జరగాలని ఇసుక అక్రమంగా తరలి పోకుండా ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సాక్షాత్తు కలెక్టర్ తేజస్ నందన్ పవార్ చేసిన హెచ్చరిక లను కూడా బేఖాతారు చేస్తూ సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం లింగగిరి గ్రామంలో పగలు రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. శనివారం మిట్ట మధ్యాహ్నం సర్వారం వాగు నుండి బాహటంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఇసుకను తరలించి ప్రకృతి సంపదలను కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పగలు రాత్రి తేడా లేకుండా యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా సంబందిత శాఖల అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కార్పొరేషన్ ముట్టడి విజయవంతం

- భారీగా తరలివచ్చిన నగరవాసులు
- ప్రభుత్వంపై వెల్లువెత్తిన వ్యతిరేకత

**ఖమ్మం, మే 17 (జనం సాక్షి) :** ఖమ్మం నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. ఖమ్మంలోని 60 డివిజన్ ల నుండి ప్రజలు వేలాదిగా ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శులు, నాయకులు గత వారం రోజుల నుండి ఖమ్మంలో గడపగడపకు వెళ్లి కార్యక్రమ ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, పింఛన్ పెంపుదల, ఖమ్మం నగరంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన ముట్టడి ఉద్దేశాన్ని ఖమ్మం నగరవాసులు స్వాగతించినట్లయింది. ఖమ్మం నలుమూలల నుండి ప్రజల నుండి విశేష స్పందన రావడంతో వారిని తరలించేందుకు పార్టీ డివిజన్ కమిటీ బస్సులను ఏర్పాటు చేసింది. వీరితోపాటు స్వచ్ఛందంగా అనేకమంది ప్రజలు ముట్టడి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ ముట్టడి కార్యక్రమం ప్రభుత్వ తీరుపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి, నిరసనను తేటతెల్లం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమం కావడంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు చేసిన కృషి ఫలించినట్లు కార్యక్రమానికి హాజరైన ప్రజలను చూస్తే అర్థమైంది. సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి జబ్బార్, శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు, నవీన్ రెడ్డి, బోడపట్ల సుదర్శన్, నాయకులు జె వెంకన్న బాబు తదితరులు కార్యక్రమం విజయవంతానికి ముందు వరుసలో కృషి చేశారు.

## ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలో భూ సమస్య పరిష్కారం

- ధరణి వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు
- భూ భారతి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**సంగారెడ్డి కొండాపూర్, మే 17 (జనం సాక్షి) :** ఆగస్టు 15నాటికి రాష్ట్రంలో భూ సమస్యలు పరిష్కారమవుతాయని రెవిన్యూ గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కొండాపూర్ లో నిర్వహించిన భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సమీక్ష సమావేశానికి రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా, జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కా ర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీ ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రేడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి రైతులకు పూర్తిస్థాయిలో భూభారతి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రైతులకు భూ సమస్యలు పకడ్బందీగా నిర్వహించడానికి లైసెన్స్ సర్వేయర్ విధానాన్నీ త్వరలోనే అమలు చేస్తామన్నారు. భూ లావాదేవీలు సమర్థవంతంగా జరిగేలా కొత్త విధానం తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఎమ్మార్వో స్థాయి అధికారులతో వారి టీం మీ గ్రామానికి వస్తుందని భూభారతికి చట్టానికి సంబంధించి రెండు రోజుల ముందే మీకు దరఖాస్తు ఫారాలు ఇస్తారని మీ సమస్యలు ఇచ్చేసి అధికారులకు ఇస్తే మీ సమస్యను మీ గ్రామంలోని పరిష్కరించే విధంగా చూడడం జరుగుతుందన్నారు. రైతులెవరు భూభారతి చట్టం గురించి అభ్రద్రతకు గురికా వద్దన్నారు. మీరు నచ్చిన మెచ్చిన చట్టమే భూభారతి చట్టం అన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ అంటేనే భూ పోరాటాల చరిత్ర అని,దున్నేవాడిదే భూమి అనే పదాన్ని చాలా సంవత్సరాలుగా వింటూనే ఉన్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నూతన చట్టాన్ని తీసుకొచ్చి పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసిందన్నారు. గత ప్రభుత్వం ధరణి తీసుకొచ్చి రైతులను గోస పెట్టిందని అన్నారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయని భావిస్తున్నాన్నారు.ధరణి పోర్టల్ ఉన్న ఇబ్బందులను సరి చేసే విధంగా కొత్త భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఆత్మకమిటీ చైర్మెన్ వై.ప్రభు, సిడిసి చైర్మెన్ గడీల రాంరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, మనోజ్ రెడ్డి, గౌరిరెడ్డి శ్రీధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, నర్సింలు, సునీల్, ప్రభాకర్, ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# ఉనికిని కాపాడుకోవడం కోసమే అనుచిత వ్యాఖ్యలు

- కొన్ని వేల కుటుంబాలకు దేవుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమే
- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

**చౌటుప్పల్, మే 17 (జనంసాక్షి) :** కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తన ఉనికిని కాపాడుకోవడం కోసమే మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ ప్రజా విశ్వాసం కోల్పోయిన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని విమర్శించే హక్కు లేదన్నారు. గతాన్ని గుర్తు తెచ్చుకోవాలని కూసుకుంట్లకు హితవు పలికారు. దశాబ్ద కాలంగా చేసిన అక్రమాలు, దుర్మార్గాలు మరిచిపోయి, సత్య హరిశ్చంద్రునిలా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. పరిశ్రమల నుంచి రాజగోపాల్ రెడ్డి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించడం సరైనది కాదన్నారు. ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని, మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు వదిలేసిన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి పల్లి కాలువలను సొంత నిధులతో పూర్తి చేసిన వ్యక్తి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చింతకుండూరు మాజీ ఉప సర్పంచ్ చంద్రయ్య పై దాడి చేసి చనిపోయాడని వెళ్లిపోయారని, బీఆర్ఎస్ నాయకులే దాడి వెనుక ఉండి చేస్తున్నారా అని ప్రశ్నించారు. లా అండ్ ఆర్డర్ చేతిలోకి తీసుకుంటే, దుర్వినియోగం అయితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. గత నెలలో 13వ తేదీన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేశానని, ప్రమాణ స్వీకారం చేసినట్టు నుంచి అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నానని, హమాలీల కొరత ఉంటే వెంటనే పెంచామని, తూకాల్లో మోసాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని, పట్టాలు తక్కువగా ఉంటే జాయింట్ కలెక్టర్ కు పట్టాలు కావాలని విన్నవించామని, 300పట్టాలు మంజూరయ్యయన్నారు. రైతు నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చానని, రైతు కష్టాలు తనకు తెలుసన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వెండి రాజు మాట్లాడుతూ ఊర చెరువు అభివృద్ధి కోసం దివీస్ పరిశ్రమ రూ.15కోట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చిందని, సర్వే చేశారు కానీ వెనక్కి వెళ్లడానికి కారణం ఆరోపణ చేసిన వారికి తెలియాలన్నారు. నాగులకుంట సుందరీకరణకు రూ.1.20కోట్లు కేటాయిస్తామని దివిస్ పరిశ్రమ ముందుకు వచ్చిందని, కానీ నిధులు మాత్రం ఇవ్వలేదని, దివిస్ పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తే తెలుస్తుందన్నారు. అమృత్ పథకం కేంద్రానికి సంబంధించినదని, కూసుకుంట్లకు అమృత్ నిధులకు సంబంధమేంటని ప్రశ్నించారు. మున్సిపాలిటీని నాలుగు భాగాలుగా చేసి అమృత్ పథకం నిధులతో పనులు చేయిస్తున్నామన్నారు. లకారం చెరువు నుంచి తంగడపల్లి చెరువుకు నీళ్లు మళ్లించే ప్రయత్నం చేస్తున్నామని, త్వరలోనే తుదిదశకు వచ్చే అవకాశం ఉందన్నారు.

### కూసుకుంట్ల.. ఒళ్ళు జాగ్రత్త

కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడేటప్పుడు ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకోవాలని కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ ఆరోపించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేసి మునుగోడుకు ఉప ఎన్నిక వచ్చే వరకు మునుగోడు అభివృద్ధి జరగలేదన్నారు. అప్పటి ప్రజా ప్రతినిధులు ప్రజలకు ముఖం చాటు వేసిన సమయంలో రాజగోపాల్ రెడ్డి రాజీనామా వారిని గట్టెక్కిచ్చిందన్నారు. మునుగోడు ప్రజల కాళ్ల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకొచ్చాడన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా మునుగోడులో విద్యుత్ లో వోల్టేజ్ లేకుండా పనులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా రాజగోపాల్ రెడ్డి స్థానిక ముఖ్యులను సిఎండి కార్యాలయానికి తీసుకెళ్లారన్నారు. విద్యుత్ లో మునుగోడును పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ, రివ్యూ చేస్తూ ఎప్పటికప్పుడు అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు.

మునుగోడులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సొంత నిధులు రూ.1.20కోట్లతో ఇంద్ర భవనంలా నిర్మించారన్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తన హయాంలో ప్రజా ప్రతినిధులను ఏ విధంగా ఇబ్బందులకు గురి చేశారు, అక్రమంగా కేసులు పెట్టి ఎలా చిత్రహింసలకు గురిచేశారో అందరికీ తెలుసన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పుట్టకతోనే ధర్మం చేసే వ్యక్తి అని, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పుట్టుకతోనే దోచుకునే వ్యక్తి అని ఆరోపించారు. తనలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం కాంగ్రెస్ మనుషులకు తెలియదని ఆరోపించారు. 2, 3రోజుల్లో పేపర్లతో సహా బయట పెడతామని, ప్రస్తుతం బీఆర్ఎస్ ఇంచార్జ్ ఉంటుందో, ఊడుతుందో, ఎమ్మెల్యే టికెట్ వస్తుందో, రాదో చూసుకోమని హితవు పలికారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్ గౌడ్, ఎండి గౌస్ ఖాన్,మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ ,మాజీ కౌన్సిలర్లు, బండమీద మల్లేశం,కొయ్యడ సైదులు, సందగాళ్ళ సతీష్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి,కాంశెట్టి భాస్కర్, బాబా షరీఫ్,బోడిగే బాలకృష్ణ, బొబ్బిళ్ళ మురళి నాయకులు బక్క శ్రీనాథ్, మొగుదల రమేష్ గౌడ్, కంచరకుంట్ల రాంరెడ్డి, బొంగు జంగయ్య, ఎండి హనుమ్ భాయ్, అర్థ వెంకటరెడ్డి,ఉదరి శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## కార్వీ ఖాతాదార్లు 2 లోగా క్లెయిమ్ చేయాలి

- సెబీ స్పష్టీకరణ

దిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) ఖాతాదార్లు తమ క్లెయిములను జూన్ 2వ తేదీ లోగా దాఖలు చేయాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ స్పష్టం చేసింది.తన ఖాతాదార్ల షేర్లు, నిధులు దుర్వినియోగం చేయడం, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఎగవేయడం, ఆ నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం.. వంటి నష్టదాయక చర్యలకు పాల్పడిన కార్వీ స్టాక్ బ్రోకింగ్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) 2020లో 'డిఫాల్టర్' గా ప్రకటించిన విషయం విదితమే. అదే సమయంలో కేఎస్‌బీఎల్ స్టాక్ బ్రోకింగ్ లైసెన్సును సెబీ రద్దు చేసింది. ఆ తర్వాత కార్వీ

# భారత్ దెబ్బకు టర్కీ కుదేలు

- పతనం దిశగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ..
- పెళ్లిళ్లు క్యాన్సిల్, షేర్లు డౌన్
- ఊపందుకున్న బాయికాట్ టర్కీ నినాదం

**భారత్‌పై పాక్ చేసిన యుద్ధంలో ఆ దేశం నుంచి దూసుకొచ్చిన దాదాపు 600 డ్రోన్లను సమర్థవంతంగా నేల కూల్చినట్లు భారత రక్షణశాఖ పేర్కొంది. అయితే ఈ డ్రోన్లు టర్కీ దేశం.. పాకిస్థాన్ కు సరఫరా చేసింది. దీంతో టర్కీపై భారత్ లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ నేపథ్యంలోనే బాయికాట్ టర్కీ నినాదం దేశవ్యాప్తంగా ఊపందుకుంది. టర్కీ ఉత్పత్తులను భారత్ లో బ్యాన్ చేయాలని పలు వ్యాపార సంఘాలు తీర్మానించాయి. అంతేకాక పకడ్బందీగా అమలు చేశాయి. అటు భారత్ ఉత్పత్తులను కూడా టర్కీకు ఎగుమతి చేయకుండా నిలిపివేశాయి. ఈ క్రమంలో టర్కీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీంతో బాయికాట్ టర్కీ ప్రారంభించిన రెండు రోజులకే టర్కీ ఆర్థిక వ్యవస్థ భారీగా పతనమైనట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాక మేకిన్ ఇండియా, ఏవియేషన్, మెట్రో రైలు.. తదితర రంగాల్లో టర్కీకి చెందిన పలు కంపెనీలు పనిచేస్తు న్నాయి. ఇప్పుడు వీటన్నింటినీ రద్దు చేసేందుకు భారత్ సిద్ధమైంది. దీంతో టర్కీ తలపట్టుకుంది. పాకిస్థాన్ కు సాయం చేసి పెద్ద తప్పు చేశామని అనుకుంటోంది.**

**న్యూఢిల్లీ:**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడులకు కౌంటర్ గా పాకిస్థాన్ భారత్ లోని కాశ్మీర్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాలపై డ్రోన్లతో దాడి చేసింది.పాక్ నుంచి దూసుకొచ్చిన దాదాపు 600 డ్రోన్లను సమర్థవంతంగా నేల కూల్చినట్లు భారత రక్షణశాఖ పేర్కొంది. అయితే ఈ డ్రోన్లు టర్కీ దేశం.. పాకిస్థాన్ కు సరఫరా చేసింది. దీంతో టర్కీపై భారత్ లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ నేపథ్యంలోనే బాయికాట్ టర్కీ నినాదం దేశవ్యాప్తంగా ఊపందుకుంది. టర్కీ ఉత్పత్తులను భారత్ లో బ్యాన్ చేయాలని పలు వ్యాపార సంఘాలు తీర్మానించాయి. అంతేకాక పకడ్బందీగా అమలు చేశాయి. అటు భారత్ ఉత్పత్తులను కూడా టర్కీకు ఎగుమతి చేయకుండా నిలిపివేశాయి. ఈ క్రమంలో టర్కీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీంతో బాయికాట్ టర్కీ ప్రారంభించిన రెండు రోజులకే టర్కీ ఆర్థిక వ్యవస్థ భారీగా పతనమైనట్లు వార్తలు వస్తున్నాయి.అంతేకాక మేకిన్ ఇండియా, ఏవియేషన్, మెట్రో రైలు.. తదితర రంగాల్లో టర్కీకి చెందిన పలు కంపెనీలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు వీటన్నింటినీ రద్దు చేసేందుకు భారత్ సిద్ధమైంది. దీంతో టర్కీ తలపట్టుకుంది. పాకిస్థాన్ కు సాయం చేసి పెద్ద తప్పు చేశామని అనుకుంటోంది. అంతేకాక టర్కీ బ్రాండ్లను సైతం నిషేధించాలంటూ దేశవ్యాప్తంగా ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో టర్కీ తయారుచేసే వస్త్రాలను ప్రముఖ రిటైల్ సంస్థలు నిలిపివేశాయి. ఇది

టర్కీ ఆర్థిక వ్యవస్థకు బిగ్ షాక్ అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.పాకిస్థాన్‌కు సాయం చేసిన టర్కీకి మరో రూపంలోనూ తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదురైంది. ఆఖరికి టర్కీలో పెళ్లిళ్లు కూడా ఆగిపోయినట్లు సమాచారం. 2024లో టర్కీలో భారతీయ వివాహాల సంఖ్య 50 గా ఉంది. టర్కీలో భారతీయులు వివాహాలు అంగరంగ వైభవంగా చేసుకుంటారు. ఈ పెళ్లిళ్ల ద్వారా ఏటా టర్కీకి 140 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోంది. అయితే ఇప్పుడు బాయికాట్ టర్కీ నినాదంతో అక్కడి వివాహాలు నిలిచిపోయాయి. దీంతో టర్కీకి మిలియన్ డాలర్లు లాస్ గా చెప్పవచ్చు. అంతేకాక టర్కీకి చెందిన సెల్ బీ అనే విమానయాన సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని భారత్ ఉపసంహరించు కుంది. దీంతో ఈ కంపెనీ షేరు విలువకు బాగానే దెబ్బ పడింది. భారతీయ విమానాశ్రయాల్లో సరకుల రవాణాతో పాటు ఇతర కార్గో సేవల్ని అందించిన ఈ సంస్థతో ఉన్న ఒప్పందాన్ని భారత్ తాజాగా రద్దు చేసుకుంది. ఈ సమయంలోనే అదానీ సంస్థ సైతం సెల్ బీతో తాను చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో.. ఈ సంస్థకు చెందిన షేర్లు తీవ్రంగా పడిపోయాయి.

## తుర్కియేతో తెంచేసుకుందాం

*అజియో, మింత్రాలో ఆ దేశ బ్రాండ్ల విక్రయాలు బంద్*

*పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించిన తుర్కియే దేశంపై భారత్‌లోని అన్ని వర్గాలు మండిపడుతున్నాయి. ఆ దేశానికి చెందిన ఉత్పత్తులను బహిష్కరించాలని 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ సంస్థలు మింత్రా, అజియో.. ఆ దేశ బ్రాండ్ల అమ్మకాలను నిలిపివేశాయి. ఆయా ప్లాట్‌ఫామ్‌లలో అక్కడి బ్రాండెడ్ దుస్తులను చూపించడం ఆపేశాయి.బాయ్‌కాట్ తుర్కియే నినాదం జోరందుకున్న క్రమంలో వ్యాపారులు ఆ దేశంతో వర్తక, వ్యాపారాలను నిలిపేస్తున్నారు. గత వారం నుంచి ఇరు దేశాల మధ్య దౌత్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మింత్రా అధికారి వెల్లడించారు. రిలయన్స్ కూడా తన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ అజియోలో విక్రయిస్తున్న కోటాన్, ఎల్‌సీ వైకికి, మావి వంటి తుర్కిష్ దుస్తుల బ్రాండ్ల అమ్మకాల్ని ఆపేసింది. ఆ దేశంలో సంస్థ కార్యాలయాన్ని కూడా మూసివేసినట్లు రిల యన్స్‌కు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు.పాకిస్థాన్‌కు మద్దతుగా నిలి చిన తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలతో పర్యాటకం సహా అన్నిరకాల వ్యా పార సంబంధాలు తెంచుకోవాలని దేశీయ వర్గాలు ఇప్పటికే నిర్ణయిం చాయి. అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) సైతం ఆ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించింది. భారత ఎగుమతిదార్లు, దిగుమతిదార్లు, వ్యాపార వర్గాలు సైతం ఆ రెండు దేశాల్లోని కంపెనీలతో ఎటువంటి సంబంధాలూ పెట్టుకోరని తెలిపింది. విమానాశ్రయాల్లో భద్రతా పరమైన సేవలందిస్తున్న తుర్కియే సంస్థ సెలెబీ ఏవియేషన్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్‌ను ఇదివరకే కేంద్రం రద్దు చేసింది. దీంతో ఇస్తాంబుల్‌లో కంపెనీ షేర్లు క్రమంగా పతనమవుతున్నాయి.*

## జెన్సోల్‌లో మరో వికెట్ డౌన్.. సీఎఫ్ఓ రాజీనామా

దిల్లీ: జెన్సోల్ ఇంజనీరింగ్‌లో మరో కీలక వికెట్ పడింది. కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జబీర్మహెంది మొహమ్మద్రాజా అగా తన పదవికి రాజీనామా చేశారు.తక్షణమే తన పదవి నుంచి వైదొలుగుతున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. కంపెనీ ప్రమోటర్లు అన్‌మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ తమ పదవులకు రాజీనామా చేసిన కొన్ని రోజులకే తాజా పరిణామం చోటుచేసుకుంది.విద్యుత్తు వాహనాల కొనుగోళ్ల కోసం కంపెనీ పేరిట తీసుకున్న రుణాలను, సొంత అవసరాలకు ఉపయోగించుకున్నారనే ఆరోపణలపై ప్రమోటర్లపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో వివిధ నియంత్రణ సంస్థలు విచారణ జరుపుతున్నాయి. దీంతో ప్రమోటర్లు తమ పదవుల నుంచి వైదొలిగారు. ప్రస్తుత పరిస్థితుల్లో తన విధులు నిర్వర్తించడానికి శారీరక, మానసిక ఆరోగ్యం సహకరించడం లేదని పేర్కొంటూ సీఎఫ్ఓ కూడా వైదొలిగారు.మరోవైపు జెన్సోల్ ఇంజనీరింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటూ వచ్చిన ఆ కంపెనీ షేర్లు.. మళ్లీ రాణిస్తుండడం గమనార్హం. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత గడిచిన రెండు-మూడు వారాల పాటు వరుసగా లోయర్ సర్క్యూట్‌లను తాకిన ఆ కంపెనీ షేరు.. గడిచిన నాలుగు రోజులుగా అప్పర్ సర్క్యూట్ వద్ద ముగుస్తోంది. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ స్టాక్ రూ.65.56 వద్ద కొనసాగుతోంది. ఆల్‌టైమ్ గరిష్ఠమైన రూ.1329తో పోలిస్తే ఇప్పటి వరకు దాదాపు 95.30 శాతం మేర విలువ క్షీణించింది.

## దలాల్ స్ట్రీట్‌లో తగ్గిన ఐపీఓల సందడి

దలాల్ స్ట్రీట్‌లో ఐపీఓల సందడి కాస్త తగ్గింది. మే నెలలో ఇప్పటివరకు మెయిన్ బోర్డ్ నుంచి ఒక్క కంపెనీ పబ్లిక్ ఇష్యూకి రాలేదు. కేవలం ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి మాత్రమే పలు సంస్థలు ఐపీఓకి వచ్చాయి.అయితే వచ్చే వారంలో మెయిన్ బోర్డ్ నుంచి రెండు సంస్థలు ఐపీఓకు రానున్నాయి. వాటితో పాటు ఎస్ఎంఈ విభాగం నుంచి మూడు కంపెనీలు దలాల్ స్ట్రీట్‌లో సందడి చేయనున్నాయి. గుజరాత్‌లోని ప్రముఖ టెక్స్‌టైల్ తయారీ సంస్థ బోరోనా వీవ్స్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. దీని సబ్‌స్క్రిప్షన్ మే 20న ప్రారంభం కానుంది.

# లిబియాపై ట్రంప్ కన్ను

- ఆ దేశానికి 10 లక్షల మంది పాలస్తీనియన్ల తరలింపు..
- అమెరికా అధ్యక్షుడి మరో వ్యూహం!

**జనంసాక్షి:**గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న వరుస భీకర దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఈ క్రమంలో గాజాలోని 10 లక్షల మంది పాలస్తీనియన్లను శాశ్వతంగా లిబియాకు పంపించడానికి ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విషయంపై లిబియా నాయకత్వంతోను యూఎస్ సంప్రదింపు లు జరిపినట్లు సమాచారం. ఇందుకు లిబియా అంగీకరిస్తే బదులుగా అమెరికా బిలియన్ డాలర్ల నిధులు విడుదల చేస్తుందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. గాజాలోని పాలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్ తాజాగా పశ్చిమాసియా పర్యటనలో భాగంగా మాట్లాడారు. గాజాను అమెరికా అధీనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించిన రెండు రోజుల అనంతరం ఈ ప్రకటన వెలువడింది.ఈ విషయంపై ఇంకా అమెరికా- లిబియాల మధ్య తుది ఒప్పందం కుదరలేదని.. ఇరుదేశాల మధ్య చర్చల గురించి ఇజ్రాయెల్‌కు ట్రంప్ తెలియజేశారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా దీనిపై యూఎస్ ప్రభుత్వ ప్రతినిధి మాట్లాడుతూ ఈ నివేదికలు అవాస్తవమన్నారు. పాలస్తీనియన్లను తరలించే పరిస్థితి లిబియాలో లేదని అన్నారు. గాజాలో ఉద్రిక్తతల వల్ల నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ట్రంప్ గతంలో ప్రతిపాదించినప్పటికీ.. ఆ దేశాలు దానిని వ్యతిరేకించాయని తెలిపారు.అమెరికా గాజాను స్వాధీనం చేసుకోవాలనుకుంటుందని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ అనేకసార్లు పేర్కొన్నారు. గాజాను అమెరికా స్వాధీనం చేసుకొని.. ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తుందని అన్నారు. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే.. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చని తెలిపారు. తాజాగా పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. "గాజా ఫొటోలను చూశాను. అక్కడ ఒక్క భవనమూ లేదు. అన్నీ కుప్పకూలాయి. ఆ శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. గాజాను అమెరికా తీసుకోవాలని అనుకుంటున్నాను. స్వేచ్ఛా మండలంగా దాన్ని మలచాలి. గాజాకు సంబంధించి నాకు మంచి ఆలోచనలు ఉన్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ అందించిన ఏఐ టెక్నాలజీని ఇజ్రాయెల్ గాజా ప్రజలకు హాని తలపెట్టడానికి వినియోగించిందని వస్తున్న ఆరోపణలపై మైక్రోసాఫ్ట్ కంపెనీ స్పందించింది. గాజా యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ సైన్యానికి అధునాతన ఏఐ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్ సేవలను విక్రయించామని.. బందీలను గుర్తించడం, వారిని రక్షించడానికి మాత్రమే వీటిని ఇజ్రాయెల్‌కు అందించామని తెలిపింది. ఇప్పటివరకు ఆ టెక్నాలజీ, అజూర్ ప్లాట్‌ఫామ్‌లను గాజా ప్రజలకు హాని తలపెట్టడానికి వినియోగించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

## ఆ అధికారి 'బ్యాడ్ కాప్'..

- హత్య కుట్రపై మండిపడిన ట్రంప్

**జనంసాక్షి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను చంపేస్తామంటూ ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ జేమ్స్ కామీ బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ హత్య కుట్ర తాజాగా ట్రంప్ స్పందించారు. అతను ఒక బ్యాడ్ కాప్ అంటూ ట్రంప్ కామీపై మండిపడ్డారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'జేమ్స్ కామీకి దాని అర్థం కచ్చితంగా తెలుసు. అతను హత్య చేయాలనుకున్నాడనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. అతను సమర్థుడు కాకపోవచ్చు. కానీ దాని అర్థం తెలుసుకునే తెలివి ఉంది. కామీ దేశాధ్యక్షుడిని చంపేందుకు పిలుపునిచ్చాడు. అతడు ఒక డర్టీ కాప్ (చెడ్డ పోలీస్)' అని ట్రంప్ పేర్కొన్నారు.జేమ్స్ కామీ '86 47' అనే పదాలతో ఇన్‌స్టాలో ఒక పోస్టు పెట్టి, డిలీట్ చేశారు. 47వ అధ్యక్షుడిని చంపడం అనే అర్థం వచ్చేలా ఆ రహస్య కోడ్ ఉందని అధికారులు తెలిపారు. దీంతో అతడి చర్యలపై అమెరికా సీక్రెట్ సర్వీస్ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. తన పోస్ట్‌పై కామీ స్పందిస్తూ.. తాను బీచ్‌వాక్ చేస్తున్న సమయంలో చూసిన షెల్‌ల చిత్రాన్ని పోస్ట్ చేశానని తెలిపారు. ఆ పోస్ట్‌ను అధికారులు తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. ఆ నంబర్లను హత్యలు చేయడానికి ఉపయోగిస్తారనే విషయం తనకు తెలియదన్నారు. అమెరికా అధ్యక్షుడిని చంపాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టంచేశారు. పోస్ట్ పెట్టాక తనపై అసంబద్ధమైన ఆరోపణలు రావడంతో దాన్ని డిలీట్ చేసినట్లు వెల్లడించారు. ఇక, దీనిపై ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ స్పందిస్తూ.. కామీ పోస్టుపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సీక్రెట్ సర్వీస్ అధికారులు కామీని తన పోస్టుపై ప్రశ్నించినట్లు అక్కడి మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా.. గతంలోనూ ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా పెన్సిల్వేనియాలో ఏర్పాటుచేసిన ప్రచార కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. ఆ సమయంలో ఒక దుండగుడు కాల్పులు జరపగా.. ట్రంప్ కుడి చెవిపై గాయమైంది. అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది వేగంగా స్పందించడంతో ఆయన్ను కాపాడగలిగారు. తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఒక వ్యక్తి ఫెన్సింగ్ వద్దకు తుపాకీతో రావడాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. అనంతరం కాల్పులు జరిపి అతడిని అరెస్టు చేశాయి. ఆ తర్వాత మరోసారి ట్రంప్ పాల్గొన్న ఒక సమావేశానికి దగ్గరగా ఉన్న ఒక కన్వెన్షన్ సమీపంలో మాస్క్ ధరించిన ఒక సాయుధ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తి వద్ద ఉన్న బ్యాగులో %ూాఖ%-47 తుపాకీని మోసుకెళ్లినట్లు ఫాక్స్ న్యూస్ పేర్కొంది. బ్యాగ్‌లో తూటాల మ్యాగజైన్‌ను కూడా గుర్తించినట్లు తెలిపింది. దీంతో ట్రంప్ భద్రతను భారీగా పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

## భారత్, పాక్ శాంతి చర్చలు పునఃప్రారంభించాలి

విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు కోరుకుంటున్నారని తెలిపింది.భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు తమ మద్దతు పాక్‌కే అని తెగేసి చెప్పిన చైనా ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణను మాత్రం సమర్థిస్తున్నట్లు పేర్కొంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ఈ విషయంపై భారత్ స్పందిస్తూ..పాకిస్థాన్‌తో చర్చలు ద్వైపాక్షికంగానే జరుగుతాయని, ఉగ్రవాదంపై మాత్రమే చర్చలుంటాయని స్పష్టం చేసింది. మరో వైపు భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. శాంతి కోసం దీనిని ప్రతిపాదిస్తున్నామని, అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పారు.

## బిన్‌లాడెన్ హతం తరహాలో ఆపరేషన్ సిందూర్

**ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు**

**జనంసాక్షి:**ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా హతమార్చిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాక్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరివేసిందని వ్యాఖ్యానించారు. 2011, మే 2న అమెరికా దళాలు ఇదేవిధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా మాట్లాడారు."ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక బెంచ్ మార్క్‌ను నిర్ణయించింది" అని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్రమూకలకు మాత్రమే నష్టం వాటిల్లిందని అన్నారు.అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై సెప్టెంబర్9/11 అల్‌ఖైదా జరిపిన ఉగ్ర దాడిలో సుమారు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మందిని పొట్టన పెట్టుకున్న అల్‌ఖైదా అధినేత లాడెన్‌ను 2011 మే 2న అమెరికా దళాలు హతమార్చిన విషయం తెలిసిందే.

## పాక్‌కు సమాచారం చేరవేస్తున్న హరియాణా విద్యార్థి అరెస్టు

**జనంసాక్షి:**పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై హరియాణాలో ఓ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పటియాలలోని ఖల్సా కళాశాలలో దేవేంద్ర సింగ్ ధిల్లాన్ పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడు. దేవేంద్రసింగ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ దర్యాప్తునకు పంపించాం. డబ్బు లావాదేవీలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నాం. దీనిపై పూర్తి దర్యాప్తు కొనసాగుతోంది. ఇక, ఇటీవల పాకిస్థాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్న ఒక వ్యక్తిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్న రవీంద్రకుమార్ ఓ అమ్మాయి వలపు వలలో చిక్కి.. భారత సైన్యం ఆయుధాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్ అధికారులకు చేరవేశాడు. దీంతోపాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు దీంతోపాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## మోకాలిపై కూర్చొని దేశాధినేత స్వాగతం..

### ఇటలీ ప్రధాని మెలోనీ ఫిదా

**జనంసాక్షి:**అల్బేనియా రాజధాని టిరానాలో ఐరోపా రాజకీయ కమ్యూనిటీ సదస్సు జరిగింది. ఈ సమావేశానికి యూరోపియన్ యూనియన్ దేశాల నేతలు హాజరయ్యారు.అయితే, ఈ సదస్సుకు విచ్చేసిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అల్బేనియా దేశాధినేత ఎడీ రమా స్వాగతం పలికిన తీరు ఆసక్తికరంగా మారింది. మోకాలిపై కూర్చొని ఎడీ ఆమెను ఆహ్వానించారు.మెలోనీ కారు దిగి వేదిక వద్దకు వస్తుండగా.. అల్బేనియా ప్రధాని ఎడీ మోకాలిపై కూర్చొని చేతులు జోడించి నమస్కారం చెబుతూ స్వాగతం పలికారు. వర్షంలోనూ ఆయన పలికిన ఈ ఆత్మీయ ఆహ్వానానికి మెలోనీ ఫిదా అయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.కాగా.. మెలోనీ తన 'ఇటాలియన్ సిస్టర్' అని చెప్పే ఎడీ రమా ఆమె ఎప్పుడు కన్పించినా సరే ఇలాగే పలకరిస్తారు. ఈ ఏడాది జనవరిలో మెలోనీ పుట్టినరోజు నాడు ఓ సదస్సులో కలిసిన ఎడీ.. ఆమెకు మోకాలిపై కూర్చొని స్కార్ఫ్‌ను కానుకగా ఇచ్చారు. ఇటాలియన్ భాషలో ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అప్పుడు కూడా వీరి వీడియో నెట్టింట తెగ చక్కర్లు కొట్టింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 మే 2025
తెలంగాణ

# సీజనల్ వ్యాధులు (డెంగ్యూ) ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 17 (జనంసాక్షి) :** రాబోయే వానాకాలంలో జిల్లాలో డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ (సీజనల్ వ్యాధులు) ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పీపీటీ ద్వారా అవగాహన కార్యక్రమమును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరుగకుండ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జ్వరాలు వచ్చాక ఇబ్బంది పడే కన్నా ముందుగా నియంత్రణ చర్యలు చేపట్టి రాకుండా చూసుకోవడం ఉత్తమమాన్నారు. ఇండ్లలో ఉన్న నీటి నిల్వలను గుర్తించి మాపింగ్ చేయాలని, అక్కడ నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, ప్రతి మంగళ,శుక్ర వారాలలో డ్రైడే కార్యక్రమంలో వాటర్ లాగిన్ పాయింట్ల మరమ్మత్తుకు గ్రామీణ ఉపాధి హామీ నిధులు వినియోగించుకొని పనులు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి వారం నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించాలని, నీరు అధికంగా నిలువ ఉన్న ప్రాంతాల్లో కీటక నాశన, యాంటీ లార్వా స్ప్రే చేయాలని,ఆయిల్ బాల్స్ వేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న డ్రైయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అధికారులు గ్రామాలను సందర్శించాలని అన్నారు. ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత , దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సభలలో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు.

గ్రామాలు, పట్టణాల్లో కరపత్రాలు, చెత్త సేకరణ వాహనాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని, వైద్య సేవలు మరియు అనుమానితుల నుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ రాపిడ్ టెస్ట్ లు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం డ్రై డే కార్యక్రమం కింద నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో ఫాగింగ్ యంత్రాల పనితీరును పరిశీలించి వాటిని బాగు చేసి రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, జిల్లా పంచాయతీ అధికారి శరీపుద్దీన్, ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత వైద్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యార్థులకు మిత్రా ఫౌండేషన్ ప్రోత్సాహకాలు

### అభినందించిన ఖమ్మం కలెక్టర్

**ఖమ్మం (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది 10వ తరగతి బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం రూ.3 లక్షల విలువైన బహుమతులతో పాటు ఢిల్లీ యాత్ర అవకాశాలు విద్యార్థులకు లభించాయని శ్రీ మిత్రా ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు. కలెక్టర ముజమ్మిల్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు,. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిత్రా ఫౌండేషన్ స్ఫూర్తిదాయక కార్యక్రమం చేపట్టిందని అభినందించారు. "ఈరోజు బహుమతులు అందుకున్న విద్యార్థులు మన భవిష్యత్తు పౌరులు మాత్రమే కాక, దేశ అభివృద్ధికి పాలకులు కావాలని" ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని అవకాశాల్లో ముందంజలో ఉండగలరని, ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు చాలా దోహదపడతాయని పేర్కొన్నారు.

**బహుమతుల వివరాలు:** మొదటి స్థానం: 25,000 నగదు, ల్యాప్‌టాప్, రెండో స్థానం: 25,000 నగదు, మూడో స్థానం: 15,000 నగదు, ప్రత్యేక ప్రోత్సాహ బహుమతులు (6 మంది): ఒక్కొక్కరికి 10,000 చొప్పున - 60,000, కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

**ఢిల్లీ యాత్ర :** మొదటి ఐదుగురు విద్యార్థులకు విమాన ప్రయాణంతో ఢిల్లీకి 3 రోజుల విద్యా యాత్రను మిత్ర ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. వారు పార్లమెంట్ భవన్, రాష్ట్రపతి భవన్, ఇతర జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్థలాలను సందర్శించనున్నారు. ఇది విద్యార్థుల జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా నిలుస్తుంది అని మిత్రా గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర గ్రూప్ డైరెక్టర్లు రంగా శ్రీనివాస్,పాలవరపు శ్రీనివాస్,చారుగుండ్ల రవికుమార్, చెరుకూరి యుగేందర్, నాగసాయిగ్యాస్ నాగేష్, ప్రసేన్ వారు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**ప్రతిభ కనపర్చిన విద్యార్థుల పేర్లు :** పచావ వెన్నెల, మాఘం యశ్వంత్, చింతోజు సాయి, తిరుమలదాసు, రామిశెట్టి ఉమా, ఆవుల శ్రీమన్య, గోడ లక్ష్మీ, పుచ్చకాయల, భవ్య, చందా భావన

# ట్యాంక్ బండ్ చుట్టూ 'లండన్ ఐ'

- హైదరాబాద్‌లో కొత్త అందాలు
- బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్ కార్యాచరణ
- ఆసక్తి వ్యక్తీకరణ టెండర్‌కు అనూహ్య స్పందన
- ప్రణాళిక రూపకల్పనకు కసరత్తు షురూ

**హైదరాబాద్, (జనంసాక్షి):** హైదరాబాద్ నగరం మధ్యలో ఉన్న హుస్సేన్‌సాగర్ పరిసరాలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టులోకి వచ్చే ఈ మొత్తం పర్యాటక ప్రదేశాలకు అనుగుణంగా ఉండే మాస్టర్‌ప్లాన్‌ను హెచ్ఎండీఏ (హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ) రూపొందిస్తుంది. ఇందులో భాగంగా కన్సల్టెన్సీ ఎంపికకు పిలిచిన ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ)కు స్పందన వచ్చినట్లు హెచ్ఎండీఏ అధికార వర్గాలు తెలిపాయి. మాస్టర్‌ప్లాన్ తయారీ కోసం అంతర్జాతీయ సంస్థలు సైతం ఆసక్తి కనబరు స్తున్నాయి. అనంతరం త్వరలోనే మాస్టర్‌ప్లాన్ తయారీ పనులు ప్రారంభం కానున్నాయి.

**లండన్ ఐ తరహాలో..**

మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో భాగంగా కొత్తగా టూరిజం ప్రాజెక్టులను చేపట్టే అవకాశాలున్నాయి. హుస్సేన్‌సాగర్ చుట్టూ అంటే మొత్తంగా 14 కిలో మీటర్ల పరిధిలో సరికొత్తగా ఆకట్టుకునే థీమ్‌లను అందుబాటులోకి తేనున్నారు. లండన్‌లోని ఐ తరహాలో భారీ జాయింట్ వీల్ లాంటివాటిని ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు సంస్థలు ఆసక్తితో ముందుకొస్తే సాధ్యసాధ్యా లను ప్రభుత్వం పరిశీలించనుంది. హుస్సేన్సాగర్ చుట్టూ శాశ్వతంగా నిర్మాణాలు చేపట్టే అవకాశం లేదు. నిబంధనల మేరకే పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్ షిప్) భాగస్వామ్యంలోనే భారీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇప్పటికే ట్యాంక్బండ్ చుట్టూ ఖైరతాబాద్ వద్ద మెట్రోను కలుపుతూ స్కైవాక్ నిర్మాణానికి కొన్ని ప్రతిపాదనలున్నాయి. వివిధ దేశాల్లో వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టులను పరిశీలించి అదే తరహాలో ఇక్కడా నెలకొల్పనున్నారు.

టూరిజం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు ఎక్కువ మంది సందర్శకులను ఆకట్టుకునేలా ప్రణాళిక రూపొందించనున్నారు. కొత్త ప్రాజెక్టులు, సరికొత్త థీమ్‌లు, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను మాస్టర్‌ప్లాన్‌లో సమగ్రంగా పొందుపరుస్తారు.

**ఏళ్ల తరబడి అవే..**

బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్కు, ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం, లుంబినీపార్కు, ఎన్టీఆర్‌గార్డెన్, నెక్లెస్‌రోడ్డు, జలవిహార్ ఇవన్నీ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టులోనే ఉన్నాయి. పర్యాటక పరంగా మౌలిక సౌకర్యాల కల్పన, లీజులు, అద్దెలన్నింటినీ హెచ్ఎండీఏ చూస్తోంది. హైదరాబాద్‌కు వచ్చిన దేశ, విదేశీ టూరిస్టులు సందర్శించే ప్రాంతాల్లో హుస్సేన్‌సాగర్ తప్పకుండా వారి జాబితాలో ఉంటుంది. చాలామంది బుద్ధుని విగ్రహం వద్దకు టూరిజం డిపార్ట్మెంట్ నడిపే పడవలో వెళ్లి వస్తుంటారు.

ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డులో ఇతర ప్రాంతాల్లో అవసరమైనంతగా సరైన సదుపాయాలు లేవు. ఎన్టీఆర్ గార్డెన్లోనూ పాతకాలం నాటి కార్యక్రమాలే నడుస్తున్నాయి. తెలంగాణ సచివాలయం ఎదురుగా హుస్సేన్‌సాగర్‌లో ఏడాది క్రితం మ్యూజికల్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. కానీ దాన్ని కొద్దిరోజులకు తొలగించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ పర్యాటకంగా మరింతగా ఆకట్టుకునే అంశాలు లేక అనుకున్న స్థాయిలో టూరిస్టులు రావడం లేదు. కేవలం ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్కు, లుంబినీవనం, జలవిహార్(ప్రైవేటు) లాంటివే ఉన్నాయి.

## ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఆస్పత్రి సీజ్

**చిక్కడపల్లి, మే17:** అనుమతులకు విరుద్ధంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిర్మించిన డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రి భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు ముషీరాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది చర్యలు చేపట్టారు.

# పుష్కరాల్లో పుణ్యస్నానాలు పవిత్రం

- సరస్వతి పుష్కరాలు నిర్వహించడం హర్షనీయం
- పుష్కరాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పుష్కరాల్లో పుణ్యస్నానాలు పవిత్రమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సరస్వతి పుష్కరాలు నిర్వహించడం హర్షనీయమని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా ఉదయం 10 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం చేరుకున్న మంత్రి త్రివేణి సంగమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురా మిరెడ్డి, భూపాలపల్లి, రామగుండం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మక్కన్ సింగ్ లతో పుష్కర స్నానం ఆచరించి సరస్వతి మాతను దర్శించుకున్నారు. తదుపరి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సరస్వతి నది అంతర్వాహిని అయినటువంటి త్రివేణి సంగమంలో ఘనంగా సరస్వతి పుష్కరాలు నిర్వహించడం ఎంతో సంతోషమని అన్నారు.

తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని సరస్వతి పుష్కరాలు సందర్భంగా స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్య స్నానాలు ఆచరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మొట్ట మొదటి పుష్కరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను కూడా సరస్వతి పుష్కరాల తరహాలో తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిర్వహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పనులన్నీ ఇప్పటి నుండే చేపట్టి త్వరిత గతిన పూర్తి చేసుకుని గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినట్లు మంత్రి స్పష్టం చేశారు. సరస్వతి పుష్కరాలను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. స్వామి వారి కరు ణా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం 11 గంటలకు మంత్రి తిరుగు ప్రయాణమయ్యారు. అంతకుముందు ఆలయ సంప్రదాయాలతో, వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో సీబీఎస్ఈ అమలు భేష్

- నూతన భవన నిర్మాణ పనులు పురోగతి అభినందనీయం
- కరీంనగర్ శ్రీ సరస్వతి శిశు మందిర్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, మే 17 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని సరస్వతి శిశు మందిర్‌లో ఈ విద్యా సంవత్సరం నుండి సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మానవీయ విలువలను పెంపొదిస్తూ దేశ భవిష్యత్ కోసం నవ తరాన్ని తయారు చేయడంలో సరస్వతి శిశు మందిర్ ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. శిశు మందిర్ లో చదువుకోవడంవల్లే తాను ఈ స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేయగలుగుతున్నానని చెప్పారు. కరీంనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలను బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా శిశు మందిర్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించారు. భవన నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకోవడంతోపాటు పనుల పురోగతిపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఈ స్కూల్ భవిష్యత్ తరాలకు, విద్యా ప్రగతికి నూతన దిశగా మార్గనిర్దేశం చేస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి సీబీఎస్ఈ ప్రారంభించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. "శిశుమందిరాలు సమాజ పరిరక్షణలో, మానవీయ విలువల పెంపొందింపులో, దేశ భవిష్యత్ కోసం విలువైన కొత్త తరాన్ని తయారు చేయడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నేను ఈ స్థాయిలో ఈ దేశానికి సేవ చేసే స్థాయికి చేరుకోవడానికి శిశుమందిర్ విద్యే పునాదిగా నిలిచింది. శిశు మందిర్ లో చదువుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను," అని తెలిపారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ నూతన భవన నిర్మాణానికి తన వంతుగా ఆర్థిక సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాధవరం కాంతారావు, అజితేష్ (బిల్డర్), ఇంజినీర్ రాఘవ కృష్ణ, సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.

# సర్వే నెంబర్ 82, 83లో ఏం జరుగుతుంది?

- భారీ బందోబస్తు మధ్య సర్వే నిర్వహించిన అధికారులు
- విలేకరులను అనుమతించని పోలీసులు

**కుత్బుల్లాపూర్ మే 17(జనంసాక్షి) :** జీడిమెట్ల గ్రామం సుచిత్రలోని సర్వే నెంబర్ 82, 83, లలో గత కొన్ని సంవత్సరాలుగా మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎస్ శ్రీనివాస్ రెడ్డి మరి ఇతరులు మధ్యన గత కొన్ని సంవత్సరాలు జరుగుతున్న భూ వివాదం గత కొంతకాలంగా ఇరువురి మధ్య కొనసాగుతుంది. ఈ క్రమంలో శనివారం రెవెన్యూ అధికారులు పోలీసుల భారీ బందోబస్తు మధ్య మరోసారి భూమిని సర్వే నిర్వహించారు. విలేకరులను అనుమతించలేదు. ఏసిపి రాములు ఆధ్వర్యంలో దాదాపు 50 మంది పోలీసులు భారీకేడ్లను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించారు. వివాదంపై అధికారులను వివరణ అడగగా కేవలం సర్వే మాత్రమే చేసినట్లు తెలిపారు.

**మర్రి రాజశేఖర్ రెడ్డి వివరణ...**

తనకు ఎలాంటి నోటీసులు లేకుండా మాకు సంబంధించిన సర్వే నెంబరు 82, 83లో గల తమ భూమిని సర్వే నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. తాము ప్రతిపక్షం పార్టీలో ఉండడం వలన ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తమ భూమి విషయంలో ఎలాంటి తప్పు చేయలేదన్నారు.

### కాళేశ్వరం భూసేకరణ అడ్డుకున్న

# రైతులపై కేసులను కొట్టేసిన కోర్టు

**మంథని, (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా అధికారుల విధులకు ఆటంకం కలిగించారని గత కేసిఆర్ ప్రభుత్వం పెట్టిన కేసును నాంపల్లి కోర్టు కొట్టు వేసింది. 2017, ఆగస్టు 23న పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో 300 మంది రైతులతో పాటు ప్రస్తుత మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు కేసులు నమోదు చేసిన కేసిఆర్ ప్రభుత్వం. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో న్యాయస్థానం కేసును కొట్టివేసింది.

**ఇది రైతుల విజయం : మంత్రి శ్రీధర్ బాబు**

2017లో కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన గొంతులేని రైతుల తరపున మేము మాట్లాడాము ప్రతిగా, మాపై తప్పుడు, కల్పిత కేసులు నమోదు చేయబడ్డాయి. అటువంటి అన్యాయం జరిగినప్పటికీ, మేము చట్టపరమైన మార్గాన్ని ఎంచుకున్నాము. న్యాయవ్యవస్థపై ఎప్పుడూ నమ్మకాన్ని కోల్పోలేదు. ఈరోజు తీర్పు ఎంత సమయం పట్టినా నిజం ఎల్లప్పుడూ వెలుగులోకి వస్తుందనే మా నమ్మకాన్ని బలపరుస్తుంది. ఇది మాకే కాదు, టిఆర్ఎస్ పాలనలో అణచివేయబడిన ప్రతి రైతుకు, ప్రతి గొంతుకు విజయం. వారు అధికారాన్ని దుర్వినియోగం చేశారు, నిరాధారమైన ఆరోపణలు దాఖలు చేశారు. అసమ్మతిని అణచివేయడానికి ప్రయత్నించారు. కానీ ప్రజాస్వామ్యం విజయం సాధించింది. మేము ప్రజల కోసం పోరాడుతూనే ఉంటాము.. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, తెలంగాణ న్యాయం, పారదర్శకత, సత్యంతో ముందుకు సాగుతుంది. అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.

### ఆ భవనాలను వెంటనే

## నేలమట్టం చేయండి

**శేరిలింగంపల్లి, మే 17:** శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని రెండు భవనాలను తక్షణమే నేలమట్టం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు తగు చర్యలు తీసుకోవాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. చందానగర్ సర్కిల్ లో జాతీయ రహదారి వెంట ఉన్న ఒక భవనంలో వారం క్రితం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పక్క భవనానికి కూడా మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే ఈ రెండు భవనాల్లో మంటలను పూర్తిగా ఆపేందుకు అగ్నిమాపక సిబ్బంది రెండు రోజుల పాటు శ్రమించారు. ఇదే వాణిజ్య భవనంలో 2016లో మంటలు అంటుకుని అప్పుడు కూడా భవనం పూర్తిగా తగలబడింది. ఇప్పుడు మరోసారి అగ్ని ప్రమాదం జరగడంతో స్లాబ్‌తో పాటు పిల్లర్లు, గోడలు సైతం దెబ్బతిని వాటి సామర్థ్యం తగ్గినట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో ఈ భవనాలతో భవిష్యత్తులో కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని భావించిన అధికారులు.. ఆ రెండు భవనాల కూల్చివేతకు జీహెచ్ఎంసీ అధికారులు ఆదేశించారు.

# రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం

- రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

**ఇబ్రహీంపట్నం, మార్చి 17 (జనం సాక్షి):** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రైతు సంక్షేమమే రైతు సేవా సహకార సంఘం యొక్క ప్రధాన ధ్యేయమని అన్నారు. శనివారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం యొక్క పాలకవర్గ సమావేశం సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన సంఘం ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఇట్టి సమావేశంలో 11 మందిని నూతన సభ్యులుగా చేర్చుకున్నారు. 9 మంది రైతులకు రూ.1 కోటి 25 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేశారు. 2024 -25 ఆర్థిక సంవత్సరం, త్రైమాసిక జమ ఖర్చులు లెక్కలు ఆమోదించారు. సంఘం 2025 26 ఆర్థిక సంవత్సరం అనంతరం సంఘ సభ్యుల సంక్షేమం కొరకు ఇతర అభివృధి కార్యక్రమాలు చేయుటకు ఆమోదించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ... రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు సేవా సహకార సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే సంఘం యొక్క ప్రధాన ధ్యేయమని అన్నారు. సహకార సంఘాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నట్లు చెప్పారు. రైతులను ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు సహకార సంఘాలు కృషి చేస్తాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అన్నారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుందని పేర్కొన్నారు. సమావేశంలో రైతుబంధు జిల్లా మాజీ చైర్మన్, డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి, సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సంఘం డైరెక్టర్లు కొండ్రు స్వప్న శ్రీనివాస్, జక్క కృష్ణారెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవ రెడ్డి, నర్సింగ్ రావు, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, సామ సత్యనారాయణ రెడ్డి, సీఈవో వై. రాందాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇకపై టికెట్లు ఎవరిని అడగాలో తెలుసు'

## మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్

ప్రతిష్ఠాత్మక వాంఖడే స్టేడియంలో ఓ స్టాండ్‌కు టీమ్‌ఇండియా స్టార్ రోహిత్ శర్మ పేరు పెట్టడంపై తోటి క్రికెటర్లు, మాజీలు అతడికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ రోహిత్‌కు అభినందనలు తెలిపాడు. రోహిత్ క్రికెట్‌లో సాధించిన విజయాలకు సరైన గుర్తింపు లభించిందని అన్నాడు. అలాగే ఇప్పట్నుంచి టికెట్లు ఎవరిని అడగాలో తనకు తెలుసు అంటూ సరదాగా పేర్కొన్నాడు.'హేయ్ రోహిత్ వాంఖడే స్టేడియంలోని ఈ స్టాండ్స్‌కు ఎన్నో సిక్స్‌లు పంపించావు. అందుకే స్టేడియంలో ఈ రోజు నీ పేరిట ఒక స్టాండ్ వచ్చింది. ప్రపంచంలో అత్యుత్తమ స్టేడియాల్లో వాంఖడే ఒకటి. ముంబయి జట్టు, టీమ్‌ఇండియాకు నువ్వు అందించిన సేవలకు ఇది నీకు దక్కిన రివార్డ్. ఈ గౌరవానికి నువ్వు పూర్తి అర్హుడివి. ఇదే గ్రౌండ్‌లో మళ్లీ మళ్లీ ఆడాలని నువ్వు కోరుకుంటావు. నీకు, నీ కుటుంబ సభ్యులకు ఇవి అద్భుతమైన క్షణాలు. ఈ రోహిత్ శర్మ స్టాండ్‌లోకి నువ్వు మరెన్నో సిక్స్‌లు పంపించాలని కోరుకుంటున్నా' అని ద్రవిడ్ పేర్కొన్నాడు. ఇక చివర్లో ముంబయిలో తనకు ఎప్పుడైనా టికెట్లు కావాల్సి వస్తే ఎవరిని అడగాలో నాకు తెలుసంటూ అంటూ ద్రవిడ్ ఫన్నీగా అన్నాడు. ఈ వీడియోను ముంబయి ఇండియన్స్ తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో షేర్ చేసింది. కాగా, శుక్రవారం వాంఖడే స్టేడియంలో ఓ స్టాండ్‌కు అధికారికంగా రోహిత్ శర్మ పేరు పెట్టారు. ముంబయి క్రికెట్ అసోసియేషన్ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని గ్రాండ్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, రోహిత్ తల్లిదండ్రులు గురునాథ్‌శర్మ, పూర్ణిమ హాజరయ్యారు. సీఎం ఫడణవీస్‌తో కలిసి రోహిత్ తల్లిదండ్రులు ఈ స్టాండ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోహిత్ తల్లిదండ్రులు, భార్య రితిక ఎమోషన్ అయ్యారు.మరోవైపు, తన పేరుతో ఓ స్టాండ్ ఉన్న స్టేడియంలో మ్యాచ్‌లు ఆడబోతుండడం ప్రత్యేక అనుభూతి అని రోహిత్ అన్నాడు. క్రికెట్ స్టేడియంలో తన పేరిట ఓ స్టాండ్ పెడతారని కలలో కూడా ఊహించలేదని రోహిత్ పేర్కొన్నాడు.

# పోరాడి నిలిచేదెవరు?

## టాప్-2 స్థానాల కోసం పెరిగిన పోటీ

భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల కారణంగా వారంపాటు నిలిచిపోయిన ఐపీఎల్ 2025 తిరిగి ప్రారంభం కానుంది. శనివారం రాత్రి బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో ఐపీఎల్ సీజన్ రీస్టార్ట్ అవుతుంది. లీగ్ దశలో మరో 13 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి, ప్లేఆఫ్ పోటీ రసవత్తరంగా మారింది. ఇప్పటివరకూ సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు ఇంటిదారి పట్టాయి. ఏడు జట్లు ఇంకా ప్లే ఆఫ్ రేసులో ఉన్నాయి. ఈ దశలో ఒక్క మ్యాచ్ ఓటమి కూడా ప్లే ఆఫ్ అవకాశాలను దెబ్బతీయవచ్చు.ప్లేఆఫ్ స్థానం కన్ఫామ్ అవుతుందనుకున్న జట్లు ఇప్పుడు టాప్-2 స్థానాల కోసం ప్రయత్నిస్తున్నాయి. ప్లే ఆఫ్స్ చేరిన జట్లలో తొలి 2 స్థానాల్లో నిలిచిన జట్లకు ఓ మ్యాచ్ ఓడినా, మరో అవకాశం లభిస్తుంది. దాంతో ఫైనల్‌కు చేరుకోవడానికి రెండు అవకాశాలను అందిస్తుంది. గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం 11 మ్యాచ్‌లలో 8 విజయాలు సాధించి 16 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ప్లేఆఫ్ బెర్త్ కన్ఫామ్ చేసుకోవడానికి ఒక విజయం దూరంలో ఉంది. ఆర్‌సీబీ కూడా 16 పాయింట్లతో ఉంది, రెండు జట్లు టాప్-2 స్థానం కోసం స్ట్రాంగ్ కంటెండర్లుగా ఉన్నాయి.శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహిస్తున్న పంజాబ్ కింగ్స్ 11 మ్యాచ్‌లలో 7 విజయాలు ఓ మ్యాచ్ రద్దుతో 15 పాయింట్లతో మూడవ స్థానంలో ఉంది. టాప్-2లోకి రావడానికి పంజాబ్ మిగిలిన మ్యాచ్‌లన్నీ గెలవాలి. లేకపోతే గుజరాత్ లేదా ఆర్‌సీబీ ఓ మ్యాచ్ ఓడిపోవాలి. 4వ స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్ రేసులో నిలవాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలవాలి. ఢిల్లీ క్యాపిటల్స్ కూడా రేసులో ఉంది. కానీ వారు టాప్-2లోకి రావడానికి మిగిలిన 3 మ్యాచ్‌లను గెలవాలి. మెరుగైన రన్ రేట్ సాధించక తప్పదు. ఈ సీజన్‌లో కోల్‌కతా ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడి, 5 గెలిచింది, 6 ఓడింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. కేకేఆర్ ఖాతాలో ప్రస్తుతం 13 పాయింట్లు ఉన్నాయి. లీగ్ దశ మ్యాచ్‌లు నేడు ఆర్సీబీతో, మే 25న ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్ మిగిలి ఉన్నాయి. ఈ మ్యాచ్ నెగ్గితే కేకేఆర్ 15 పాయింట్లకు చేరి ప్లే ఆఫ్ రేసులో ఇంకా ఉంటుంది. ఒకవేళ మ్యాచ్ ఓడినా, వర్షం పడి రద్దయినా కేకేఆర్ ఇంటిదారి పట్టనుంది.

# డబుల్స్‌లో ముఖర్జీ సిస్టర్స్

## టీటీ సంచలనానికి షాకిచ్చిన 84వ ర్యాంకర్..

ప్రతిష్ఠాత్మక టేబుల్ టెన్నిస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు శనివారం మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్‌లో టీనేజర్ ఆకుల శ్రీజ నిరాశపరిచింది. భారీ అంచనాల మధ్య బరిలోకి నిలిచిన తను తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. అయితే.. ముఖర్జీ సిస్టర్స్ అయిన ఐతికా, సుతీర్థలు ముందంజ వేశారు. మహిళల డబుల్స్‌లో దియా చితాలే, యశస్విని గోడ్‌పాడేలు రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. పురుష డబుల్స్‌లో మానవ్ ఠక్కర్, మనుష్ షా ద్వయం జయభేరి మోగించింది. టేబుల్ టెన్నిస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలుస్తుందనుకున్న శ్రీజ స్వీయ తప్పిదాలతో భారీ మూల్యం చెల్లించుకుంది. 84వ ర్యాంకర్ అయిన థాయ్‌లాండ్‌కు క్రీడాకారిణి సుథాసిని సవెట్టాబుట్ చేతిలో 1-4తో ఓటమి పాలైంది. తొలి సెట్ గెలుపొందిన శ్రీజ.. ఆ తర్వాత అదే తీరుగా ఆడలేకపోయింది. పుంజుకున్న ప్రత్యర్థి వరుస సెట్లలో భారత ప్లేయర్‌కు షాకిచ్చి ంది. దాంతో, 34 నిమిషాల్లోనే మ్యాచ్ ముగియగా.. శ్రీజ ఇంటిదారి పట్టింది.

**3-1తో ఆధిపత్యం**

ఆసియా క్రీడల్లో పతకంతో మెరిసిన ఐహికా, సుతీర్థ ద్వయం.. తుర్కియే జంటకు షాకిచ్చింది. ఐదు సెట్ల పోరులో ఒజ్జే ఇల్‌మజ్, ఎసె హరాక్ జోడీపై 11-4, 9-11, 12-10, 11-9, 7-11తో జయకేతనం ఎగురవేసింది. మరో మ్యాచ్‌లో దియా, యశస్వినీ జోడీ ఉజ్బెకిస్థాన్ జంటను చిత్తుగా ఓడించింది. నాలుగు సెట్ల పోరులో 3-1తో ఆధిపత్యం చెలాయించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. ఇక పురుషుల డబుల్స్‌లో ఠక్కర్, షాలు అంచనాలకు తగ్గట్టు రాణించి ప్రత్యర్థికి చెక్ పెట్టారు. స్లోవేనియాకు చెందిన డెని కొజు, పీటర్ ఫ్రీబర్ జంటను మూడు సెట్లలో వణికిస్తూ 3-0తో విజయం సాధించారు.

# నీరజ్ చోప్రా ఆదుర్స్

## 90 మీటర్ల మార్క్‌ను అధిగమించిన నీరజ్



భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. తొలిసారి తన కెరీర్ లోనే 90 మీటర్ల మార్క్ ను అధిగమించాడు. ఖతార్ వేదికగా జరుగుతున్న దోహా డైమండ్ లీగ్ లో ఈ ఘనత సాధించాడు నీరజ్. నీరజ్ కెరీర్‌లో ఇది అత్యుత్తమ త్రో. అంతకుముందు, టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా బంగారు పతకం గెలుచుకున్నప్పుడు కూడా అతను 90 మీటర్లు త్రో వేయలేకపోయాడు.నీరజ్ కెరీర్‌లో అత్యుత్తమ త్రో 2022 స్టాక్‌హెూమ్ డైమండ్ లీగ్‌లో అతను చేసిన 89.94 మీటర్లు. ఐదు రౌండ్లు ముగిసిన తర్వాత కూడా నీరజ్ చోప్రా రెండవ స్థానంలో నిలిచాడు.డైమండ్ లీగ్ దోహా లెగ్‌లో జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ నంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఐదవ ప్రయత్నంలో అతను 91.06 మీటర్లు విసిరాడు.రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ మొదట విసిరాడు. అతను తన మొదటి ప్రయత్నంలోనే 88.44 మీటర్లు విసిరాడు. అతని ప్రత్యర్థి అండర్సన్ పీటర్స్ మొదటి ప్రయత్నంలోనే 85.64 మీటర్లు విసిరగా, జూలియన్ వెబర్ 83.82 మీటర్లు, జూలియస్ యెగో 68.81 మీటర్లు విసిరారు. అదే సమయంలో, మరో భారతీయ జావెలిన్ త్రోయర్ కిషోర్ జెనా మొదటి ప్రయత్నంలోనే 68.07 మీటర్లు విసిరాడు.నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో 90 మీటర్లు విసిరిన ప్రపంచంలో 25వ ఆటగాడిగా.. ఆసియాలో మూడవ ఆటగాడిగా నిలిచాడు. రెండు ఒలింపిక్ పతకాలు గెలుచుకున్న నీరజ్ చోప్రా ప్రస్తుత కోచ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెంజీ, 90 మీటర్ల కంటే ఎక్కువ విసిరిన జావెలిన్ త్రోయర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. జావెలిన్ త్రోలో 90 మీటర్లు విసిరిన ఇతర ఆసియా అథ్లెట్లు ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ (92.97) (పాకిస్తాన్) చావో సన్ చెంగ్ (91.36) మాత్రమే. 90 ప్లస్ మీటర్లు విసిరి నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

### నీరజ్ చోప్రాను అభినందించిన ప్రధాని మోడీ

దోహా డైమండ్ లీగ్‌లో భారత 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా శుక్రవారం తొలిసారిగా జావెలిన్‌ను 90 మీటర్లకు మించి విసిరి చరిత్ర సృష్టించాడు. ఫైనల్‌లో తన మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 90.23 మీటర్లు విసిరి తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరుచుకున్నాడ. అంతకు ముందు నీరజ్ చోప్రా జూన్ 30, 2022న స్టాక్‌హెూం డైమండ్ లీగ్‌లో 89.94 మీటర్లు విసిరాడు. అయినా నీరజ్ చోప్రా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జర్మనీ క్రీడాకారుడు జులియన్ వెబర్ తన చివరి ప్రయత్నంలో 91.06 మీటర్లు విసిరి మొదటి స్థానంలో నిలిచాడు. దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా అద్భుతమైన ప్రదర్శనను కనబరిచినందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఆయనను ప్రశంసించారు. నీరజ్ చోప్రాను అభినందిస్తూ ఎక్స్ వేదికగా ఇలా రాసుకొచ్చారు. "గొప్ప విజయం! దోహా డైమండ్ లీగ్ 2025లో 90 మీటర్ల మార్కును అధిగమించిన తన వ్యక్తిగత అత్యుత్తమ త్రోను సాధించినందుకు నీరజ్ చోప్రాకు అభినందనలు. ఇది అతని అవిశ్రాంత అంకితభావం, క్రమశిక్షణ, అభిరుచి ఫలితం. నీరజ్ ప్రదర్శనతో భారత్ గర్విస్తోంది. " అని ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసించారు.

# బీసీసీఐని ఒప్పిస్తాం..!

ఐపీఎల్ 18వ సీజన్ పునరుద్ధరణతో ప్లే ఆఫ్స్ రేసులలోని జట్లు విజయంపై కన్నేశాయి. నాకౌట్, ఫైనల్ మ్యాచ్‌ల కోసం బీసీసీఐ కూడా సన్నాహకాలు చేస్తోంది. కొత్త షెడ్యూల్ ప్రకటన సమయంలోనే ఫైనల్ వేదిక మారుతుందనే వదంతులు వినిపించాయి. జూన్ 3న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో టైటిల్ పోరు నిర్వహిస్తారని సమాచారం ఉంది. అయితే.. ఈ వార్తల్ని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఖండించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫైనల్ ఫైట్‌ను ఈడెన్ గార్డెన్స్‌లో జరిపితీరుతామని చెబుతున్నాడు దాదా. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే25న ఫైనల్ మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్‌లో జరగాల్సింది. కానీ, 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పరిస్థితులతో టోర్నీ వారం పాటు వాయిదా పడింది. దాంతో.. ఆగిపోయిన లీగ్ మ్యాచ్‌ల నిర్వహణతో పాటు ప్లే ఆఫ్స్, ఫైనల్ తేదీలు కూడా మారాయి. అయితే.. టైటిల్ పోరుకు అహ్మదాబాద్ వేదిక కానుందనే వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గంగూలీ అవన్నీ ఊహగానాలే అని కొట్టిపారేశాడు.

### ఆరు జట్లతో విదర్భ ప్రొ టీ20 లీగ్

ఐపీఎల్ రాకతో టీ20లకు క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. అంతర్జాతీయంగానే కాదు దేశవాళీలోనూ పొట్టి క్రికెట్ టోర్నీలు జోరందుకుంటున్నాయి. క్రికెట్‌ను అమితంగా ప్రేమించే భారత్‌లో ఈ ట్రెండ్ కొంచెం ఎక్కువ మరి. అవును.. విదర్భ క్రికెట్ అసోసియేషన్ సరికొత్తగా ప్రొ టీ20 లీగ్‌కు శ్రీకారం చుట్టింది. ఐపీఎల్ 18వ సీజన్ ఫైనల్ ముగియగానే 'విదర్భ ప్రొ టీ20' టోర్నమెంట్‌ను ఆరంభిస్తామని శనివారం వీసీఏ వెల్లడించింది. ఆరు జట్లు పోటీపడే ఈ లీగ్ మ్యాచ్‌లన్నింటినీ క్రికెట్ అసోసియేషన్ పరిధిలోని స్టేడియాల్లో నిర్వహిస్తామని తెలిపింది. నాగ్‌పూర్ ప్రాంతంలో పొట్టి క్రికెట్‌కు ఆదరణ పెంచాలనే ఉద్దేశంతో విదర్భ క్రికెట్ అసోసియేషన్ ప్రొ టీ20 లీగ్‌ను ప్రారంభించనుంది.

# పిల్లలు ఫ్రీగా మ్యాచ్‌లను చూడొచ్చు..

ప్రస్తుత కాలంలో టెస్ట్ క్రికెట్ పట్ల క్రేజ్ తగ్గిపోతోంది. ఈ ఫార్మాట్‌ను ప్రోత్సహించడానికి అందరూ కొత్త వ్యూహాలను అవలంభిస్తున్నారు. అందుకే ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు ప్రైజ్ మనీని రెట్టింపు కంటే ఎక్కువ చేసింది. ఇంతలో ఓ క్రికెట్ బోర్డు టెస్ట్ మ్యాచ్‌ల సమయంలో పిల్లలకు ప్రవేశాన్ని ఉచితంగా కల్పించింది. ఈ కీలక నిర్ణయాన్ని వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తీసుకుంది. వెస్టిండీస్, ఆస్ట్రేలియా మధ్య జరగనున్న 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ సందర్భంగా స్టేడియంలోకి పిల్లలకు ప్రవేశం ఉచితం అని (క్రికెట్ వెస్టిండీస్) వెల్లడించింది. వచ్చే నెలలో ప్రారంభమయ్యే 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను చూడటానికి కరేబియన్‌లోని పిల్లలు ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. క్రికెట్ వెస్టిండీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ క్రిస్ డెహ్రింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్, గ్రెనడాలోని గ్రెనడా నేషనల్ స్టేడియం, జమైకాలోని సబీనా పార్క్‌లలో జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లకు పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.కెన్సింగ్టన్ ఓవల్‌లో 'వెస్టిండీస్ హెూమ్-ఫుల్ ఆఫ్ ఎనర్జీ' ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా డెహ్రింగ్ మాట్లాడుతూ.. క్రికెట్ వెస్టిండీస్ కొత్త విధానంలో భాగంగా ఈ చొరవ ప్రారంభించబడిందని అన్నారు. ప్రతి బిడ్డకు టెస్ట్ క్రికెట్ ఆడటం అనేది మానవ హక్కు అని క్రికెట్ వెస్టిండీస్ తాము నమ్ముతున్నామన్నారు. కరేబియన్‌లో టెస్ట్ క్రికెట్ ఆడటం అనేది మానవ హక్కు అని.. అందుకే ఆ సంవత్సరం మొదటిసారిగా పిల్లలందరూ టెస్ట్ మ్యాచ్‌లను ఉచితంగా చూడగలిగే విధానానని రూపొందిస్తున్నామని ఆయన అన్నారు. మీకు టికెట్ అవసరం లేదని.. అది మీ హక్కు అంటూ డెహ్రింగ్ పేర్కొన్నారు. అయితే ఎంత వయస్సు వరకు పిల్లలకు ఉచిత ప్రవేశం లభిస్తుందో ఇంకా తెలియరాలేదు.

# పిడుగు పడి ఇద్దరు విద్యార్థులు మృతి

## ఒకరికి తీవ్ర గాయాలు..

**తూప్రాన్ మే 17 (జనం సాక్షి):** ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మెరుపు దాడులకి పిడుగు పడి ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా ఒక విద్యార్థి తీవ్ర గాయాలు అయినా సంఘటన తూప్రాల్ మున్సిపల్ పరిధిలోని పడాలిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పడాల్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పడాలపల్లి గ్రామానికి చెందిన వెంగలి ముత్యాలు కొడుకు వెంగలి ప్రసాద్(16,) నడిపల్లి ఐలేని కొడుకు యశ్వంత్( 17) , పుల్ల సుధాకర్ కొడుకు కిరణ్ 14 ముగ్గురు గ్రామ శివారులో గల కుంట వద్ద క్రికెట్ ఆడుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో మామిడి చెట్టు కిందకి వెళ్లారు. అకస్మాత్తుగా పిడుగు పడడంతో వెంగలి ప్రసాద్ నడిపల్లి యశ్వంత్ అక్కడికక్కడే మృతిచెందగా పుల్ల సుధాకర్ కొడుకు కిరణ్ కు తీవ్ర గాయాలయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివానందం సంఘటన స్థలానికి వెళ్లి చనిపోయిన వారిని గాయాలైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అకస్మాత్తుగా జరిగిన సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి చనిపోయిన ప్రశాంత్ బ్రాహ్మణపల్లి లోని జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణుడు అయ్యాడు యశ్వంత్ తూప్రాన్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు తీవ్ర గాయాలైన కిరణ్ సెంటర్ నాయుడు స్కూలులో ఏడవ తరగతి చదువుతున్నాడు. మృతుల కుటుంబాలను తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్ పడాలపల్లి మాజీ కౌన్సిలర్ బొంది అరుణ వెంకట గౌడ్ కుటుంబాలను పరామర్శించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్

- మంత్రి సీతక్క స్పందించి తక్షణమే న్యాయం చేయాలి
- బాధితులతో క్యాంప్ ఆఫీస్‌కి వెళ్తాం

**కొత్తగూడ మే 17 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కు గోల్ మాల్ పై కొత్తగూడ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో బి ఆర్ఎస్ పార్టీ విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు మాట్లాడుతూ సీతక్క సైన్యం పేరుతో తిరుగుతూ కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు అమాయక ప్రజలను చూసి ప్రభుత్వం నుండి వచ్చినటువంటి (సీఎంఆర్ ఎఫ్) చెక్కులు పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.గత ప్రభుత్వ హయాంలో అర్హులైన వారికి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు ప్రతి పేదవానికి అందజేశామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడున్న పాలక ప్రభుత్వంలో సీతక్క సైన్యంగా తిరుగుతున్న నాయకులు కమిషన్ల కోసం కక్కృతి పడుతున్నారు.పేద గిరిజనుల దగ్గర దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కొత్తగూడ మండలం ఏదులపల్లి గ్రామానికి చెందిన బొమ్మినేని సోమయ్యకు సీఎంఆర్ఎఫ్‌లో 45000 మంజూరు కాగా ఆ విషయం అతనికి తెలియదు.అది గమనించిన స్థానిక కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కోనాపురం గ్రామానికి చెందిన బత్తుల సోమయ్య అకౌంట్లో వేసి అతనికి 5వేలు ఇచ్చి 40 వేల రూపాయలు నాకు తెలియకుండా తీశాడని సోమయ్య ఆరోపించాడని అన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయకపోతే గిరిజనులతో కలిసి మంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని అన్నారు. అదేవిధంగా నాసిరకం పనులు చేసి బిల్లు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ను కలిసి నాసిరకం పనులు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఈసం సాయికిరణ్, అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ బానోత్, మాజీ ఎంపీటీసీ ననుబోతుల లింగన్న, మాజీ వైస్ ఎంపీపీ పూల యాదగిరి, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# రైతును కాపాడుకుందాం.. నకిలీల ఆట కట్టిద్దాం..

- నకిలీ విత్తనాలను పట్టుకోవడానికి సరిహద్దుల్లో టాస్క్ ఫోర్స్
- పట్టుబడితే నింబితులపై పిడి యాక్ట్
- అన్ని దుకాణాలను తనిఖీ చేయండి
- వికారాబాద్ ఎస్పీ కలెక్టర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 17 (జనం సాక్షి):** నకిలీ విత్తనాలు, ఏరువులు విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వానకాల పంటల సంసిద్ధత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల సరఫరా, లభ్యత, టాస్క్ ఫోర్స్, అంతర్గత బృందాలు, నకిలీ విత్తనాల నిరోధన, నాణ్యత ప్రమాణాలపై వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించ కుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ నకిలీ విత్తనాలను అరికట్టడంలో ఎలాంటి ఒత్తిడీలకు లొంగకుండా తమ విధులను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో కూడా టాస్క్ ఫోర్స్ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ప్రభుత్వం వ్యవసాయ రంగానికి వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టుతుందని దీనికి అనుగుణంగా వ్యవసాయ రంగం వృద్ధిలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న 538 ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను ఎప్పటికపుడు అధికారులు తనిఖీలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. విత్తనాల నాణ్యతను పరిశీలించాలని ఆయన తెలిపారు.జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పిడి చట్టమును ప్రయోగించి చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు పంటలు కోల్పోవడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని, రైతులను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన తెలిపారు.

నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయిస్తున్నట్లు అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వారిపై వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డిహెచ్ఎస్ఓ సత్తార్, వ్యవసాయ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# చాదర్‌ఘాట్లో భారీ దొంగతనం

- 75 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు
- ఇంట్లోని ఫ్రిడ్జో ఉన్న పండ్లను ఆరగించిన ఆగంతకులు

**హైదరాబాద్ :** హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లో భారీ చోరీ జరిగింది. ఓ వ్యాపారి ఇంట్లోకి దూరిన ఆగంతకులు 75 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదును దోచుకున్నారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు ఫహీముద్దీన్ భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం రాత్రి తన తల్లిదండ్రులను ఇంట్లో ఉంచి ఆసుపత్రికి వెళ్లిపోయాడు. ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించిన దుండగులు ఫహీముద్దీన్ తల్లిదండ్రులు నిద్రిస్తున్న గదికి బయట నుంచి గొళ్లెం పెట్టి రాత్రి చాలా సేపు ఇంట్లోనే తిష్ట వేశారు. ఇంట్లోని ఫ్రిడ్జో ఉన్న పండ్లను ఆరగించి బీరువాలో భద్రపరిచిన బంగారం, నగదుతో పాటు ఇతర వస్తువులను తీసుకుని ఉడాయించారు. తెల్లవారుజామున ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చి ఫహీముద్దీన్ వస్తువులు చిందర వందరగా ఉండటం చూసి దొంగతన

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 మే 2025

# సరస్వతీ పుష్కరాలు నిర్వహణ సంతోషదాయకం

- రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**కాళేశ్వరం, మే 17 (జనం సాక్షి) :** సరస్వతి నది అంతరవాహిని అయిన త్రివేణి సంగమంలో ఘనంగా సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషమని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా ఉదయం 10 గంటలకు కాళేశ్వరం చేరుకున్న మంత్రి త్రివేణి సంగమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామి రెడ్డి, భూపాలపల్లి, రామగుండం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మక్కన్ సింగ్ లతో పుష్కర స్నానం ఆచరించి సరస్వతి మాతను దర్శించుకున్నారు. తదుపరి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని సరస్వతి పుష్కరాలు సందర్భంగా స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్య స్నానాలు ఆచరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం. మొట్ట మొదటి పుష్కరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను కూడా సరస్వతి పుష్కరాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రం లో పెద్ద ఎత్తున నిర్వహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పనులన్నీ ఇప్పటి నుండే చేపట్టి త్వరిత గతిన పూర్తి చేసుకుని గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినట్లు మంత్రి స్పష్టం చేశారు. సరస్వతి పుష్కరాలను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. స్వామి వారి కరుణా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం 11 గంటలకు మంత్రి తిరుగు ప్రయాణ మయ్యారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో, వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో మట్టి పోస్తే కఠిన చర్యలు

- శిఖం భూమిలో అయినా సడలింపు లేదు
- బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్లకు హైడ్రా సూచనలు

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) :** చెరువుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలు పోస్తే కఠిన చర్యలుంటాయని హైడ్రా హెచ్చరించింది. చెరువలపై నిరంతరం నిఘా ఉంటుందని.. మట్టిపోసిన వారిని సాక్ష్యాధారాలతో పట్టుకుని వారిపై క్రిమినల్ కేసులు పెడతామని పేర్కొంది. రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్లతో పాటు ఆయా సంఘాల ప్రతినిధులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో హైడ్రా పలు సూచనలు చేసింది. ప్రకృతి సమతుల్యతకు చెరువుల పరిరక్షణ ఎంతో అవసరమని.. ఆ దిశగా హైడ్రా పనిచేస్తోందని కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ తెలిపారు. బిల్డర్లు – ట్రాన్స్‌పోర్టర్లు కలసి.. మట్టిని ఎక్కడ పోయాలో ముందుగానే ఒక అవగాహనకు రావాలని సూచించారు. అలా కాదు.. ఎవరికి వారుగా వ్యవహరించి.. మట్టిని తరలించే పని కాంట్రాక్టర్‌కు అప్పగించాం.. ఆయన ఎక్కడ పోస్తే మాకేంటి అనేట్టు బిల్డర్లు వ్యవహరిస్తే అందరిపైనా కేసులు పెడతామని హెచ్చరించారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు మిగులుతాయని దగ్గర్లోని చెరువుల ఒడ్డున పడేస్తామంటే వారి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా.. డ్రైవర్, వాహన యజమాని, మట్టిని ఎక్కడి నుంచి తెస్తున్నారో సదరు నిర్మాణ సంస్థ యజమానిపై కూడా క్రిమినల్ కేసులు పెడతామన్నారు. శిఖం భూములలో కూడా మట్టి నింపరాదని సూచించారు. హైడ్రా పోలీసు స్టేషన్ కూడా అందుబాటులోకి వచ్చింది, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇందులో కేసులు బుక్ అవుతాయన్నారు. చెరువుల వద్ద కూడా 24 గంటలూ నిఘా ఉందని పేర్కొన్నారు.

**ఈ నంబరుకు ఫోను చేయండి..**

చెరువుల్లో మట్టిపోసి నింపుతున్న వారి సమాచారాన్నివ్వాలని నగర ప్రజలను హైడ్రా కోరింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఫోను నంబరు 9000113667 కేటాయించింది. హైడ్రా ట్విట్టర్ అకౌంట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అలాగే చెరువులో మట్టి పోస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మట్టిని సర్దుతున్న జేసీబీల వీడియోలను కూడా పంపించాలని సూచించింది. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు.. కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అందరూ ఈ క్రతువులో చేతులు కలపాలని హైడ్రా కోరింది.

# మిషన్ భగీరథకు మోకాలడ్డు

- ఫ్లోరైడ్ ప్రాంతాలకు విముక్తి పట్టని కాంగ్రెస్
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు



**నల్లగొండ, మే17 (జనంసాక్షి) :** మిషన్ భగీరథ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ నివారణ జరిగేదని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. అయితే కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని కాంగ్రెస్ కొనసాగించడం లేదన్నారు. ఇంటింటికి నీరు వస్తేనే ఫ్లోరైడ్ దూరం అవుతుందిన జగదీశ్వర్ రెడ్డి అంగీకరించారు. ఇందుకు భగీరథ ఒక్కటే పరిష్కారం అన్నారు. భూగర్భ జలాల వినియోగం తగ్గితేనే ఇది సాధ్యం అన్నారు. శాశ్వత కరువు, ఫ్లోరోసిస్ నివారణకు కృష్ణా జలాలు అందించాలన్న పథకం ముందుకు సాగక పోవడంతో ఫ్లోరైడ్ గ్రామాలకు శాప విమోచనం కలగడంలేదు. జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, ఈ ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్‌తో పోరాడుతున్నారు. ఫలితంగా నక్కలగండి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు అందించనున్నట్టు ఆనటి కెసిఆర్ ప్రభుత్వం ప్రకటించి, ముప్పై లక్షలు కేటాయించింది. కానీ ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని నేటికీ పూర్తి చేయకపోవడంతో ప్రజలకు మంచినీటి లక్ష్యం నెరవేరడం లేదు. శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పథకాన్ని చేపట్టి గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల నీరు నల్గొండ జిల్లాలో అదనంగా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 700 గ్రామాలకు తాగునీరు అందించాలని జిల్లా ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో గతంలో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శ్రీశైలం కుడి, ఎడమ కాల్వలకు శంకుస్థాపన చేశారు. అయితే కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. ఎడమ కాలువ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం జరిగింది. శ్రీశైలం సొరంగం పథకాన్ని చేపట్టాలన్న జిల్లా ప్రజల ఆందోళనతో అనుమతిచ్చారు. దీన్ని నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉండగా, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించనందున పూర్తికాలేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే యాభై ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టు పూర్తికాదు. కాబట్టి తక్షణమే పూర్తిచేసి అందులో అంతర్భాగమైన నక్కలగండి (లోయర్‌డిండి) రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలి. ఈ పథకంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ద్వారావచ్చే నాలుగువేల క్యూసెక్కులలో మూడువేల క్యూసెక్కులను దిగువ డిండి (నక్కలగండి) జలాశయం నుంచి రెండు స్టేజీలలో ఎగువ డిండికి 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 3.4 లక్షల ఎకరాలకు సాగునీరందించే సౌకర్యం ఉన్నది. శ్రీశైలం సొరంగ మార్గం ద్వారా వచ్చే నీటిని నక్కలగండి (చందంపేట మండలం) వద్ద 7. టీఎంసీల సామర్థ్యంతో లోయర్ డిండి రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ఎడమ కాలువ ద్వారా ఏఎమ్మార్పీకి సరఫరా చేస్తారు. గోనబోయినపల్లి సమీపంలోని మేళ్లచెరువును మిడ్ డిండి రిజర్వాయర్‌గా 11 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తారు. మిడ్ డిండి నుంచి 12.75 కిలోమీటర్ల సొరంగం ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని విడుదల చేసి, అక్కడి నుంచి 560 మీటర్ల పొడవు, మూడుమీటర్ల వ్యాసార్థం కలిగిన ఆరు పైపుల ద్వారా 134 మీటర్ల ఎత్తు నుంచి అప్పర్ డిండికి సరఫరా చేస్తారు. ప్రస్తుత డిండి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 7.2 టీఎంసీలకు పెంచుతారు. మధ్య డిండి రిజర్వాయర్ నుంచి .7 కిలోమీటర్ల పొడవు కాల్వలు తవ్వుతారు. ఈ కాలువకు మధ్యలో కాసారం, దేవరకొండ, సామలపల్లి గ్రామాల వద్ద 7 టీఎంసీల సామర్థ్యంతో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తారు. ఇవేగాక మైనంపల్లి, ఉప్పువాగు, నాంపల్లి, ఇర్విన్ వద్ద కూడా రిజర్వాయర్లు ఏర్పాటు– చేస్తారు. మిడ్ డిండి ద్వారా డిండి, దేవరకొండ, చందంపేట, గుర్రంపోడ్, ఉప్పువాగు, నాంపల్లి, మునుగోడు, చండూరు, కనగల్లు, నల్గొండ మండలాలలో సుమా రు 90,500 ఎకరాలు, అచ్చంపేట మండలంలో 1000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నల్గొండ జిల్లాలో పశ్చిమ భాగంగా ఉన్న దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజకవర్గాల్లో 14 కరువు పీడిత మండలాలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఐదు మండలాల్లో సాగు, తాగునీరు అందించే ఈ పథకానికి ప్రణాళిక చేశారు.

# ముంబై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

- బెదిరింపు మెయిల్ రాకతో పోలీసుల అప్రమత్తం

**ముంబై, మే 17 (జనంసాక్షి) :** ముంబై విమానాశ్రయ పోలీసులకు బాంబు బెదిరింపు ఇమెయిల్ వచ్చింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రసిద్ధ తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ ను పెల్చేస్తామని బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, ఈ ఇమెయిల్ నేరుగా పోలీసుల అధికారిక ఇమెయిల్ ఐడికి పంపబడింది. ఉగ్రవాది అఫ్జల్ గురు, సాయిబాబు శంకర్ ఉరిశిక్షలను బెదిరింపు మెయిల్‌లో దుండగులు ప్రస్తావించినట్లు సమాచారం. వారిద్దరిని అన్యాయంగా ఉరితీశారని ఆరోపిస్తూ..ముంబైలోని రెండు ప్రముఖ ప్రదేశాలపై దాడులు చేస్తామని బెదిరించినట్లు– అధికార వర్గాలు తెలిపాయి. బెదిరింపు ఈమెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసులు రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. విమానాశ్రయం, హోటల్ ప్రాంగణాలను స్కాన్ చేయడానికి బృందాలను నియమించారు. రెండు ప్రదేశాలలో భద్రతను పెంచారు. ముంబైలోని కీలక ప్రదేశాలలో నిఘా పెంచినట్లు అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతానికి ఎటు– వంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని అధికారులు చెప్పారు. ఈమెయిల్ ద్వారా బెదిరింపు వెనుక ఉన్న వ్యక్తిని గుర్తించడానికి అధికారులు ప్రస్తుతం దర్యాప్తు చేపట్టారు.

# సంక్షేమం తెలంగాణను సంక్షోభంలోకి నెట్టారు

- మాజీ ఎంపీ మాలోత్ కవిత

**మహబూబాబాద్, మే 17 (జనంసాక్షి) :** రైతు సంక్షేమంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని , కానీ కాంగ్రెస్ వచ్చాక దానిని పూర్తిగా విస్మరించారని మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సకల జనుల అభ్యున్నతే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని శనివారం నాడిక్కడ అన్నారు. రైతుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. రైతులకు అండగా నిలిచేలా పెట్టుబడి పథకం దేశం ఎక్కడైనా అమలు చేస్తున్నారా చెప్పాలన్నారు. కానీ కాంగ్రెస్ సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని అన్నారు. కెసిఆర్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు. ప్రతి వర్గానికి చేదోడువాదోడుగా నిలిచేలా పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌దని అన్నారు. నాయకులు తమ స్వలాభం కోసం, స్వార్థం కోసం సిద్ధాంతాలను విస్మరించడం వల్లే బిఆర్ఎస్ ఓడిందని స్పష్టం చేశారు. తండాలన్నీ కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి ఎన్నికలు జరిపిన ఘనత కెసిఆర్‌దన్నారు. ఇకపోతే ఏటా వర్షాకాలంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం మాయమయ్యిందని అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడంతో వర్షాలు సమృద్ధిగా కురువడం లేదన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే అందరూ మొక్కలు నాటడమే మార్గమని కెసిఆర్ గుర్తించారని అన్నారు. రైతులు వర్షంపై అధారపడి పంటలు పండిస్తారని వానలు కురవాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని తెలిపారు.

# ఇష్టారాజ్యంగా బోర్ల తవ్వకాలు

- కలసివస్తున్న అధికారుల ఉదాసీనత

**నిజామాబాద్, మే17 (జనంసాక్షి) :** అధికారుల్లో నెలకొన్న ఉదాసీనత వైఖరిని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా వాల్టాచట్టం క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. బోరు తవ్వకం సమంలో సమీపంలోని మరోబోరు, బావికి కనీసం 200 మీటర్ల దూరం పాటించాలి. కొత్తగా బోరుబావి వేసుకునే రైతు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా శాస్త్రీయపద్ధతులను అనుసరించి జియాలాజికల్ అధికారులు సర్వే నిర్వహిస్తారు. అధికారులు సూచించిన ప్రదేశంలో బోరుబావి పడకుంటే రూ.10వేల వరకు బాధిత రైతుకు బీమా సౌకర్యం లభిస్తుంది. అయితే రైతుల్లో నెలకొన్న అవగాహన లోపంతో తమ ఇష్టాను సారంగా బోరుబావులు తవ్వించి ఆర్థికంగా నష్టపోతున్నారు. రిగ్గుల రిజిస్ట్రేషన్ బోరుబావులు తవ్వే రిగ్గుల యజమాని రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకుండా బోరుబావులను తవుతున్న రిగ్గులను అధికారులు సీజ్‌చేయాల్సి ఉంటుంది. అలాంటి చర్యలేవీ లేకపోవడంతో రిగ్గుల యాజమాన్యాలు తమకు నచ్చిన ప్రదేశంలో బోరుబావి తవ్వకాలు చేపట్టి రైతుల నుంచి వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారు.బోరుబావుల తవ్వకం, చెట్లనరికివేత, నదులు, వాగుల నుంచి ఇసుకతీత, తాగునీటి వనరుల కలుషితం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టపడక పోగా, వాల్టా చట్టంలోని నియమనిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వర్షాభావంతో చాలాచోట్ల ఇష్టం వచ్చినట్లుగా బోర్ల తవ్వకం చేపడుతున్నారు. బోరుబావుల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ప్రతిబావి యజమానీ 10 రూపాయలను రెవెన్యూ కార్యాయలంలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పర్యావరణం, భూగర్భజలాలు, సహజ వృక్షసంపద పరిరక్షణ కోసం వాల్టా చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. అమలులో పారదర్శకత కొరవడి ఉల్లంఘన చర్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల మధ్య అవగాహన లోపంతో చట్టం ఉల్లంఘనదారులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టి లో ఉంచుకొని ప్రభుత్వం కొన్ని నిమయనిబందనలు అందులో పొందుపరిచారు. మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ–, గ్రామపంచాయతీల పరిధిలో చెట్లను పరిరక్షించి వాతావారణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు రెవెన్యూ, అటవీ శాఖ, గ్రామపంచాయతీ అధికారులు కృషి చేయాలి. ఎవరైనా చెట్ల యజమానిచెట్లను తన అవసరాల కోసం పడ గొట్టాలనుకుంటే అధికారుల నుంచి అనుమతిపొందాలి. చెట్లను నరికివేసిన 30 రోజుల వ్యవధిలో సమీప ప్రదేశంలో రెండు మొక్కలు నాటాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులకు అప్పగించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడంతో గ్రామాల్లోని సహజ అటవీ వృక్ష సంపద తగ్గుతున్నది.

# అడవిదొంగలపై కఠిన చర్యలేవీ?

- పోడుతో కోట్లాది వృక్ష సంపద ఖతం

**ఆదిలాబాద్, మే17 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రతి రోజు లక్షలాది రూపాయల విలువ చేసే టేకు కలప అక్రమంగా తరలిపోతుంది. ఆదిలాబాద్ టేకు కలపకు ఇతర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. కోట్లాది రూపాయల కలప అక్రమంగా తరలిపోతుంటే లక్షలాది రూ పాయల అక్రమ కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. కవ్వాల్ అభయారణ్యంతోపాటు జిల్లాలోని ఇతర అటవీ ప్రాంతాల నుంచి టేకుతోపాటు ఇసుక, రాయి, మొరం అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం అంతా కింది స్థాయి నుంచి ఉన్నతాధి కారుల వరకు తెలిసినప్పటికీ మామూళ్లు తీసుకుని మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అటవీశాఖ చెక్‌పోస్టుల్లోని సిబ్బంది అడవుల నుంచి అక్రమ కలప, ఇసుక, రాయి, వన్యప్రాణుల మాంసాన్ని తరలించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని ఆ వాహనాల నుంచి డబ్బులు తీసుకుని వదిలి పెట్టడంతోపాటు ఇతర వాహనాల నుంచి కూడా ఎంతో కొంత ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జింక, దుప్పులు, అడవి పంది తదితర వన్యప్రాణులను వేటగాళ్లు హతమార్చి మాంసాన్ని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు ఎవరూ, వారు ఎక్కడికి సరఫరా చేస్తున్నారనే విషయాలు అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలోని 2 వందల ఎకరాల్లోని కోట్లాది రూపాయల విలువ చేసే టేకు వృక్షాలను గిరిజనులు పోడు వ్యవసాయం పేరిట నరికివేశారు. వందలాది ఎకరాల్లోని వేలాది టేకు వృక్షాలను నరికి అక్రమంగా కలపను ఇతర ప్రాంతాలకు ఇప్పటికే తరలించుకు పోయారు. అటవీ సంపద నాశనం కావడానికి కారకులైన ఆ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే స్మగ్లర్లు అడవులను పూర్తిగా ధ్వంసం చేశారు. వన్యప్రాణుల ను ఇష్టం వచ్చినట్లుగా వేటాడారు. ఆదిలాబాద్ జిల్లా అంటే దట్టమైన దండకారణ్యంతో ఒకప్పుడు అడవుల జిల్లాగా పేరు ఉండేది. ఆకాశాన్ని ముద్దాడే టేకు వృక్షాలతో కనుచూపు మేర పచ్చని చెట్లతో, పక్షుల కిలకిలరావాల, చెంగుచెంగున ఎగిరే జింకలతో అహ్లాదకరంగా ఉండేది. స్మగ్లర్ల, వేటగాళ్ల ధనదాహానికి అటవీశాఖ అధికారుల అవినీతి, అక్రమాలు తోడవడంతో అడవి తల్లి నేలకొరగగా, వన్యప్రాణులు అంతరించిపోయే దుర్భర పరిస్థితి దాపురించింది. రిజర్వు ఫారెస్టులో చెరువుల నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ పెంబి రిజర్వు ఫారెస్టులో చెరువులను నిర్మించారు. జిల్లా విస్తీర్ణంలో ఒకప్పుడు 40 శాతం ఉన్న అడవి ఇప్పుడు చాల తక్కువ శాతంలో ఉంది. అడవిని, కవ్వాల్ అభయారణ్యం నుంచి చిన్న కర్ర కూడా బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు.

# ఎంపీని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, మే 17 (జనంసాక్షి) :** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆసంఘం నాయకులు కుంబాల రాజేష్, చిలుక రాజనర్సు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అమలు జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, అధిష్టానం రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఒకవైపు భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాలంటూ దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తుండగా, తెలంగాణ ఇంకా మనువాద మత్తులో కొనసాగుతున్నదని అన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర దేశంలో మనువాదాన్ని కొనసాగిస్తున్న మంత్రి శ్రీధర్ బాబుకు మంత్రి పదవిలో కొనసాగే అర్హతను కోల్పోయారని అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణను అవమాన పరుస్తూ ప్రోటోకాల్ ను పాటించకుండా అవమానించడం శోచనీయం అన్నారు. ఈ సంఘటన యావత్ దళిత జాతిని అవమాన పరచడంగా భావించి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రోటోకాల్ ను పాటించకుండా ఎంపీని అవమానపరిచిన శ్రీధర్ బాబును మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షులు కుంభాల రాజేష్, చిలుక రాజనర్సు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం గోపాల్, ప్రధాన కార్యదర్శి రత్నం ఐలయ్య, అధికార ప్రతినిధి ఆకునూరి రాజ కుమార్, ఉపాధ్యక్షులు కుష్ణపల్లి రాజలింగు, బందేల మురళి, కాంపెల్లి రాజం, కార్యదర్శులు గద్దల కుమార్, గోగర్ల శేఖర్, గజ్జల రాంనాథ్, కాంపెల్లి సతీష్, సామర్ల కృష్ణ, కల్లెపల్లి నవీన్, గంగారపు రమేష్, ఎనగందుల శివాజీ, గౌరవ సలహాదారులు దాసరి బానయ్య, మాస మురళి, ఉండ్రాల్ల మల్లయ్య, బత్తుల రాజలింగు, కుష్ణ పల్లి నారాయణ, కారెంగుల మల్లేష్, అంగూరి సుభాష్, కార్యవర్గ సభ్యులు ఎలుక ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీతో లోకేశ్ కుటుంబం ఆత్మీయ భేటీ

**న్యూఢిల్లీ, మే17 (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీతో ఏపీ మంత్రి నారా లోకేష్ ఫ్యామిలీ భేటీ– అయింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ భేటీ జరిగింది. శనివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కుటుంబ సభ్యులు ప్రధానిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ ప్రధానిని కలిశారు. అమరావతి పునర్నిర్మాణం కార్యక్రమం సందర్భంలో కుటుంబ సమేతంగా వచ్చి తనను కలవాలని నారా లోకేష్‌ను ప్రధాని మోదీ కోరిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా నారా లోకేష్, బ్రాహ్మణిని కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ప్రధాని మోదీ, దేవాన్ష్‌ను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని మాట్లాడారు. ఈ భేటీలో రాష్ట్రంలోని పలు అంశాలు వీరిరువురి మధ్య చర్చకు వచ్చినట్టు– సమాచారం.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370